సంపుటి: 42
సంచిక: 5

ఫోన్ నెం:
64843

అపరాధ పరిశోధన

సచిత్ర డిటెక్టివ్ మాస పత్రిక

ఏడాది చందా (పత్రిక లేదా సప్లిమెంట్) 81 రూపాయలు.
హోమ్ డెలివరీ (సభ్యత్వ రుసుము) 10 రూపాయలు.

జూన్, 1986

మేనేజింగ్ ఎడిటర్:
శ్యామ దామోదర రెడ్డి

అసిస్టెంట్ ఎడిటర్:
డి. రవికుమార్

సీనియర్ ఎడిటర్స్:
వి. ఎస్. చెన్నూరి
ఏ. పి. మోహన్రావ్
ఆర్. ప్రభాకర్
బొమ్మిడి అచ్చారావు

తొలిమాట

నమస్కారము. ఇటీవల కాగితం ధర రెండుసార్లు పెరిగింది. ప్రింటింగ్ రేట్లు పెరిగాయి. పత్రిక నిర్వహణ ఖర్చు పెరిగింది. అందువలన పత్రిక రేటు స్వల్పంగా పెంచక తప్పటంలేదు. వచ్చేనెల నుండి పత్రిక ధర రు. 7-00 లు. ఏడాది చందా రు. 84-00 లు అవుతుంది. పాఠకులు ఎప్పటివలె మాతో సహకరిస్తారని ఆశిస్తున్నాము.

'హోమ్ డెలివరీ' సభ్యులకు యీ నెలతో చందా గడువు ముగుస్తుంది. వచ్చే నెల కాపీలు ఎప్పటివలె అర్ధ సంవత్సర చందా రు: 84-00 లకు V.P. ద్వారా పంపబడతాయి. V.P. చేరగానే విడిపించుకొన గోర్తాము.

ప్రఖ్యాత డిటెక్టివ్ రచయిత, డిటెక్టివ్ సాహిత్య తెలుగు వెలుగు కీ.శే. టెంపోరావ్‌గారు పరమపదించి జులై 24 వ తేదీకి ఏడాది పూర్తవుతుంది. డిటెక్టివ్ సాహిత్యానికి ఆయన చేసిన విశేష సేవను పురస్కరించుకొని, ఆయన ప్రథమ వర్ధంతి సందర్భంగా జులై నెల పత్రికలో 'టెంపోరావ్' గారి జీవిత చరిత్రను ప్రచురిస్తున్నాము. అలాగే యిదివరకు యేళ్ళ క్రితం పాఠకులు ఆయనతో చేసిన ఇంటర్వ్యూను కూడా ప్రచురిస్తున్నాము.

సెలవామరి—

మీ

శ్యామ దామోదర్ రెడ్డి.

ఈ నెలలో...

కథలు (మాస పత్రిక)

4. సుత్తి మేలు—జొన్నలగడ్డ రామలక్ష్మి
25. మరో మలుపు—నీలూ
44. పగటి వేషం—వి. యస్. రావ్
84. అతడు బ్రతకూడదు—కొలుపూరి త్రిమూర్తి సత్యనారాయణ
92. మృత్యు స్వప్నం—భీమవరపు పురుషోత్తం
120. అత్యాశ—వసుంధర
140. దంతపు కత్తి—ఎమ్.వి.వి. సత్యనారాయణ
157. దేవాంతకులు—బి.వి. ఈశ్వర్
168. నరసింహావతారం—(సీరియల్) వసుంధర

నవలలు (సప్లిమెంట్)

8. శిక్ష—వసుంధర
47. దెయ్యం పిలుస్తోంది—సుంకరి రాంప్రసాద్
103. అగ్ని నేత్రాలు—వి. యస్. రావ్
136. విషకన్య (సీరియల్)—బొమ్మిరెడ్డి అప్పారావు

ఇంకా— ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ, అపరాధ పరిశోధన పోటీ, కార్టూన్లు, మరెన్నో ఆకర్షణలు!!!

జొన్నలగడ్డ రామలక్ష్మి

సుత్తిమేలు

విశ్వం కళ్ళు ఆమెను దాటి పోలేకపోతున్నాయి.

ఫ్యాన్సీ షాపులో భర్తతోపాటు ప్రవేశిస్తోందామె. అప్పుడే షాపులోంచి బయటకు వెడుతున్నాడతడు. అప్పుడే అతడామెను చూశాడు. ఎందుకో ఒకే చూపులో అతడి నామె ఆకర్షించింది. షాపుల తన క్కావలసిన వస్తువుండి పోయినట్లు అతడు వెనక్కు తిరిగాడు.

అప్పట్నుంచి ఆమెనే గమనిస్తున్నాడు.

ఆమె షాపింగు అయిపోయింది. అక్కణ్ణించి ఆమె, భర్త ఇద్దరూ బయటకు వెళ్ళి స్కూటరెక్కారు.

విశ్వం తనూ తన స్కూటరెక్కాడు.

ఆ దంపతులు యింటిముందాగారు. విశ్వంమాత్రం ముందుకు దూసుకుని పోయాడు. కొద్దిక్షణాల్లో స్కూటరును వెనక్కు తిప్పాడు.

అప్పటికి ఆమె, భర్త యింట్లోకి వెళ్ళారు. స్కూటరు మాత్రం యింకా బయటనే వుంది.

విశ్వం స్కూటరు నెంబరు మనసులో మననం చేసుకున్నాడు. ఇంటిముందు నేమ్‌ప్లేట్ వుంది.

"టి. మదన్ బి.కాం"

"ఆమె శ్రీమతి మదన్ అన్నమాట" అనుకున్నాడు.

"ఇంకా వివరాలు తెలుసుకోవాలి" అనుకుంటూ మెట్లెక్కి గుమ్మం సమీపించి కాలింగ్‌బెల్ మ్రోగించాడు.

ఇంచుమించు వెంటనే తలుపు తెరుచుకుంది.

భర్త తలుపు తీశాడు. ఆమె కనపడుతూనే ఉంది— సోఫాలో కూర్చుని!

"క్షమించాలి - ఫ్యాన్సీషాపు నుంచీ మిమ్మల్ననుసరించి వస్తున్నాను" అన్నాడు విశ్వం.

అతడాశ్చర్యంగా—"ఎవరు మీరు?" అన్నాడు.

"కొత్తగా ప్రారంభించబడిన ఫ్రెష్ అండ్ ఫ్రెష్ కాస్మెటిక్స్— సేల్సు రిప్రెజెంటేటివ్‌ని" అన్నాడు విశ్వం.

"అయితే?" అన్నాడతడు.

"మా కంపెనీ ప్రాడక్ట్సింకా మార్కెట్లోకి రాలేదు. వచ్చే ముందు మేడ్ ఫర్ ఈచదర్ కాంటెస్టొకటి జరపా

లనుకుంటునాం. దానికి మొదలింగులో లేనివాళ్ళూ, సినీ తారలు కానివాళ్లూ కావాలి. ఫ్యాన్సీషాపు మిమ్మల్ని చూడగానే నేను వెతుకుతున్నది మీ జంటేననిపించింది."

ఆశ్చర్యంగా విశ్వం వంక చూసి "నాకేమీ అర్థం కావడం లేదు" అన్నాడు.

"లోపలకు రాస్తే అన్నీ వివరంగా చెబుతాను" అన్నాడు విశ్వం.

"అయ్యో - రండి లోపలకు...." అన్నాడతడు.

విశ్వం లోపలకు వచ్చాడు.

"డార్లింగ్....ఈయన ఫ్రెష్ అండ్ ఫ్రెష్ కాస్మెటిక్స్ సేల్స్ రిప్రజెంటేటివ్" అన్నాడతడు.

"నమస్తే!" అందామె.

"నా పేరు విశ్వం" అన్నాడు విశ్వం.

"నా పేరు మదన్....ఈమె శారద—నా భార్య!" అన్నాడు మదన్.

"నాకు మీ వివరాలు కావాలి...."

"నేను కాలేజీలో లెక్చరర్ని. మేమీ ఊరొచ్చి ఆర్నెల్లయింది. మాకు పెళ్ళయి యింకా ఏడాది కాలేదు...." అన్నాడు మదన్.

"లవ్లీ పెయిర్!" అన్నాడు విశ్వం.

"మీరు వచ్చిన పనేమిటో చెప్పండి—" అన్నాడు మదన్.

"నాకు మీ ఫోటోలు కావాలి. హెడ్డాఫీసుకు పంపుతాను...."

"ఎందుకు?"

"మేడ్ ఫర్ ఈచదర్ కాంటెస్టుకి—జంటలను సేల్సు రిప్రజెంటేటివ్స్ ఎన్నిక చేయాలి. ఉత్తమ జంట నెన్ను

కున్నవారికి పాతికవేల రూపాయల బహుమతి...."

"మరి ఆ జంటకేమీ ఉండదా?"

"లేకేం - మారుతీ కారు...."

భార్యాభర్తలిద్దరూ ముఖముఖాలు చూసుకున్నారు. మదన్ ఆమెకు సైగ చేశాడు. శారద లోపలకు వెళ్ళి ఫోటో ఆల్బం తెచ్చింది.

విశ్వం ఆల్బంలో ఫోటోలొకటొక్కటే చూశాడు. ఫోటోల్లో ఆమెను చూస్తూంటే అతడికి పిచ్చెత్తినట్ల యింది. అతి కష్టం మీద తన భావాల నదుపు చేసుకుని "ఇందుం ఇన్ని ఫోటో ఉన్నాయి కానీ - ఒక్కదాంట్లో కూడా మీ రిద్దరూ సినీప్రేమికుల్లా ఒకరి కొకరు దగ్గరగా వున్న ఫోటోలు లేవు" అన్నాడు.

"అంటే?" అన్నాడు మదన్.

"మీ రిద్దరూ ఒకరి ముఖంలోకి ఒకరు చూసుకుంటూం డాలి. మీ కనులలో చిలిపితనం - ఆమె కనులలో సిగ్గులు...."

"అందువల్ల మీకేం ప్రయోజనం?"

"పురుషుడిలో చిలిపితనం స్త్రీకి ఆకర్షణ. స్త్రీకి సిగ్గును మించిన ఆభరణం లేదు. చిలిపితనాన్ని మించి పురుషుడి ఆకర్షణ పెంచడానికీ - స్త్రీకి సిగ్గును మించి అలంకరించ డానికీ - ఆ రెంటి సమ్మేళనంతో మీవంటి అపురూపమైన జంటను తయారుచేయడానికీ - మా ప్రెష్ అండ్ ప్రెష్ కాస్మెటిక్సు ఉపయోగపడతాయి...." ఆగాడు విశ్వం.

"వండర్‌ఫుల్!" అన్నాడు మదన్.

"నేను మీకు ఫోటో తీస్తాను...." అన్నాడు విశ్వం.

"డార్లింగ్ - ఆర్ యూ రెడీ!" అన్నాడు మదన్.

"మీరు రెడీ అయినప్పటికీ నేను సిద్ధంగా లేను. కేవలం అనుమతి కోసం వచ్చాను. మీరు ఊఁ అంటే కెమేరా తీసుకువస్తాను" అన్నాడు విశ్వం.

"ఓ. కే." అన్నాడు మదన్ వెంటనే.

"చాలా థాంక్స్! అని విశ్వం వెనక్కు తిరగబోగా శారద మదన్ చేతిమీద గోకింది.

"మిస్టర్ విశ్వం! ఒక్కసారి ఆగండి...." అన్నాడు మదన్.

"ఏమిటి!"

"నా శ్రీమతి ఏమో అంటోంది."

"ఏమీ అనడంలేదు. మీ కంపెనీ కాస్మెటిక్స్ శాంపిల్సేమీ మీ దగ్గర లేవా?" అంది శారద మొహమాట పడుతూ.

"భలేవారే-కెమేరా తెచ్చినప్పుడే అవీ తేబోతున్నాను" అన్నాడు విశ్వం.

"దట్సాల్...." అన్నాడు మదన్ తమాషాగా భుజా లెగరేసి.

"మరో రెండు గంటల్లో మీ దర్శనం చేసుకుంటాను. నేను భోజనం చేసివస్తాను. అప్పటికి మీ భోజనాలు కూడా అయిపోతే సంతోషిస్తాను...." అని చకచకా వెళ్ళిపోయాడు విశ్వం.

2

విశ్వం వెళ్ళేసరికి టైము రాత్రి ఏడయింది.

"అలసటగా వుంది. లేనిపోని తద్దినం కొని తెచ్చుకున్నామనుకుంటాను" అంది శారద చిరాగ్గా.

"ఏమో-ఏ పుట్టలో ఏ పాముందో....ఇందులో మన కేమీ నష్టం లేదు కదా" అన్నాడు మదన్.

"ఏమండీ-నిజంగా మన జంట అంత బాగుంటుందా?" అంది శారద.

"మన జంటలో నువ్వొక అద్భుత సుమానివి. తేడా వుంటే నాలోనే వుండి వుండాలి" అన్నాడు మదన్.

"ఊరికే అలాగంటారు-నాచేత పొగిడించుకోవాలని!" అంది శారద.

"నిజం చెప్పనా?" అన్నాడు మదన్.

"ఊఁ."

"నువ్వు నన్ను పొగడక్కర్లేదు. తిట్టినా నాకు బాగానే ఉంటుంది."

"ఎందుకుట?"

"నువ్వు నా గురించి ఏదో ఒకటి మాట్లాడుతున్నావన్న భావన నన్ను పరవశుణ్ణి చేస్తుంది. ఎందుకంటే నీ ఆలోచనల్లో నేనున్నానని!"

"కవిత్వ మొకటి బాగా వచ్చు...." అంది శారద సిగ్గుపడుతూ.

"నా కావ్యం నా గానం....నీ కోసం!" అని-"అన్నట్లు నీమీద పాట పాడనా...." అన్నాడు మదన్.

"చాల్లెండి!" అంది శారద ముచ్చటగా భర్తవంక చూసి.

తర్వాత ఇద్దరూ భోంచేశారు.

"ఏం చీర కట్టుకోనో చెప్పండి" అంది శారద.

"ఆలోచించకుండా చెప్పేస్తున్నాను. లేత నీలంరంగు మీద చిన్న పువ్వులున్న గార్డెన్ చీర కట్టుకో. అందులో నువ్వు చాలా అద్భుతంగా ఉంటావు."

"సరే-మరి మీరేం వేసుకుంటారు?"

"నువ్వే చెప్పు...."

"మీకేమైనా బాగానే వుంటాయి."

"అలాగని తప్పించుకోకు.... నీ ప్రక్కన నీకు తగిన వాడిగా వుంటాయి. నన్ను నా కళ్ళతోకాదు. నీ కళ్ళతో చూసుకుంటాను—" అన్నాడు మదన్.

శారద అతడి కోసం సిమెంట్ రంగు సఫారీ సెలక్టు చేసింది.

"బట్టలు వేసుకుని రెడీగా వుందామా?" అంది శారద.

"అప్పుడే వద్దు.... ఒకవేళ అతడు రాకపోతే?"అన్నాడు మదన్.

"అవును-నిజమే అయినా ఫోటో కోసం డ్రస్సుగదా-ఇప్పట్నించీ అయితే నలిగిపోతుంది. ఈలోగా కాస్త మేకప్పవుదాం.... అతడు వచ్చాక ఓసారి లైట్‌గా టచ్ చేసుకుంటే సరిపోతుంది" అంది శారద.

"మేకప్ బాధ నీకేగానీ నాకు లేదు.... వెళ్ళు" అన్నాడు మదన్.

"వెళ్ళమనడం దాకా బాగానే వుంది. మేకప్‌ని బాధ అంటారేం?"

"బాధేమరి!" అన్నాడు మదన్.

"ఎందుకూ అంటున్నాను" అంది శారద కాస్త కోపంగా.

మదన్ మాట్లాడలేదు.

"బాగా ఖర్చవుతుందనికదూ మీ బాధ?"

"కాదు...." అన్నాడు మదన్ వెంటనే.

"అయితే మరెందుకో చెప్పండి...."

మదన్ మాట్లాడలేదు.

"మీరు చెప్పేదాకా నేను వెళ్ళను" మొండిగా అంది శారద.

"డార్లింగ్ - ఎందుకంత కోపం?"

శారద బుంగమూతి పెట్టింది తప్ప మాట్లాడలేదు.

"అయితే నిజం చెబుతున్నాను విను. నువ్వు మేకప్ చేసుకోవడం నా కిష్టముండదు" అన్నాడు మదన్.

"అదే - ఎందుకూ అంటున్నాను."

"మేకప్ సహజ సౌందర్యం లే వాళ్ళకి. నీకెందుకు?"

"నేను మేకప్ చేసుకుంటే బంగారానికి తావి అబ్బి నట్లుంటుందని కాలేజిలో నా క్లాస్‌మేట్సనేవారు...."

"వాళ్ళెవరు - ఆడా, మగా?"

శారద నవ్వి - "అన్నింటికీ ఎంత అనుమానమో - మగాణ్ణనిపించారు" అంది.

"అవును మరి - మగాళ్ళు తప్ప ఆడాళ్ళనలా పొగడరు...."

"మీరు నిజమే చెప్పారు."

"పోనీలే-నీ గతంతో నాకు నిమిత్తంలేదు" అన్నాడు మదన్.

శారద ముఖం ఎఱ్ఱబడింది - "అంటే మీ ఉద్దేశ్యం? నా గతం మంచిది కాదనా?" అంది.

"శారదా - కోపంలో ఇప్పుడు నీ బుగ్గలెఱ్ఱబడ్డాయి. ఈ సహజ వర్ణాన్ని లాక్టోకాలమిన్‌లో దాచేస్తే నాకెంత బాధగా వుంటుంది చెప్పు....నీ శరీరానికుండే సహజ పరిమళం కాస్మెటిక్సు మాటున మరుగున పడిపోతూంటే నేను చాలా నిరుత్సాహపడిపోతూంటాను. నువ్వు నాకు మేకప్‌లోకంటె లేకుంటేనే బాగుంటావు."

"మీరంతే-బట్టల విషయంలోనూ అలాగే అంటారు."

"అబ్బా - ఇప్పుడెందుకు గుర్తుచేశావు?" అన్నాడు మదన్.

"చేస్తే ఏం?"

"నాకు నీమీద మనసవుతోంది. కానీ డాక్టరు చెప్పిన ప్రకారం...."

శారద ఏదో అనబోయింది - సరిగ్గా అప్పుడే కాలింగ్ బెల్ మ్రోగింది.

"అతడేనేమో?" అంది శారద.

మదన్ టైము చూసుకుని "ఇప్పుడే ఎనిమిది దాటింది. అతడు తొమ్మిదింటికి కదా వస్తానన్నాడు!"

"కావచ్చు. కానీ పెందరాళే రావచ్చుగదా!...."

"చూస్తానుండు...."

"నే నిక్కడే వుంటాను. డ్రాయింగ్‌రూమ్‌లో అతడి కోసమే ఎదురు చూస్తున్నామన్న భావం అతడికి కలక్కూడదు" అంది శారద.

మదన్ గదిలోంచి బయటకు వెళ్ళాడు.

శారద డ్రెస్సింగు టేబిలు ముందుకు వెళ్ళి నిలబడింది. భర్త చెప్పిన మాటల్లో నిజానిజాలు గమనిస్తోందామె.

ఇంటికి తిరిగి రాగానే భార్యాభర్త లిద్దరూ వాష్‌బేసిన్ దగ్గర చల్లని నీళ్ళతో ముఖాలు కడుక్కున్నారు. తువ్వాళ్ళతో తుడుచుకున్నారు.

తర్వాత శారద బొట్టుమాత్రం పెట్టుకుంది.

ఇప్పుడు శారద ముఖానికి బొట్టు తప్ప వేరే అలంకరణ లేదు.

కొనదేరిన సంపెంగవంటి ముక్కు, లేత గులాబిరంగు బుగ్గలు, తీర్చి దిద్దినట్లున్న కనుబొమలు, పగడాలరంగులో పెదాలు, ముత్యాల్లా మెరిసే పళ్ళు—

"ఆయన నిజమే చెప్పారు. నే నిలాగే ఎక్కువ అందంగా ఉన్నాను...." అనుకుంది శారద.

ఈలోగా మదన్ లోపలకువచ్చి "శారదా! గుర్నాధం గారొచ్చారు....." అన్నాడు.

"గుర్నాధంగారా?" శారద గుండెల్లో రాయి పడింది.

"ఇష్!" అన్నాడు మదన్ - "ఆయనవి పాము చెవులు. నేను వెళ్ళి కూర్చుంటాను. నువ్వొ ఒక నిము షంలో వచ్చి అక్కడ కూర్చో!"

మదన్ తగ్గు స్వరంలో మాట్లాడటం గమనించి - తనూ తగ్గుస్వరంలోనే "ఆయనెంతసేపుంటాడో - ఆయ నుండగానే అతడొస్తే?" అంది.

"అదంతా తర్వాత చూసుకుందాం. నువ్వు మాత్రం పొరపాటున కూడా ఫ్రెష్ అండ్ ఫ్రెష్ కాస్మెటిక్సు గురించి మాట్లాడకు. అతడొచ్చి తప్పనిసరి అయితే తప్ప ఈ విషయం రహస్యంగా ఉంచుదాం. గుర్నాధంగారి సంగతి నీకు తెలుసుగదా - క్షణాలమీద ఊరంతా టాం టాం అయిపోతుంది. అక్కణ్నించి ప్రతిరోజూ ప్రతి వాళ్ళూ - కాంటెస్టు ఫలితాల గురించి ప్రాణాలు తీయడం మొదలవుతుంది" అన్నాడు మదన్.

"సరే-మీరు వెళ్ళండి!" అంది శారద.

3

గుర్నాధం ఆ వీధిలో చాలామందికి టెర్రర్‌గా ఉంటు న్నాడు. ఆయనకు వయసు నలభై దాటింది. చలాకీతనంలో కానీ, మనస్తత్వంలో కానీ ఆయన పదేళ్ళ కుర్రాడు. ఆయనకు ముగ్గురు పిల్లలు. అందరికీ పదేళ్ళపైనే వయసు.

"మా యింట్లో పదేళ్ళ కుర్రాడు మా ఆయనొక్కడే" అంటుందాయన భార్య జానకి.

గుర్నాధం ఏదో ఆఫీసులో పని చేస్తున్నాడు. ఉదయం

తొమ్మిదింటికి బయల్దేరి వెడతాడు. సాయంత్రం అయి దింటికల్లా తిరిగొస్తాడు. ఆఫీసులో ఏం చేస్తాడో తెలి యదు కానీ ఆఫీసుకు వెళ్ళొచ్చినప్పుడల్లా బోలెడు కబుర్లు పోగేసుకుని వస్తాడు. అవి వీధివాళ్ళందరికీ పంచిపెట్టా లన్నది ఆయన సదుద్దేశ్యం. అయితే ఏ యింటికి వెడితే ఆ యింట్లో వుండిపోతాడు. ఆయన కబుర్లకంత ముండదు.

గుర్నాథం వచ్చేడంటే ఏ యింటివారయినా గజగజ వణికిపోతారు. ఈ విషయం ఆయన భార్యకూ తెలుసు. అందుకే సాధారణంగా ఆయన్నో కంట కనిపెట్టి ఎక్క డికి వెళ్ళాడో గమనించి - వెళ్ళిన కాసేపట్లో అక్కడికి కబురుపెట్టి రప్పించేస్తుంది.

జానకిలో ఇతరత్రా చెప్పుకోతగ్గ మంచి లక్షణాలు లేకపోయినప్పటికీ - ఈ ఒక్క కారణంగా ఆ వీధిలో అందరి అభిమానాన్ని సంపాదించుకుంది. అంతేకాదు. గుర్నాథం సుత్తిని భార్యగా భరించక తప్పని పరిస్థితిలో వున్నందు కామె అంటే జాలి కూడా చాలామందికి ఉంది.

భార్య తనపై నిఘా వేస్తుందని గుర్నాథానికి తెలుసు. ఆమెకు తెలియకుండా బయటకు వెళ్ళడానికే ఆయన ప్రయత్నిస్తూంటాడు. గుర్నాథం ఆచూకీ తెలుసుకునేం దుకు సులభ మార్గంగా ఆమె ఆట్టే అవసరం లేకపోయినా ఇంట్లో ఫోన్ పెట్టించుకుంది. ఆమెకు సహకరించడం లోనే తమ సౌఖ్యమూ వున్నదని గుర్తించిన ఆ వీధి వాస్తవ్యులు చాలా మంది ఇంట్లో ఫోన్ పెట్టించు కున్నారు. ఆ వీధిలో ఎక్కువ ఫోన్ లుండడానికి కారణ మిదే!

ఇప్పుడు గుర్నాథం మదన్ ఇంటికి వచ్చాడు. ఆయన తన కబుర్ల నతడొక్కడికే చెప్పడు—"అమ్మాయిని కూడా పిలు!" అంటాడు. అందుకే మదన్ ముందుగా వచ్చి శారదను హెచ్చరించి వెళ్ళాడు.

"మీరు కుర్రాళ్ళు. తెలుసుకోవల్సిన విశేషాలు చాలా ఉన్నాయి. నాతో మాట్లాడితే పాతిక న్యూస్‌పేపర్లు చదివిన ఫలితం వస్తుంది. పది రేడియోస్టేషన్లు విన్నట్లుంటుంది. అమ్మాయిని రానీ అన్నీ చెబుతాను" అన్నాడు గుర్నాథం.

ఓ నిమిషంలో శారదకూడా అక్కడికివచ్చి నిల్చుంది.

గుర్నాథం కబుర్లు మొదలెట్టాడు.

ముందాయన ఫిలిప్పీన్సులో మార్కస్‌చేసిన అన్యాయాల గురించి ప్రస్తావించి శ్రీమతి ఆక్వినో ప్రెసిడెంటయిందని మెచ్చుకున్నాడు. స్వీడన్లో అకారణంగా ప్రధాన మంత్రిని చంపేశారని బాధపడ్డాడు. ఎయిడ్స్ అనే భయంకర వ్యాధిగురించి ప్రస్తావించి ఆ కారణంగా హాలీవుడ్ తారలు ముద్దు సీన్లంటే భయపడుతున్నారని సంతోషించాడు. క్రికెట్లో ఇండియా శ్రీలంక వెళ్ళడం లేదని—ఆ విషయమై తన అభిప్రాయం చెప్పాడు.

ఎదుటివాళ్ళు ప్రశ్నలడక్కపోయినా - ఆయనే అడగమని చెప్పి ఒకే విశేషాన్నే విపులీకరించాడు.

ఫిలిప్పీన్స్ ప్రెసిడెంటు మార్కస్ నియంత. ప్రతిపక్షనాయకుడు ఆక్వినో విదేశాలు పారిపోతే - స్వదేశంలో రక్షణ కల్పిస్తానని హామీయిచ్చి రప్పించాడు. అతణ్ణి ఎయిర్‌పోర్టులోనే ఎవరో కాల్చి చంపేశారు. అందులో తన హస్తం లేదన్నాడు. అటు ప్రజలు, ఇటు ప్రపంచం

ఒత్తిడి చేయగా చేయగా ఇటీవల ఎన్నికలు జరిపించాడు. ఎన్నికల్లో ఆక్వినో భార్య అతడి ప్రత్యర్థి. ప్రజలామెనే ఎన్నుకుంటారని తెలిసి ఫలితాలు తప్పుగా ప్రకటించాడు. మార్కొస్ క్రింద ఉన్న మిలిటరీ అధికారులే ఈ అన్యాయాన్ని సహించలేకపోయారు. వాళ్ళెదురు తిరగడంతో మార్కొస్ దేశం వదలిపెట్టాడు. శ్రీమతి ఆక్వినో ఫిలిప్పీన్సు ప్రెసిడెంటయింది.

స్వీడన్ ప్రధానమంత్రి పామే తన భార్యతో కలిసి సినిమాచూసి వస్తూండగా దుండగులు కాల్చి చంపారు. అందుకు కారణం కూడా చెప్పుకోతగ్గది ఉన్నట్లు కనపడదు. ఎవరై వుంటారో—హంతకులు తెలియక పోలీసులు కొట్టుకుచస్తున్నారు. ఆ పామేకు విశ్వశాంతి బహుమానంవచ్చి కొద్దినెలలే అయింది.

అక్వైర్డ్ ఇమ్మ్యూనల్ డెఫిసియన్సీ సింద్రోమ్ అనే నాలుగు పదాల తొలి ఆంగ్ల అక్షరాలను కలిపితే ఎయిడ్స్ అనే పదం వస్తుంది. అది ఆ వ్యాధికి ముద్దు పేరు. ఆ వ్యాధికి మందులేదు. అది సోకినవారిలో వ్యాధి నిరోధకశక్తి పూర్తిగా నశించి ఏ మందులూ వారిపై పని చేయవు. మనిషిని మనిషి దగ్గరగా కంటాక్టుచేయడం ద్వారా ఒకరినుంచి ఒకరికి సంక్రమించే అంటువ్యాధియిది.

ఈ వ్యాధి ప్రస్తుతం అమెరికాలో చాలా ఎక్కువగా ఉంది. ఈ వ్యాధి సోకుతుందని భయపడి హాలీవుడ్ తారలు చిత్రాల్లో ముద్దు సీన్లంటే వ్యతిరేకిస్తున్నారు. క్యాన్సర్ని మించిన ఈ భయంకరవ్యాధి ఇండియా కింకా వచ్చినట్లులేదు.

ఆమధ్య ఇండియా శ్రీలంక వెళ్ళి క్రికెట్టాడి ఓటమిని

చవిచూసి వచ్చింది. అందుకు శ్రీలంక అంపైర్లు కారణ మని ఇండియా కెప్టెన్ కపిల్‌దేవ్ ఉచ్చితంగా చెప్పాడు. ఆ తర్వాత అదే టీము ఆస్ట్రేలియా వెళ్ళి శ్రీలంకలోకంటె చాలా బాగా ఆడింది. ఇప్పుడు నాలుగుదేశాలు శ్రీలంకలో క్రికెట్టాడవలసి ఉంది. అవి ఇండియా, బంగ్లాదేశ్, శ్రీలంక, పాకిస్తాన్. శ్రీలంకలో తమిళుల సమస్య కార ణంగా భారతీయులకక్కడ సరైన రక్షణలేదని - భారత ప్రభుత్వం క్రికెట్ టూర్ కాన్సిల్ చేసింది.

గుర్నాథానికి సంబంధించినంతవరకూ ఇవి హెడ్ లైన్సు. ఇవి పూర్తికాగానే ఆయన దేశ విదేశాల్లో జరి గిన చిల్లర నేరాలగురించి చెప్పసాగాడు. అందులో మాన భంగాల ప్రసక్తి వచ్చింది. ఆయన వున్నట్లుండి— "అన్నట్లీఊళ్ళో ఓ రేపిస్టు తిరుగుతున్నాట్ట. ఏదో వంక పెట్టి వేళకాని వేళలో యిళ్ళలో ప్రవేశించి స్త్రీలకు మాన భంగం చేస్తున్నాట్ట" అన్నాడు.

"మరి అతణ్ణి పోలీసులకు పట్టివ్వలేదా?"

"నాకు మానభంగం జరిగిందని చెప్పుకునేందుకు అయినింటి ఆడదెవరూ ముందుకు రాదుగదా—అయితే పాఠకులను హెచ్చరిస్తూ పత్రికలకు ఆకాశరామన్న ఉత్త రాలు వెళ్ళాయి. అలాంటి ఉత్తరాలు నాలుగింటిని ఓ దిన పత్రిక ప్రచురించింది. నలుగురివీ ఒకేరకం అనుభవాలు".

"సరదాకెవరో రాసివుంటారు. నాలుగుపేర్లతో రాసినా రాసింది ఒక్కరే అయుంటారు...." అన్నాడు మదన్ తేలికగా నవ్వి.

"ఏమో—ఈ రోజుల్లో జాగ్రత్తగా ఉండడం మంచిది....అతడు చాలా తెలివైనవాడనీ నమ్మించే కథలు

చెబుతాడనీ—తన అవసరం తీర్చుకోవడానికి నిర్దాక్షిణ్యంగా ప్రవర్తిస్తాడనీ ఆ ఉత్తరాల్లో రాశారు" అన్నాడు గుర్నాధం.

"అసలతడు ఇళ్ళలోకి ఎలా ప్రవేశిస్తాట్ట?" అన్నాడు మదన్.

"తలుపుతట్టో, కాలింగ్‌బెల్ కొట్టో దర్జాగా యింట్లో ప్రవేశిస్తాట్ట. ఏకంపెనీకో సేల్స్‌రిప్రజెంటేటివ్‌నంటాట్ట."

మదన్, శారద—ఇది వింటూనే ముఖముఖాలు చూసుకున్నారు.

గుర్నాధం ఇంకా ఏదో చెబుతూండగా గదిలో ఫోన్ మ్రోగింది.

శారద లేచివెళ్ళింది. అది జానకి ఫోను. ఇంటికెవరో వచ్చారనీ అర్జంటుగా గుర్నాధాన్నింటికి పంపమనీ ఆమె ఫోన్ చేసింది.

గుర్నాధం తమ యింట్లో ఉన్నట్లు తెలుసుకునేందుకు జానకి కింతసేపు పట్టిందని శారద అర్థంచేసుకుంది. బహుశా ఆమె ఈలోగా చాలా యిళ్ళకు ఫోన్ చేసి ఉంటుందని కూడా అనుకుంటూనే విషయం గుర్నాధానికి చెప్పింది.

"ఇంటి కెవరూ వచ్చివుండరు. అది చెప్పింది నిజమయుండదు. అయినా ఆమాకీ తెలిశాక—అదిలా చెప్పాక ఇంటికివెళ్ళడం తప్పదు" అని విసుక్కుంటూ గుర్నాధం లేచాడు.

"ఎప్పుడొచ్చినా కాఫీతాగే టైమైనా ఉండదు మీకు...." అంది శారద లేనిబాధను నటిస్తూ - కలిగిన సంతోషాన్ని కప్పిపుచ్చుకుంటూ.

"కాఫీ తాగే టైములో మరి నాలుగు కబుర్లు చెప్పచ్చు.

ఎవరిళ్ళకైనా వెళ్ళినప్పుడు కాఫీలూ, టిఫిన్‌లూ అంటే అందుకే నాకు గిట్టదు....” అని వెళ్ళిపోయాడు గుర్నాధం.

4

టైము సరిగ్గా తొమ్మిదయ్యేసరికి కాలింగ్‌బెల్ మ్రోగింది.

మదన్ వెళ్ళి తలుపు తీశాడు.

బయట విశ్వం నిలబడి వున్నాడు. మదన్‌ని చూస్తునే చిరునవ్వు నవ్వి “నేను చాలా పంక్చ్యుయల్ కదూ!” అన్నాడు.

“లోపలకు రండి!” అన్నాడు మదన్.

విశ్వం లోపలకు నడిచాడు. ఇప్పుడతడి చేతిలో బ్రీఫ్ కేసుంది.

మదన్ తలుపువేసి విశ్వాన్ననుసరించాడు.

“మీ శ్రీమతి రెడీయేనా?” అన్నాడు విశ్వం.

“నా గురించి అడక్కుండా శ్రీమతి గురించి అడుగుతున్నారు” అన్నాడు మదన్ నర్మగర్భంగా నవ్వుతూ.

“ఫొటో అంటే ఆలస్యంచేసేది ఆడవాళ్ళేకదా!” అన్నాడు విశ్వం చిరునవ్వు నవ్వి.

“నా విషయంలో మాత్రం అది అబద్ధం” అంటూ అప్పుడే అక్కడకు వచ్చింది శారద.

అయిదడుగుల మూడంగుళాల శారద ఎత్తులో తప్ప అందంలో తనకు పరిమితి లేదన్నట్లుంది. లేత నీలంరంగు గార్డెన్‌చీర ఆమె అందానికి ముచ్చటపడి కౌగలించుకున్నట్లుంది.

ఒక్కనిముషం విశ్వమామెను కళ్ళప్పగించి చూశాడు. అయితే ఒక్క నిముషం మాత్రమే!

“మిస్టర్ మదన్! మీరుకూడా రెడీయేనా?” అన్నాడు

విశ్వం.

"జస్టేమినిట్ - డ్రస్‌మార్చుకుని వస్తాను...." అంటూ లోపలకు వెళ్ళాడు మదన్.

విశ్వం సోఫాలో కూర్చుని బ్రీఫ్‌కేసు తెరిచి కెమేరా బయటకు తీశాడు. శారద అతడివంకే కుతూహలంగా చూస్తోంది.

విశ్వం బ్రీఫ్‌కేసు మూసి టీపాయ్‌మీద పెట్టాడు. తర్వాత కెమెరా వ్యూలోంచి గదినంతనూ పరిశీలనగా చూడసాగాడు. అతడు గదిని చూస్తున్నాడో తననే ఎక్కువగా చూస్తున్నాడో శారద కర్థంకాలేదు. కానీ చాలాసేపు అతడామెనే పరిశీలనగా చూశాడు.

కాసేపట్లోనే సిమెంట్ కలర్ సఫారీలో మదన్ వచ్చాడు. విశ్వం వారిద్దర్నీ పక్కపక్కగా సోఫాలోనే తను కోరినవిధంగా కూర్చోపెట్టాడు. పొరపాటున కూడా అతడు శారదను తాకకుండా జాగ్రత్తపడ్డాడు.

తర్వాత యిద్దరికీ రెండు స్నాప్స్ తీశాడు.

"మాకూ్కడా కాఫీ తీస్తారా?" అన్నాడు మదన్.

"తప్పకుండా - అయితే ఇప్పుడుకాదు.... రెండ్రోజుల తర్వాత...." అంటూ విశ్వం కెమేరాను తిరిగి బ్రీఫ్ కేసులోపెట్టి చిన్నసీసాలు రెండు తీశాడు. రెండూ తను వాసన చూశాడు. తర్వాత అవి మదన్‌కీ, శారదకీ యిచ్చి "మా్రెష్ అండ్ ఫ్రెష్ - శాంపిల్సు. వీటి పరిమళమే వేరు...." అన్నాడు.

భార్యాభర్తలిద్దరూ సీసాలందుకున్నారు. వాసన చూస్తూనే యిద్దరూ పక్కకు వాలిపోయారు.

విశ్వం తృప్తిగా వారిద్దరివంకా చూశాడు. ఒక్క నిముషం ఆగి శారదను సమీపించాడు. ఆమెను రెండు

చేతులతో ఎత్తి పడకగదిలోనికి తీసుకునివెళ్ళి మంచం మీద పడుకోబెట్టాడు.

ఆమెను చూస్తూంటే అతడిలో ఉద్రేకం పెరుగుతోంది.

విశ్వం జేబులోంచి ఇన్‌హేలర్‌వంటి సాధనంతీసి ఆమె ముక్కుపద్ద పెట్టాడు. శారద చటుక్కున కదిలి లేచి కూర్చుంది.

"నీభర్త గాఢనిద్రలో వున్నాడు. ఉదయందాకా నిద్ర లేవడు. నువ్వు నాతో సహకరిస్తే స్వర్గం చూపిస్తాను. లేదా మానభంగం చేస్తాను. అరిచి అల్లరిపెట్టాలని చూశావా - యాసిడ్‌పోసి నీ ముఖసౌందర్యం నాశనం చేస్తాను. నీ భర్తను చంపేస్తాను. ఆలోచించుకో!" అన్నాడు విశ్వం ఆమెతో.

"ఎవరు నువ్వు?" అంది శారద కంగారుగా.

"మానభంగం నా వృత్తి. నచ్చిన స్త్రీని ఆమె ఇంట్లోనే యధేచ్ఛగా అనుభవించడానికి నా దగ్గర ఎన్నో తెలివైన పథకాలున్నాయి. నీవు, నీభర్త వాసనచూసిన మత్తుపదార్థాలు - ముందుగా నేను ఊపిరి బిగపట్టి వాసనచూసినట్లు నటించాను. క్షణాలమీద స్పృహ తప్పించగల అద్భుత రసాయనాలవి." అన్నాడు విశ్వం.

"అయితే నువ్వు చెప్పినవన్నీ అబద్ధాలేనా?" అంది శారద.

"ఇంతవరకూ చెప్పినవన్నీ అబద్ధాలే! ఇప్పుడు చెబుతున్నవి నిజాలు. ఈవిధంగా యింతవరకూ నేను అరవై నలుగురు స్త్రీలను అనుభవించాను. ఒక్క కేసుకూడా ఫెయిల్‌కాలేదు. ఈవేళా ఫెయిల్‌కాను...." అన్నాడు విశ్వం.

శారద విశ్వాన్నే పరీక్షగా చూసింది.

అతడి కళ్ళలో అంతులేని కాంక్షవుంది. ఆ కాంక్ష ఆమెను దుస్తులున్నా వివస్త్రగా చూస్తోంది. అతడిలో విప రీతమైన పట్టుదల కనబడుతోంది. ఆ పట్టుదల ఆమెకు మానభంగం చేస్తోంది. అతడిలో తెలివి అపరిమితం. ఆ తెలివి మరో కేసుకు ప్రోగ్రామ్ అయిపోతోంది.

"నిన్ను చూడగానే ఎంతో మంచివాడని పించింది. నువ్విలాంటి వాడి వనుకోలేదు. నీ గురించి ఈ విధంగా ఊహించుకోలేదు...." అంది శారద.

"కబుర్లు వద్దు...." అంటూ ఆమెను సమీపించాడు.

శారద చటుక్కున టైము చూసుకుని "ఆగు....నే నొక్కసారి అర్జంటుగా డాక్టరుకు ఫోనుచేయాలి!" అంది.

"ఎందుకు?" అన్నాడతడు.

"ఇటీవల మాయింటికో అమెరికన్ అమ్మాయి అతి థిగా వచ్చింది. వారి ఆచారాలేమిటో తెలియదుగానీ ఒక పూట నన్ను "సోస్వీట్!" అంటూ పెదాలమీద బలవం తంగా ముద్దుపెట్టుకుంది మగాడిలాగా. ఆ తర్వాతనుంచి నన్నేదో వ్యాధి పీడిస్తోంది. డాక్టర్ని పిలిస్తే - కొంత కాలం - మా భార్యాభర్తలు దూరంగా ఉండాలని చెప్పాడు. నాకు భయంకరమైన అంటువ్యాధి సోకిందనీ—దాని నివా రణ అసాధ్యం కావచ్చుననీ కూడా ఆయన అన్నాడు. ప్రతిరోజూ రాత్రి పదిగంటలలోగా తనకు ఫోన్‌చేసి తనిచ్చే మందులెలా పనిచేస్తున్నాయో చెప్పమని మా డాక్టరు చెప్పాడు...."

"నువ్వబద్ధం చెబుతున్నావు....ఇప్పుడు నిన్ను బయ టకు ఫోన్ చేయనివ్వను...." అన్నాడు విశ్వం.

"నీయిష్టం. కానీ నే నబద్ధంమాత్రం చెప్పడంలేదు. నా జబ్బుకు సంబంధించిన రిపోర్టు కూడా-అదిగో అక్కడ

ఉంది'' అంటూ చూపించింది.

డ్రెస్సింగ్ టేబుల్‌పద్ద పౌడరు డబ్బాక్రింద ఉందో కాగితం. అందులోని వివరాలు చూసి అతడు లిక్కిపడ్డాడు.

"నీకు - ఎయిడ్సా?'' అన్నాడు.

శారద దిగులుగా తల ఊపింది.

"నిజంగా ఎయిడ్సా?''

శారద మాట్లాడలేదు.

విశ్వం కళ్ళకి ఆమె అప్పుడు పడగనెత్తిన నాగు పాములా కనబడింది. అతడు భయంగా "నువ్విక్కడే ఉండు. ఎంతో తెలివిగా ఇంత పథకంవేసిన నేను చివ రికి రాంగ్ నెంబరుకు వచ్చాను....'' అంటూ అక్కణ్ణించి క్షణాలమీద బ్రీఫ్ కేసుమాత్రం తీసుకుని వెళ్ళిపోయాడు.

అతడు వెళ్ళినవెంటనే శారద గుర్నాథానికి ఫోన్‌చేసి అర్జంటుగా రమ్మనమంది. క్షణాలమీద ఆయన వచ్చాడు. హఠాత్తుగా తన భర్తకు స్పృహతప్పిందనీ - తనకేం చేయాలో తెలియడంలేదనీ ఆమె అంది.

కొద్దిసేపట్లోనే గుర్నాథం మదన్‌కు స్పృహతెప్పించ డమేకాక - ఓ రెండు గంటలు కూర్చుని సుత్తికొట్టి వెళ్ళాడు. ఆయన వెళ్ళాక మదన్‌కు శారద జరిగింది చెప్పింది. మదన్ భార్యను మెచ్చుకుని "అంతా బాగానే ఉందికానీ నువ్వు గుర్నాథాన్నెందుకు పిలిచావు?''అన్నాడు.

"అందుకు రెండు కారణాలున్నాయి. ఆయన వచ్చి చెప్పడంవల్లనే విశ్వంమీద నాకొంత అనుమానం కలి గింది. అవసరమైతే పనికివస్తుందని నకిలీ డాక్టరు రిపోర్టు తయారుచేసి ఉంచాను. మీరుండగా అతడింత ధైర్యం చేస్తాడని నమ్మలేదు కానీ నిజంగానే అలా జరిగేసరికి గుర్నాథం సుత్తివల్ల మేలు పొందాను. అందుకాయన్ను

సన్మానించాలనిపించింది. పిలిచి మరీ ఆయన కబుర్లు వినడానికి మించినసన్మానం ఆయనకు వేరే ఏముంటుంది?"

"మరి రెండో కారణం?"

"ఎయిడ్స్‌కు మించిన వ్యాధి మగాడికుంటుంది. దాని పేరు అనుమానం. అది మీకు సోకకుండా ఉండాలంటే మీకు స్పృహతప్పినాక ఇరవై నిమిషాల్లోగా ఈ యింట్లో మరో మనిషి ఉండడం ఎంతైనా అవసరమనిపించి - గుర్నాథంగారిని పిలిపించాను. లేకుంటే నేనే ప్రయత్నించి మీకు మెలకువ తెప్పించేదాన్ని...." అంది శారద.

మదన్ చటక్కున భార్యను దగ్గరగా తీసుకున్నాడు. శారద అతడి గుండెలపై వాలి "ఎయిడ్స్ ప్రమాదకరమైన వ్యాధి. అతివాగుడు మనిషికి జబ్బులాంటిది. ఈ రెండింటి వల్లా మనం ప్రయోజనం పొందామంటే - జబ్బులు కూడా మేలు చేస్తాయనిపిస్తోంది" అంది. □

అతనికంటె ఘనుడు



నీవా
మరో మలుపు



ఉదయం ఆఫీస్‌కు వచ్చాకగాని తలనొప్పి అనిపించలేదు.

లేకుంటే శుభ్రంగా లీవ్ పెట్టి ఉందును. దాంతో పాటు కొంచెం నొప్పిగా ఉన్నట్లనిపించింది గొంతుదగ్గిర.

ఎవరిదగ్గరైనా పెయిన్‌బామ్ దొరుకుతుందేమోనని

అడిగి చూశాను. ఎవరిదగ్గరా లేదన్నారు.

రానోయేది శీతాకాలం. ఇంటిదగ్గర కూడా అయి పోయింది. ఓ బాటిల్ కొనుక్కురమ్మని శ్రీమతి ఒకటే గొడవ చేస్తూంది. రోజూ మరిచిపోతున్నాను. ఈ పూట ఇక తప్పదు. వెంటనే అటెండర్ రాజును పిలిచాను.

"తలనొప్పికి మందు తెచ్చిపెట్టవోయ్" అన్నాను పది రూపాయల కాయితం అందిస్తూ.

"టాబ్లెట్సా" అన్నాడు.

"కాదు. అమృతాంజనం లాంటిదేదైనా"

"అది మరీ స్ట్రాంగ్. మరో రకం వుంది. పట్టుకొస్తా నుండండి" అన్నాడు.

"నీ ఇష్టం. ఏదో ఒకటి పట్టుకురా" అన్నాను.

తల నొప్పితోనే ఫైల్స్ తీశాను. ఈ రోజు పెద్దగా పనేంలేదు. ఓ వారంరోజులుగా ఇంటికి, ఇద్దరు మిత్రులకు లెటర్ రాయాలనుకుంటున్నాను. కుదరటంలేదు. మందు రాసుకున్నాక ఆ పని పూర్తి చేయాలనుకొన్నాను.

పది నిముషాల్లో రాజు వచ్చాడు. అతను తెచ్చింది కొత్త ప్రొడక్టేంకాదు. అది కూడా వచ్చి చాలా కాల మయింది. కాకపోతే మన ప్రాంతంలో దాని వాడకం తక్కువ. ఈ నడుమే ఊపందుకుంటూంది. చిల్లరజేబులో వేసుకొని బాటిల్ తీశాను. సీల్‌వేసి ఉంది. బ్లేడ్‌తో కట్ చేసి మూత తెరిచాను.

క్షణకాలం ఆశ్చర్యపోయాను.

నాలుగింట రెండువంతులు మందు అందులో లేదు.

ఆ ప్రాంతమంతా డొల్లగా వుంది.

ఆ సీల్‌వేసిన పద్ధతి మూలంగా అది కనపడలేదు.

"రాజూ, ఇలారా" అని పిల్చాను.

"ఏంటిసార్" అంటూ వచ్చాడు.

"ఇది చూడయ్యా, ఎలా ఉందో" అన్నాను.

"అరే" అన్నాడు ఆశ్చర్యపోయి.

"వెళ్ళి ఆ షాపులో చూపించు" అన్నాను.

రాజు మొఖం మాడిపోయింది. తాను ఎంతో గొప్పగా చెప్పినమందు ఇలా ఉండటంతో అతను కొంత చిన్న బుచ్చుకున్నాడు. వెంటనే అతను సైకిల్ తీసుకుని బయలు దేరాడు.

"ఏం బ్రదర్ మందు తక్కువ వచ్చిందా" అన్నాడు మాకొలీగ్ సూర్యం.

"అవునండి అందుకే షాప్‌కు పంపించాను"

"వాడేం చేస్తాడు సీల్ తీశాక తనకి సంబంధం లేదంటాడు."

"అదెలా" అన్నాను.

"వాడు కాదుగదా తయారు చేస్తుంట"

"అయితే ఈ లాస్ మనం భరించాల్సిందేనా?" అన్నాను.

"చచ్చినట్లు. మొన్న నాకూ ఇలానే వచ్చింది. ఏం చేస్తాం. అదృష్టం బాగుంటే పూర్తిబాటిల్ వస్తుంది. లేకుంటే వచ్చినంత తీసుకొని రాసుకోవటమే" అన్నాడు.

"అదేమిటి సూర్యం. బై మిస్టేక్ జరిగితే వేరేవిషయం. ఇదో కామన్‌విషయం అయితే ఎలా టాలరేట్ చేస్తాం చెప్పండి" అన్నాను.

"టాలరేట్ చెయ్యక ఏంచేస్తాం చెప్పండి. రిటైలర్ నాకు సంబంధం లేదంటాడు. మీరు కంపెనీకి రాయాలి. వాళ్ళా లెటర్స్ బుట్టదాఖలా చేస్తారు. కనీసం జవాబురావాలంటే నెలలు పడుతుంది. అప్పటిదాకా మీరు

వాడకుండా ఆ బాటిల్ ఉంచుతారా. కొన్ని విషయాలంతే. మనమేం చెయ్యలేం” అన్నాడు సూర్యం.

“నో. మనం అలా నిరాశపడితే ఏ సమస్యా పరిష్కారంకాదు. క్రైమ్ జరుగుతుందని తెలిసినప్పుడు, అందుకు మనం బలయిపోతున్నప్పుడు కూడా ఏక్షన్ తీసుకోకపోవటంలో అర్థంలేదు” అన్నాను.

సూర్యం నవ్వి ఊరుకున్నాడు.

ఆయనలా ఫీలవటంలో కూడా ఆశ్చర్యంలేదు. మనం కొంటున్న బియ్యంలో రాళ్ళు, నూనెల్లో కల్తీ! ఏ రంగంలో అన్యాయం జరగటంలేదు? ఈ ప్రశ్నకు జవాబు దొరకదు. అవన్నీ మనం భరించటంలేదా! అలాంటప్పుడు ఆఫ్టాల్ తలనొప్పి మందుతో తలనొప్పి ఎందుకు? ఈ నష్టంకాక వారికి రాసే కవర్ ప్లస్ స్టేషనరీ వేస్ట్. ఓ రకంగా ఆలోచిస్తే ఇది నిజమే.

కానీ ఇలాంటివన్నీ ఎక్కడో చోట, ఏదో పాయింట్ లో ఆగిపోవాలి. వినియోగదారులు చిల్లిపెంకులు కాదు కదా ఇస్తుంది. ఈ విషయంమీద ఆ క్షణంలోనే నాకు పట్టుదల ఏర్పడింది.

“సీల్ తీశాక మావల్ల కాదంటున్నాడు సార్” అంటూ వచ్చాడు రాజు.

“సీల్ తియ్యకుంటే అందులో తగ్గిందని ఎలా తెలుస్తుంది” అన్నాను.

“ఏమోసార్? లాభంలేదన్నాడు” అన్నాడు రాజు దిగులుగా.

“సర్లే ఏంచేస్తాం. ఆ బాటిలిటివ్వు” అన్నాను.

సూర్యం నవ్వుతున్నాడు. ఆ నవ్వులో ఇదంతా సహజం అనే భావం వుంది. కానీ అతను గుర్తించాల్సింది

ఒకటుంది. ఇదంతా అసహజమైన అంశం. ఆ విషయాన్ని నేను ఋజువుచేస్తాను.

వెంటనే ఆ కంపెనీకి చెందిన హెడ్ ఆఫీస్‌కు లెటర్ రాయటానికి పూనుకున్నాను. లెటర్ ఇంగ్లీషులో రాస్తున్నాను.

"డియర్ సర్స్,

నేను మీ కంపెనీ తాలూకు పెయిన్‌బామ్ ఈ రోజు కొన్నాను. అది మీ కంపెనీకి చెందిన సీల్‌తో వుంది. తెరిచి చూస్తే దాదాపు రెండూ బై నాలుగోవంతు మందు ఉండాల్సిన ప్రాంతంలో డొల్లవుంది. వెంటనే ఈ విషయాన్ని రిటైలర్ దృష్టికి తీసుకు వెళ్లాను. కానీ అతను తన అసహాయతను వెల్లడించాడు.

మీ కంపెనీమీద నమ్మకంతో, మీ ప్రొడక్ట్ ఖరీదు చేసిన నేరానికిగాను నష్టం పొందింది నేను. ఈ సందర్భంలో నాకు కొన్ని అనుమానాలున్నాయి. ఈ విధంగా తక్కువ మందు రావటంలో రెండు పద్ధతులున్నాయి.

మొదటిది కావాలని తక్కువ నింపటం.

రెండవది పొరపాటు జరగటం.

కేవలం పొరపాటువల్లనే మందు తగ్గి వుంటే కొంత వరకూ అర్థం చేసుకోవచ్చు. కావాలని చేస్తేనే సమాధాన పడలేం. ఓ ప్రముఖ కంపెనీ ఇలాంటి అల్ప చర్యలకు పాల్పడబోదని నాకు తెలుసు. అయినా సరే మార్కెట్‌లోకి మీ ప్రొడక్ట్ విడుదల చేసేముందు చెక్ చెయ్యండి. కావాలని చేసినా, పొరపాటు జరిగినా అది భరించేది సామాన్య వినియోగదారుడు. ఈ విషయం ఎల్లప్పుడూ మీ దృష్టిలో ఉండటం అవసరం.

మీకు అవసరమనుకుంటే ఆ బాటిల్ పంపించగలను.

ఈ విషయంలో మీనుండి సరైన రెస్పాన్స్ లభించగలదని భావిస్తున్నాను. ఆ బాటిల్‌కు చెందిన కోడ్ నెంబర్ మాన్యుఫేక్చరింగ్ డేట్ వగైరాలు ఈ క్రింద తెలియ చేస్తున్నాను. అలాగే నా చిరునామా రాస్తున్నాను. మీ నుండి జవాబు రాగలిగితే ఆనందిస్తాను."

ఆ లెటర్లో నా అడ్రస్, ఆ బాటిల్ వివరాలు రాశాక సంతకంచేసి కవర్‌లో వుంచాను.

ఆ లెటర్ చివర్లో ఓ కొస మెరుపునైతం సృష్టించాను.

"ఓ బాధ్యతగల జర్నలిస్టుగా ఈ విషయాన్ని మా ప్రాంతీయ దినపత్రికలోగాని, జాతీయ పత్రికల్లోగాని ప్రకటించబోవటంలేదు. కారణం మనిషికి తప్పులు చేయటం సహజం కాబట్టి."

కవర్ మీద హెడ్ ఆఫీస్ అడ్రస్ రాశాను.

"రాజూ, ఈ లెటర్ క్లోజ్ చేశాక పోస్టుచేసిరా" అన్నాను.

ఓ రకమైన పట్టుదల నన్నీ పనికి పురికొల్పింది. ఇలాంటి విషయాలు సహజమని నాకూ తెలుసు. అందుకే ఆ బాటిల్‌లో మందుతీసి నుదుటికి రాసుకోవాలను కున్నాను.

ఇప్పుడు నాకు తలనొప్పిగా అనిపించటంలేదు!

అంత త్వరగా ఎలా మాయమయిందో అర్థంకాలేదు. నా చర్యలన్నీ సూర్యం చిరునవ్వుతో గమనిస్తున్నాడు.

"చూడు సూర్యం. నేనెటూ నష్టపడ్డాను. మరో రూపాయి నష్టం అనుకో. కానీ ఈ విషయం అక్కడ రికార్డవుతుంది" అన్నాను.

సూర్యం బదులుగా నవ్వేడు.

అదే....అదే నా పట్టుదలకు కారణం!

2

"మొత్తానికి ఈ రోజు మోక్షం కలిగిందన్నమాట" అంది నా శ్రీమతి జేబులోనుండి పాకెట్ తీస్తూ.

"ఈసారి ఈ బాటిల్ తెచ్చారా. బాగుందంటున్నారండీ" అంది మూత తీస్తూ.

"అరే. ఇదేమిటి ఇందులో సగం వుంది. అప్పుడే ఇంతయిపోయిందా?" అంది చూశాక.

"అదేం లేదు. ఆ బాటిల్లో అంతే వుంది."

"ఇదేం అన్యాయమండి."

"ఏం చేస్తాం చెప్పు."

"ఏం చెయ్యటమేమిటి....ఆ బాటిల్ కొట్టువాడి ముఖాన కొట్టక."

"వాడు తయారుచేసేదయితే ఆ పనే చేసేవాడ్ని. పాపం అతనేం చేస్తాడు" అన్నాను.

ఆవిడకేం మాట్లాడాలో అర్థం కాలేదు.

"కలికాలం వచ్చింది. ఈ ప్రపంచం మారణహోమం అయిపోవటానికే ఈ బుద్ధులు పుడుతున్నాయి" అంటూ ప్రపంచంమీద దుమ్మెత్తిపోసింది.

"నువ్వెక్కబోయే రైలు ఓ జీవితకాలం లేటు అన్నాడొక కవి. అలాగే నీకు మిగిలిన మందే నిజం. అంతకు ముందుది నువ్వు వాడుకున్నది" అన్నాను.

"ఈ కథలు మాత్రం చెబుతారు. అయినా తమరి చెయ్యి ఎక్కడపడితే అక్కడ నాశనమేగా" అంటూ మూతి వంకరలు త్రిప్పి వెళ్ళింది.

ఒక విషయం మాత్రం నిజం. నేనో విషయం గురించి మొదలయితే మధ్యలో ఆగిపోను.

సరిగ్గా పదిరోజులు గడిచాయి.

పదిరోజుల తర్వాతే నేను జవాబు ఎక్స్‌పెక్టు చేస్తున్నాను. ఎందుకంటే నా లెటర్ చేరటానికి కనీసం రెండురోజులు పడుతుంది. వారు వెంటనే స్పందించటం జరిగితే రెండు మూడు రోజులకు జవాబివ్వటం, అది పోస్టయి వచ్చేనాటికి ఆమాత్రం సమయం తీసుకుంటుంది.

నేను ఊహించిన విధంగానే సరిగ్గా పదిహేనో రోజున నా కో కవర్ వచ్చింది. అప్పటికి నేను ఊర్లో లేను. రెండు రోజులు శెలవుమీద వెళ్ళాను. ఆఫీస్‌కు వెళ్ళగానే నవ్వుతూ సూర్యం లెటరందించాడు. ఈసారి నవ్వులో మొత్తంమీద సాధించావే అనే భావం వుంది.

"త్వరగా చదువు గురూ ఏంరాశాడో చూద్దాం" అన్నాడు.

చదివాను. అందులో సారాంశం ఇది.

"డియర్ సర్

మీ లెటరు అందింది. మొదటగా మీరు మా కంపెనీ కస్టమర్ అయినందుకు మా ధన్యవాదములు. మామూలుగా ఆటోమేటిక్ యంత్రాల ద్వారా బాటిల్స్‌లోకి మందు నింపుతున్నాం. మీ లేఖ మమ్మల్ని ఆశ్చర్యం గొలిపేలా చేసింది. మీ ఊరిలోగల మా రిప్రజెంటేటివ్‌తో మీ బాటిల్ రీ ప్లేస్ చేసే ప్రయత్నంలో వున్నాం.

మీ సూచనలు గమనించాం. మా ఉత్పత్తుల్ని సరైన విధంగా పంపిణీచేసే బాధ్యతను ఎప్పుడూ గుర్తుంచుకుంటాం. మా కస్టమర్లను ఏ విధంగానూ నష్టపెట్టడం మా ఉద్దేశ్యం కాదు. త్వరలో మిమ్మల్ని కలవనున్న మా రిప్రజెంటేటివ్‌కు కంప్లయింట్ తోపాటే బాటిల్ అప్పగించండి.

కృతజ్ఞతలతో— ప్రొడక్షన్ మేనేజర్."

"త్వరగా రెస్పాన్స్ వచ్చిందే" అన్నాడు సూర్యం.

"పెద్ద కంపెనీలంతే. ఏది మైనా ఇలాంటి లోపాలు జరుగుతున్నప్పుడు మనం వారి దృష్టికి తీసుకురావటం అవసరం" అన్నాను.

సూర్యం మాట్లాడలేదు. తిరిగి అతనిలో ఆ బాటిల్ రీ ప్లేస్ కావటానికి ఎంత సమయం పడుతుందో అనే భావం కదలాడింది. అయితే ఈసారి అతను బయట పడలేదు.

నాకు ఆశ్చర్యం కలుగుతుంటుంది. కనీసం అనుభవాల నుండ నా నేర్చుకోవటానికి కొంతమంది ఉత్సాహం చూపించరు.

ఈసారి తక్కువ వచ్చినా అదంతేలే అని ఊరుకుంటాడు సూర్యం. ఆ విషయం నాకు స్పష్టంగా తెలుసు.

తిరిగి మరో పదిరోజులు గడిచాయి.

ఈసారి నేను ఊహించనిది జరిగింది.

ఆ కంపెనీనుండి నాకు మరో లెటర్ వచ్చింది.

ఈసారి వారి లెటర్ వస్తుందని నేను భావించటంలేదు. ఏదో రోజు నా అడ్రస్ వెతుక్కుంటూ ఆ రిప్రజెంటేటివ్ రాగలడనుకున్నాను.

నా లెటర్‌కు బదులిస్తూనే వారు ఆ కాపీని రీజినల్ ఆఫీసుకు తెలియచేస్తూ, ఈ విషయాన్ని వివరిస్తూ లేఖ వ్రాయటం జరిగిందనుకుంటాను. ప్రస్తుతం నాకు రీజనల్ మేనేజర్‌నుండి లెటర్ వచ్చింది. ఆ లెటర్ మా ఊర్లోని వారి ఆథరైజ్డ్ స్టాకిస్టుకు అడ్రస్ చేయబడింది.

"మేం మన పెప్సిన్ బ్రాండ్‌కు చెంది, ఈ క్రింది అడ్రసునుండి ఓ కంప్లెయింట్ రిసీవ్ చేసు

కోపటం జరిగింది. దయచేసి ఆ బాటిల్‌ను రీ ప్లేస్ చేయండి. ఈ సారి మీ కన్‌సైన్‌మెంట్‌లో ఆ బాటిల్ రీ ప్లేస్ చేయబడుతుంది. తరవాత పరీక్షల నిమిత్తం ఆ బాటిల్‌ను వెంటనే మాకు పంపిం చండి. అలా జరగటానికిగల కారణాలపై మేం పరిశోధించాల్సి ఉంది. ట్రూలీ యువర్స్

కృతజ్ఞతలతో— రీజనల్ మేనేజర్."

క్రింద నా అడ్రస్ ఇచ్చారు.

అదే కాపీ నాకు మార్క్ చేస్తూ ఓ నోట్ రాశారు. "దయచేసి మీ దగ్గరున్న బాటిల్ పై అడ్రస్ వారి కందచేసి కొత్త బాటిల్ పొందగలరు."

మొత్తంమీద సమస్య పరిష్కారం అయింది. ఓ విధంగా లెటర్ రాయటంలో నేను బ్యాలన్స్‌డ్‌గానే వ్యవహరించాను. వారింత క్విక్‌గా ఏక్షన్ తీసుకుంటారని నేనూహించలేదు.

బహుశా, నా లేఖలోని కొన మెరుపు ఇంత త్వరగా రియాక్టు కావటానికి ఓ కారణం కావచ్చు!

రోజూ ఆఫీసుకు వెళ్ళేముందు పోస్టాఫీస్‌కు వెళ్ళటం నాకలవాటు. ఆ ఉత్తరం అందిన వెంటనే వెనక్కి వెళ్లాను. మామూలుగా అయితే మాకు పోస్టు రావటానికి పన్నెండు గంటలవుతుంది. ఆ రెండు గంటల టెంషన్ భరించలేక నేను ముందే వెళ్లాను. ఇంటికి వెళ్ళి బాటిల్ చూశాను. కొంత భాగం వాడి వుంది.

అంతగా అయితే ఆ విషయం వారికి వివరించవచ్చు ననుకుంటూ, ఆ పాకెట్‌తో సహా తీసుకు వెళ్ళాను. ఆ అడ్రసు ప్రకారం షాపు వెతుక్కోవటానికి పావుగంట పట్టింది.

అదో హోల్‌సేల్ షాపు!

అక్కడ కొంతమంది అట్టపెట్టెల్ని సర్దుతున్నారు.

ఓ రాక్‌లో పెయింట్ డాయ్ కనిపించింది.

ఇద్దరు యువకులు మాత్రం కూర్చున్నారు. ఒకతను లెక్కలు చూస్తున్నాడు.

అప్పటికి సమయం పదిగంటలవుతుంది.

సైకిల్ స్టాండ్‌వేసి వెళ్లాను.

"ఏం కావాలి సర్" అన్నాడతను మర్యాదగా.

"జస్ట్ మినిట్" అంటూ నా బ్యాగ్‌నుండి తీసి లెటర్ అందించాను.

"మీ రీజనల్ ఆఫీస్‌నుండి నాకీరోజు లెటర్ వచ్చింది. మీకే అడ్రస్ చేశారు. నేను మీ కంపెనీ తాలూకు పెయింట్ డాయ్ కొన్నాను. సీల్ తీశాక అందులో కొంత భాగం తగ్గింది. రీ ప్లేస్ చేయమంటూ రాశారు" అన్నాను.

ఆ యువకుడు లెటర్ చదివాడు.

"మీరు ఎక్కడ పనిచేస్తున్నారు."

చెప్పాను.

"మీరు కంప్లయింట్ ఇచ్చారా" అన్నాడు.

"అవును. హెడ్ ఆఫీసుకు రాశాను. వారా కంప్లయింట్ రీజనల్ ఆఫీస్‌కు డైరెక్ట్ చేశారు."

"మీరెక్కడ కొన్నారండి" అన్నాడు.

"మా ఆఫీస్‌కు దగ్గర్లో ఓ షాపుంది. మా అటెండర్ తెచ్చాడు."

అతనేవో రెండు మూడు షాపుల పేర్లు చెప్పి అక్కడా అని అడిగాడు.

"అవేవీ కాదనుకుంటాను. అఫ్‌కోర్స్ మీకు కావా

లంటే ఆ వివరాలు నేను ఇస్తాను. నేను కొన్నవెంటనే వారికీ విషయం చెప్పాను. బట్ దే ఆర్ హెల్ప్‌లెస్. అందుకే కంపెనీకి రాశాను."

"ఇలాంటి కంప్లయింట్స్ కొన్ని వస్తున్నాయండి. అయితే మీకు ఈ విషయం గురించి కొంత చెప్పాలి సార్. మాకివన్నీ ట్రాన్స్‌పోర్టులో వస్తుంటాయి కదా. ఈ బాటిల్సున్న కార్టూన్లు మామూలుగా వుంటే ఫర్వాలేదు. అడ్డంగా లోడ్ చేశారనుకోండి. ఆ సమయంలో ఎండలో వుంటే మెల్ట్ అవుతాయి. అప్పుడు ఓ ప్రక్కకు చేరే అవకాశం వుంటుంది" అన్నాడతను.

"అందులో మెటీరియల్ ఎంత వుంటుందనేది మనకు కావాలి" అన్నాను.

"వెయిట్ తగ్గదండి. జస్ట్ అలా మారుతుందంతే" అన్నాడు.

ఇందాకట్నుండి రాసుకుంటున్న వ్యక్తి నేను తెచ్చిన పాకెట్ పరిశీలిస్తున్నాడు. వెనక్కి త్రిప్పి చూశాడు. అక్కడ ఏ విధమైన ముద్రలేదు. వారి దగ్గరున్న పాకెట్ వెనుక ఓ నెంబరుంది.

అతను సైగచేయటం నేను గమనించాను.

"నేను ఫ్రీలాన్స్ జర్నలిస్టుగా వుంటున్నాను. ఈ విషయంమీద ఓ ఆర్టికల్ రాయాలనుకుంటున్నాను" ఓ బాణం వదిలాను.

అతను బాటిల్ తీసుకొని వాసన చూశాడు.

"ఘాటుగానే వుంది" అన్నాడు.

"క్రింద నెంబర్ లేదు" అన్నాడతను. బహుశా ఆ షాపులో గుమాస్తా అయి వుంటాడు.

"డూప్లికేట్ అని మీ అనుమానమా" అన్నాను

డైరెక్టుగా.

గుమస్తా తటపటాయించాడు.

"అబ్బే....అలాంటిదేం లేదు" అన్నాడు ఆ యువకుడు.

"బాచ్ నెం....మంత్ కూడా వుంది" అన్నాడు తిరిగి గుమస్తా.

"డూప్లికేట్ తయారుచేసేవారు అవికూడా వేస్తారు. అన్ని జాగ్రత్తలూ తీసుకున్నాకే ఏ పనయినా చేసేది. అసలు వాసన చూస్తేనే తెలుస్తుంది. ఇంత బాగాచేస్తే డూప్లికేట్ చేయనవసరంలేదు. డైరెక్టుగానే కంపెనీ పెట్టుకోవచ్చు" అన్నాడు.

"ఈ దొంగ మందులు ఎక్కడ తయారవుతాయండి" అన్నాను.

"విజయవాడలో" అన్నాడతను.

"హైదరాబాదులో కూడానా."

"తక్కువ."

"ఏమేం తయారవుతాయి."

"ఆ నడుమ గ్లూకోజ్ తయారయింది. పట్టుకున్నారు. మా కంపెనీ వాటికి డూప్లికేట్ లేదు లెండి" అన్నాడు.

నాకెందుకో అనుమానం వచ్చింది.

వారి దగ్గరున్న బాటిల్ తీసుకొని పరిశీలించాను.

ఆ రెండింటికే స్పష్టమయిన తేడా వుంది!

నేను నా బాటిల్ సీలు విప్పినపుడు అందులో తరుగు కనిపించే అవకాశంలేదు. కారణం మూత క్రిందుగా వుంది. మిగతా భాగాన్ని రేపర్ కప్పేసింది. కానీ ఈ బాటిల్‌కు సీలు మూతమీదే ఉండటం గమనించాను. ఇప్పుడు

ఏమాత్రం తేడా వున్నా బయటకు కనిపిస్తుంది.

అయితే నేను కొన్నది నకిలీ అయుంటుంది!

ఆ విషయాన్ని వీరు కప్పిపుచ్చాల్సిన అవసరంలేదు.

అయినా ఆ ప్రయత్నం జరుగుతున్నట్లనిపించింది!

వారలా కప్పిపుచ్చటానికి కొన్ని కారణాలున్నాయి. ఒకటి ఆ షాపువారితో వున్న సంబంధాలు. ఈ వ్యాపారంలో ఏదో మేరకు అందరూ నకిలీ మందులు వాడుతుంటారు. ఇప్పుడు వారిని పట్టిస్తే వాళ్ళ వ్యాపారం దెబ్బతినొచ్చు. మహా అయితే వీళ్ళు మందలింపు, బెదిరించు వదిలేస్తారు.

మరో కారణం ఏమిటంటే వీళ్ళకు చెందిన లూప్ హోల్స్ ఎదుటి వారికి తెలిసి వుండొచ్చు!

సో....దీని వెనుక ఓ రాకెట్ వుంది!

తలనొప్పికయితే ఏ బూడిదో రాసుకుంటాం.

కానీ ప్రాణావసరాలకు వినియోగించే మందుల్ని సైతం వీరు తయారుచేస్తే!?

వినియోగదారుడు నష్టపోయేది డబ్బు కాదు—

ప్రాణం!

ఏ హంతకులకంటే తక్కువ కాదు వీరు!

ఈ దేశంలో క్రైమ్ ఎంతగా ప్రేళ్ళూనిందో ఒక్కొరంగం లోతుల్లోకి వెళ్ళినకొద్దీ అర్థమవుతూంది.

ఎంత దారుణం!

మొత్తంమీద నేను ప్రారంభించిన ఈ కృషి మరో మలుపు తిరిగింది.

"సరే! వేరే బాటిల్ ఇస్తారా" అన్నాను.

"మీరు ఏమనుకోకుండా సాయంకాలం రండి. మా ఫాదర్ వస్తారు. ఆయనే ఓనర్."

"ఓ.కె. దాందేముంది. ఈ బాటిల్ ఇక్కడే ఉంచి వెళ్తాను" అన్నాను.

సరిగ్గా అప్పుడే పోస్టు తెచ్చి యిచ్చారెవరో.

అందులో రీజనల్ ఆఫీసు నుండి వచ్చిన ఉత్తరం ఉంది!

"మాకు కూడా వచ్చింది సార్" అన్నాడతను.

"నేను సాయంకాలం వస్తాను."

"థ్యాంక్స్ సర్" అన్నాడు.

3

ఇందులో నేను చేయగలిగింది ఒకటే ఉంది.

ఈ విషయాన్ని పోలీసులకు తెలియచేయవచ్చు. అదే మంత తెలివిగల పనికాదు.

ముందసలు ఇది అసలో, నకిలీనో తేల్చుకోవాలి. ఓ వేళ నిజంగానే నకిలీ అయినా అసలు దొంగలు పట్టుబడరు. ఇక్కడితోనే ఆ కేసు మాఫీ చేయించుకోవచ్చు.

అదే కంపెనీ అయితే వేరే విధంగా ఉంటుంది. వారూ ఈ కేసుమీద బలంగా నిలబడితీరుతారు. ఆర్థికంగా కూడా వారికా శక్తి ఉంటుంది. అందుకే నేను మేనేజింగ్ డైరెక్టర్‌గారికో పర్సనల్ లెటర్ రాయాలనుకున్నాను. వెంటనే ఆ పని చేసేను.

"డియర్ సర్,

ఆ నడుమ మీ కంపెనీకి చెందిన పెయిన్‌బామ్ కొన్నాను. అందుల ఉండవలసినంత క్వాంటిటీ లేకపోవటంవల్ల మీకో కంప్లెయింట్ ఇవ్వటం జరిగింది. వెంటనే మీ ప్రొడక్షన్ మేనేజర్ నుండి నాకో లెటర్ అందింది. ఆ బాటిల్ రీప్లేస్ చేయించగలమంటూ.

ఆ తర్వాత మీ రీజనల్ మేనేజర్ నుండి వచ్చిన లేఖ ప్రకారం మీ స్టాకిస్టును కలవటం జరిగింది. అక్కడ నేను గమనించిన దాని ప్రకారం మీ ప్రొడక్టుకు ఈ ప్రాంతాల్లో నకిలీలు తయారవుతున్నాయేమోననే అనుమానం కలిగింది.

అది నిర్ధారణ చేసుకోవలసింది మీరు.

నా ఉద్దేశ్యం ఏమిటంటే, అవి అమ్మేవారిని పట్టుకునే కంటే ఎవరయితే తయారుచేస్తున్నారో వారిని పట్టుకోవాలి. అప్పుడు పత్రికా ప్రకటనల ద్వారా మీరీ విషయాన్ని ప్రజలకు తెలియచేయవచ్చు.

ఒకవేళ ఆ ప్రోడెక్ట్ నకిలీది కాని పక్షంలో ఆ నేరం నాదికాదు. నేను కేవలం అనుమానిస్తున్నాను. ఈ విషయంమీద ఏ చర్యలు తీసుకుంటారో తీసుకోరో నాకు తెలియదు. నా బాటిల్ రీప్లేస్ చేయబడింది. అందుకు నా అభినందనలు.

ముగించే ముందు ఒక్క విషయం చెబుతాను. ఈ దేశంలో మనం పుట్టాం. బ్రతుకుతున్నాం. పెయిన్‌బామ్‌ల్లో కల్తీలవల్ల ప్రాణాలు పోకపోవచ్చు. కానీ ప్రాణాలకు అవసరమయ్యే మందుల్లో కల్తీలవల్ల మన సొంత మనుషులకే ప్రమాదం రావచ్చు.

అందువల్ల కొంత ఖర్చయినా మీ ప్రొడక్టుకు నకిలీలు తయారవుతున్నాయో లేదో తెల్సుకోవాల్సిన బాధ్యత మీదే. అప్పుడు మాత్రమే ఇలాంటి నకిలీలకు వ్యతిరేకంగా సరైన చర్యలు తీసుకోవటం సాధ్యపడేది.''

లెటర్ క్రింద సంతకం చేశాను.

ఆ లెటర్ స్వయంగా టైపు చేసి, కవర్ మీద పర్సనల్ అని రాసి రిజిస్టర్డ్ పోస్టులో పంపించాను. అది అనవసరం అని నా కనిపించలేదు.

అది నా బాధ్యత!

4

సాయంకాలం షాపుకు వెళ్ళాను. ఓనరుగారు చాలా మర్యాదగా కూర్చోబెట్టాడు.

"చాలా మంచిది సార్! ట్రాన్స్‌పోర్టు ప్రాబ్లమ్స్ సర్! కొంచెం అడ్డంగా పారేసి వాటిమీద ఏవేవో వేస్తారు. అదంతా అటూ, ఇటూ పోతుంది. మెంథాల్ ఎక్కువ ఉంటుంది. అదో ప్రాబ్లమ్" చెప్పుకుపోతున్నాడు.

"నాదో సమస్య" అన్నాను.

"ఏమిటండి?"

"బాటిల్ నిండుగా ఉంటే అటూ ఇటూ పోదుగదా!"

"నిండుగా ఉండదు సార్! కొంచెం క్రిందకు....అదే తలక్రింద వరకూ ఉంటుంది."

"అలా ఎందుకుండాలి? పూర్తిగా పైకొచ్చేంతవరకూ ఉండాలి. అంత బాటిల్ మాత్రమే చేయించుకోవాలి. మిగతా కంపెనీలవారు పూర్తిగా నింపుతున్నారు" అన్నాను.

"అవుననుకోండి" అంటూ "అబ్బాయి" అని పిలిచేడు.

అతను నాకో కొత్త పాకెట్ అందించాడు.

"థాంక్సండి" అన్నాను లేస్తూ.

"మంచిదండి" అన్నాడాయన.

నా శ్రీమతి పాకెట్ సీల్ విప్పింది. మూత తీసేక "ఈసారి పూర్తిగానే ఉంది" అంది.

"నా చెయ్యి ఎక్కడపడితే అక్కడ నాశనమేగా"

అన్నాను.

"అది మాత్రం నిజమే" అంది.

నేను ఓ నెలరోజులు టూర్ మీద ఆంధ్రదేశాన్ని వదిలి వెళ్ళాను. అక్కడ తెలుగు పేపరు కూడా నాకు లభించనే లేదు.

నేను తిరిగి ఆఫీస్‌కు వచ్చేసరికి సూర్యం ఆశ్చర్యంగా చెప్పిన విశేషా లివి.

"పెయిన్‌బామ్‌కు చెందిన నకిలీలను తయారుచేస్తున్న ముఠాను అరెస్ట్ చేశారట. ఫోటోతోసహా వాటిని ముద్రించారు."

నేను నవ్వలేదు.

పన్నెండు గంటలకు నాకు రిజిష్టర్డు పోస్టు వచ్చింది. అది కంపెనీవారి నుండే!

"డియర్ సర్,

మీ లేఖ అందింది. మేమొక ఇన్వెస్టిగేటివ్ బృందాన్ని పంపాం. వారి పరిశోధనలో మీ అనుమానం వాస్తవమే అని వెల్లడయింది. దీనివెనుక పెద్ద రాకెట్ ఉంది. వారు మా కంపెనీకి చెందిన పేరు ప్రతిష్ఠల్ని క్యాష్ చేసుకోవాలనుకున్నారు. మా సంస్థ మీకు కృతజ్ఞతాభినందనా లందజేస్తోంది.

పత్రికలలో వచ్చిన వివరాలు మీరు గమనించారనుకుంటున్నాను. మా కంపెనీకి చెందిన అన్ని ఉత్పత్తులకు నకిలీలు ఆరంభమయ్యాయి. మొదటిదశలోనే వాటిని గుర్తించటంలో మీ లేఖలు మాకు సహాయం చేశాయి.

ఇటీవల మా డైరెక్టర్ల అత్యవసర సమావేశం

జరిగింది. అందులో మీ పాత్ర గురించి చర్చిం చాం. మా కంపెనీ మీ కృషిని దృష్టిలో తీసు కొంది. మీ బాధ్యతాయుత కర్తవ్యానికి విలువ కట్టలేం. అయినా మా సంస్థ ఇస్తున్న ఈ చిరు కానుకను దయతో స్వీకరించగలరు.

ఎల్లప్పుడూ మా కస్టమర్ల సేవలే మా విజయ రహస్యం.

కృతజ్ఞతలతో—

సిన్సియర్లీ యువర్స్,
మేనేజింగ్ డైరక్టర్"

ఈ లేఖతోపాటు 1,116/-లకు డిమాండ్ డ్రాఫ్ట్ జత చేయబడి వుంది.

"ఏమిటి బ్రదర్" అంటున్నాడు సూర్యం.

"తలనొప్పి ...." అంటూ డి. డి. అందించాను.

సూర్యం నోరు తెరిచాడు.

నిజంగా ఈ విషయంలో ఇది మరో మలుపు! ☐

సెకండ్ షో వద్దు!



పగటి వేషం

వి.యస్. రావ్

స్వింగ్ డోర్స్ తోసుకుని అతను ముందు గదిలోకి ప్రవేశించాడు. టైప్‌రైటర్ ముందు కూచుని టకటక శబ్దం చేస్తున్న సెక్రటరీ అతని వేపు ప్రశ్నార్థకంగా చూసింది. అతను నాలుగడుగులువేసి ఆమె ముందు ఎత్తుగా ఠీవిగా నిలబడ్డాడు. ధ్వజస్తంభంలా నించున్న

అతన్ని ఆమె తలెత్తి చూస్తోంది.

"మిస్, ఐ వాంట్ టూ సీ మిస్టర్ జంబులింగం" అన్నాడతను చిరునవ్వు నవ్వుతూ. బ్రౌన్ సూట్‌లో హుందాగా వున్న అతని మీంచీ చూపులు మరల్చుకోడానికి ఆమె విశ్వప్రయత్నం చేస్తోంది. అతని చిరునవ్వు ఆమెకి అంటువ్యాధిలా అంటుకుంటోంది.

"మీ పేరు?" అడిగిందామె. ఆమె చేతులవేళ్ళు టైప్ రైటర్ కేస్‌మీద కదలకుండా వుండటానికి ప్రయత్నిస్తు న్నాయి.

"రంగారావ్."

"లాయరుగారితో మీకు అపాయింట్‌మెంట్ వుందా?" అందామె ఏదో లిస్టుని పరీక్షిస్తూ.

"అపాయింట్‌మెంట్ లేదు; అనుకోకుండా వచ్చాను" రంగారావు చిన్నగా నవ్వాడు.

"అయామ్ సారీ. అనుకోకుండా, అపాయింట్‌మెంట్ లేకుండా వచ్చే వాళ్ళని ఆయన అనుకున్నా చూడలేరు! హి ఈజ్ బిజీ లాయర్...." అందామె నవ్వుతూ.

కళ్ళతో నవ్వుతూ, ఆమెనే చూస్తూ మౌనంగా జేబు లోంచీ ఇండియా కింగ్స్ పాకెట్ తీశాడతను. సిగరెట్‌ని పెదాలమధ్య అతికించి, వెలిగించి పొగ ఊదుతూ కిందికి వొంగి టేబుల్‌కి ఆనించి బ్రీఫ్‌కేస్‌ని ఆమె చూసేలా పైకెత్తాడు.

"వేలాది రూపాయల్ని ఇచ్చే క్లయింటుని చూడ లేనంత బిజీగా లోకంలో ఎవ్వరూ వుండరు!"

"మీ అర్థం?" రెప్పలు టపటపలాడిస్తూ అడిగిందామె.

"అపాయింట్‌మెంట్ లేదని నన్ను గెంటేస్తే, నాతో బాటు జంబులింగంగారు పాతిక వేలరూపాయల్ని వీధి

రికి గిరాటేశాడన్న మాటే।" రంగారావు నవ్వాడు.

అప్రయత్నంగా ఆమె చేతులు టైప్‌రైటర్‌మీంచీ కిందికి, ఆమె వొళ్ళోకి జారాయి. గాలానికి తగులుకున్న చేపల్లా ఆమె కళ్ళు క్షణకాలం ఇబ్బందిగా కదిలాయి. ఒకసారి రెప్పల్ని దించి, మళ్ళీ ఎత్తి అతన్ని చూసింది.

"మిస్టర్ రంగారావ్, మీరు ఇప్పుడే ఆయన్తో మాట్లాడాలా?"

రంగారావు వాచీ చూసుకున్నాడు. "అయిదు నిమిషాల క్రితమే మాట్లాడి వుండాలి!" అన్నాడు నవ్వుతూ.

చిరునవ్వు ఆమె పెదవుల్ని చీల్చింది. "ఆల్‌రైట్.... ఒక్కక్షణం అలా కూచోండి. ఆయన్తో మీ గురించి చెప్తాను" అంటూ ఆమె ఎడంవైపున్న స్ప్రింగ్ డోర్ వేపు నడిచింది. రంగారావు చూపులు ఆమె హంస నడకని డోర్‌దాకా వెంబడించాయి. డోర్ ఆమె వెనక మూసుకుంది.

రంగారావు బ్రీఫ్‌కేసుని ఆమె టేబుల్‌మీద వుంచి, క్లిక్‌మనిపిస్తూ తెరిచాడు. సిగరెట్‌ని పళ్ళమధ్య ఇరికించి టేబుల్‌మీదున్న లాయర్ జంబులింగం లెటర్ హెడ్ లోంచీ నాలుగు కాగితాల్ని లాగాడు. అటువైపున దొంతిగా పెట్టబడిన వకల్తానామా కాగితాల్ని నాలుగుతీసి, అన్నింటినీ బ్రీఫ్‌కేస్‌లో పడేసి మూసేశాడు. ఏమీ ఎరగనివాడిలా వెళ్ళి సోఫాలో కూచుని ఏకాగ్రతతో సిగరెట్ పీల్చసాగేడు.

తలుపు తెరుచుకుని సెక్రటరీ ప్రత్యక్షమైంది. నవ్వుతూ అతనివైపు చూసింది.

"లాయర్‌గారు మీతో రెండే రెండు నిమిషాలు మాట్లాడతారు. సరిగ్గా 10-30కి ఆయనకి వేరే అపా

యింట్‌మెంటుంది....'' అందామె లోపలికి వెళ్ళమని చేత్తో సైగచేస్తూ.

రంగారావు నవ్వుతూ లేచాడు. సిగరెట్‌ని యాష్ ట్రేలో కుక్కి డోర్‌వైపు నడిచాడు. ''థాంక్స్....'' అంటూ తలుపు తోసుకుని లోపలికి దూరాడు.

విశాలంగా వున్న ఎయిర్‌కండిషన్డ్ గదిలో వెడల్పాటి టేబుల్ వెనక పొట్టిగా, లావుగా వున్న జంబులింగం కూచున్నాడు. అతని బట్టతల బోర్లించిన కుండలా వుంది. చిన్న కళ్ళని చిట్లిస్తూ మరీ చిన్నగా చేసి చూస్తున్నా డతను.

''నమస్తే!'' అన్నాడు రంగారావు ముందుకి నడుస్తూ. జంబులింగం తల రబ్బరు బంతిలా వెనక్కీ ముందుకీ కదిలింది.

''మీరెవరో, ఏం కావాలో త్వరగా చెప్పండి. అయామ్ బిజీ'' అన్నాడతను రంగారావు చేతిలోని బ్రీఫ్‌కేసుని చూస్తూ. రంగారావు అతని ఎదురుగా కుర్చీలో కూచు న్నాడు. బ్రీఫ్‌కేసుని వొళ్ళో పెట్టుకున్నాడు.

''గజరాజు తరఫున మీతో మాట్లాడ్డానికి వచ్చాను'' అన్నాడతను.

గుబురుగా వున్న జంబులింగం కనుబొమలు మధ్యలో కలుసుకున్నాయి. వాటిపైన నిలువుగా వేంకటేశ్వరస్వామి నామాల్లా మూడు గీతలు పడ్డాయి.

''మీరెవరు?''

''నా పేరు మీ సెక్రెటరీ చెప్పి వుంటుంది. గజరాజు నా మేనత్త కొడుకు....''

''తనకి మేనత్తలూ, మేనమామలూ వున్నట్టు అతను నాతో ఎప్పుడూ చెప్పలేదు....'' అన్నాడు జంబులింగం

అనుమానంగా చూస్తూ.

"నా అన్న వాళ్ళని పూర్తిగా నిర్లక్ష్యం చేశాడుగనకే అతనికి ఈ దుర్గతి పట్టింది!"

"అతనికి పట్టిన దుర్గతి ఏమిటి?" జంబులింగం ప్రశ్నించాడు.

రంగారావు చిన్నగా నవ్వాడు. "గజరాజు మొసలి నోట్లో ఇరుక్కున్నాడు. ఆ సంగతి పూర్తిగా మీకు తెలుసు! రెండుసార్లు మీరు అతన్ని ఉరికంబం ఎక్కకుండా మీ తెలివితో కాపాడారు. చాలాసార్లు జైలు పాలవకుండా తప్పించారు! ఈసారికూడా అతని కేసుని మీరు టేకప్ చేస్తారని పేపర్లన్నీ రాశాయి...."

లాయర్ జంబులింగం ఇబ్బందిగా చూశాడు. రంగారావు మళ్ళీ అన్నాడు.

"మీరు గజరాజుకి పర్మనెంట్ లాయరని న్యూస్ పేపర్లు చదివాకే నాకు తెలిసింది!"

జంబులింగం అరచేత్తో బట్టతలని రుద్దుకున్నాడు. "గతం సంగతి వేరు. ప్రస్తుతం గజరాజుని మహావిష్ణువు కూడా రక్షించలేడు!" అన్నాడు నవ్వుతూ.

"మీరలా అంటే లాభంలేదు. గజరాజుకోసం చట్టం వేళ్ళాడేసిన ఉరితాడుని మీ వాదన చాలాసార్లు తునాతనకలు చేసింది! అతను మీ పాత క్లయింటు. మీరు తనని రక్షిస్తారన్న ధైర్యంతో అతను ఊపిరి పీలుస్తున్నాడు. ఈసారికి...."

జంబులింగం తల అటూ ఇటూ ఆవేశంతో ఊగింది. "అయామ్ సారీ, గజరాజు నిర్లక్ష్యంగా ప్రవర్తించాడు. అతను మళ్ళీ మర్డర్ చేశాడు. హత్య. ఆర్నెల్లక్రితం అతను చేసిన హత్యకి కవలపిల్లలా వుంది. హత్యా

విధానం పోలీసులకి అతన్ని పట్టిచ్చింది. అతనికి ఉచ్చితంగా శిక్షపడుతుంది. ఓడిపోయే కేసుని నేను టేకప్ చేయను!'' జంబులింగం కలతం ని కృష్ణగా ధ్వనించింది.

"గజరాజు ఈసారి పెద్ద మొత్తం చోరీచేశాడు. అతన్ని ఇవతలికి రప్పిస్తే అందులో సగం మీ ఫీజుకింద ఇస్తాను. పాతికవేలు అడ్వాన్సుగా మీకు నేను....''

"మిస్టర్ రంగారావ్, అయామ్ సారీ. గజరాజు కూడా నాకు కబురుచేశాడు. లాభంలేదు. పేపర్లు ఈ మధ్య మరీ బరితెగించాయి. అన్ని మాటల్లో అనలేదు కానీ ప్రతీ పేపరూ నన్ను గజరాజుకి తోడుదొంగగా చిత్రించాయి. బార్ అసోసియేషన్‌లో నా విలువ చిల్లిగానీలా అయిపోతుంది. మీరు మరో లాయర్ని చూడండి....'' జంబులింగం అడ్డొస్తూ అన్నాడు.

రంగారావు నిట్టూర్చాడు. "అంతేనంటారా!''

"అంతకుమించి ఏమీ అనలేను. జేబులనిండా డబ్బు చేదుకాకపోవచ్చు. కానీ చెడ్డ పేరు చేదే! గతంలో ఏవో టెక్నికల్ పాయింట్స్‌ని తురుపుల్లా ఉపయోగించి అతన్ని రక్షించాను. ఈసారి అతనిమీద కేసు చాలా బలంగా వుంది'' జంబులింగం నిరుత్సాహంగా అన్నాడు.

"అయితే గజరాజు కథ ముగిసినట్టేనంటారా?'' రంగారావు ప్రశ్నించాడు.

"సాక్ష్యాలన్నీ అతనికి ప్రతికూలంగా వున్నాయి. నా పద్ధతుల్లో నేను కేసుని స్టడీచేశాను. ఆఫ్‌కోర్స్, ప్రస్తుతానికి సాక్ష్యాలు అనుమానాన్ని అతనిమీదికి సరఫరా చేస్తున్నాయి. అతన్నే దోషిగా నిర్ణయించేలా అవి త్వరలో వెలికివస్తాయి. చాలా కాలంగా గజరాజుమీద

పోలీసు డిపార్ట్‌మెంట్ కన్నుంది" అంటూ జంబులింగం గడియారం చూసుకున్నాడు.

రంగారావు తనలో నవ్వుకున్నాడు. తనకిచ్చిన రెండు నిమిషాల టైమ్ అయిపోయింది! మెల్లిగా లేచి నిలబడ్డాడతను. బ్రీఫ్‌కేసుని గ్లాస్ టాప్ వున్న టేబుల్‌మీద పెట్టాడు. తదేకంగా జంబులింగాన్ని చూశాడు.

"లాయరుగారూ, గజరాజు మీమీద ఎన్నో ఆశలు పెట్టుకున్నాడు. చక్రం తిప్పి అతన్ని మీరే రక్షించాలి!"

జంబులింగం చిన్నగా నవ్వాడు. "ఎగైన్ సారీ. ఈ కేసు తీసుకుంటే నా రెప్యుటేషన్ గోదావర్లో కలుస్తుంది. చట్టం విసిరే చక్రం ఈసారి గజరాజునే ఖండిస్తుంది! అతని పాపం పండిందనిపిస్తోంది...." అంటూ లేచి తన వెనకున్న కిటికీ ముందు నిలబడ్డాడు. సిగరెట్ వెలిగించి కిటికీగుండా ఆకాశాన్ని చూడసాగేడు.

రంగారావు అతన్నే చూస్తూ క్షణకాలం అలాగే నిలబడ్డాడు. అతని పెదవులు చిరునవ్వుతో విచ్చుకున్నాయి. "ఓకే....థాంక్స్ ఫర్ నథింగ్!" అన్నాడతను జంబులింగం వీపుతో.

"ఫర్గెటిట్!" జంబులింగం ఆకాశంతో అన్నాడు.

రంగారావు తలుపుదాకా నడిచాడు. తలుపును లాగి మళ్ళీ వొదిలేశాడు. చిన్న చప్పుడుతో తలుపు మూసుకుంది. జంబులింగం ప్రకృతి అందాన్ని తిలకించడం మానేసి గిరుక్కున వెనుదిరిగాడు. తలుపుముందు విగ్రహంలా నిలబడ్డ రంగారావుని చూస్తూ ఆశ్చర్యంతో కళ్ళు పెద్దగా చేశాడు. రంగారావు చిన్నగా నవ్వాడు.

"ఎక్స్‌క్యూజ్‌మీ మిస్టర్ జంబులింగం....మీరు వదిలేసిన క్రిమినల్ కేసుని టేకప్‌చేసి జయించే లాయరు

దాదాపు లేదనే చెప్పాలి. అయినా గజరాజుని గాలికి వదిలేయలేను. ఈ కేసులో అతను ఎంత లోతుగా కూరుకుపోయాడో వివరించగలరా? మరో లాయర్ని ఆ ఇన్ఫర్మేషన్తో నేను ఎన్లైటన్ చేయొచ్చు...." రంగారావు మళ్ళీ కుర్చీవేపు అడుగులేశాడు.

జంబులింగం కళ్ళల్లో విసుగు అతని బట్టతలలాగా స్పష్టంగా కనిపిస్తోంది. రంగారావు చిన్నగా నవ్వాడు.

"ఆఫ్కోర్స్....మీ అమూల్యమైన సమయాన్ని ఊరికే ఖర్చుచేయడం నాకిష్టంలేదు. నిమిషానికి యాభై రూపాయల చొప్పున నేను పే చేస్తాను!" అంటూ కుర్చీలో కూచుని రిస్ట్వాచీ చూసుకున్నాడతను.

అయిష్టతని నటిస్తూ జంబులింగం తన కుర్చీలో కూచున్నాడు. అప్రయత్నంగా వాచీ చూసుకున్నాడు. ఇంటర్కమ్ స్విచ్ నొక్కాడు. "కమలా మరో ఇరవై నిమిషాలదాకా ఎవర్నీ లోపలికి పంపకు!" అంటూ సెక్రెటరీకి ఉత్తరువిచ్చాడు. చిరునవ్వుతో రంగారావువైపు చూశాడు.

రంగారావు కళ్ళతో నవ్వాడు. డబ్బు చేదుకాదని జంబులింగం ప్రాక్టికల్గా నిరూపిస్తున్నాడు. వెయ్యి రూపాయలు ఆర్జించడానికి నిశ్చయించుకున్న జంబులింగాన్ని నవ్వుతూ చూస్తూ రంగారావు సిగరెట్ వెలిగించాడు.

జంబులింగం నిమిషాల్ని వృధాచేయకుండా చెప్పడం ప్రారంభించాడు....

2

యూనిఫామ్లో వున్న గార్డు కటకటాల తలుపుని తెరిచాడు. గోళ్ళు కొరుక్కుంటూ గోడకి ఆనుకుని

చూచున్న గజరాజు తల పూర్తిగా ఎత్తకుండా రెప్పలు మాత్రం ఎత్తి చూశాడు.

"నీతో మాట్లాడ్డానికి ఈయన వచ్చారు...." అన్నాడు గార్డు గజరాజుతో.

గార్డు పక్కనే సెల్ ముందు నిలబడ్డ రంగారావుని చూశాడు. నల్లకోటు, తెల్లపాంటు ధరించిన రంగారావు బక్కపల్చగా. గెడకర్రలా పొడుగ్గా వున్న గజరాజుని చిరునవ్వుతో చూశాడు. గజరాజు కళ్ళు నిప్పుకణాల్లా ఎర్రగా వున్నాయి.

"ఇతనెవరో నాకు తెలీదు...." గజరాజు కంఠం కొయ్యముక్కమీద రాస్తున్న ఆకురాయిలా ధ్వనించింది.

"నా పేరు రంగారావు. లాయర్ జంబులింగం గారి అసిస్టెంట్‌ని. ఆయన నన్ను పంపించారు...."

"ఆయనతో తప్ప ఇతరులతో నేను మాట్లాడను." గజరాజు నిర్లక్ష్యంగా అంటూ చిటికెనవేలి గోరుమీద తన దృష్టి కేంద్రీకరించాడు. మెల్లిగా చిటికెనవేలిని నోట్లో ఇరికించాడు.

"ఆయన చాలా బిజీగా వున్నారు...." రంగారావు చిరునవ్వుతో అన్నాడు.

గజరాజు ఎర్రగా చూశాడు. "జంబులింగానికి నేను నైవేద్యం పెట్టాలంటే జంబులింగమే నాతో మాట్లాడాలి!"

రంగారావు మాట్లాడకుండా వెనక్కి తిరిగాడు. ఒక అడుగువేసి ఆగి, తలతిప్పి భుజమ్మీదుగా గజరాజును చూశాడు. గజరాజు గోళ్ళు కొరుక్కుంటూ రెప్పవేయకుండా చూస్తున్నాడు.

"నువ్వు నాతో మాట్లాడితేగానీ ఆయన నీతో మాట్లా

డరు. నువ్వు మరో లాయర్ని చూసుకోడం మంచిది" అంటూ రంగారావు కదలబోయాడు.

"తొందరపడకండి!" గజరాజు ఆతృతగా అరిచాడు. అంతసేపూ నాటకాన్ని చూస్తూ విగ్రహంలా నుంచున్న గార్డు విసుగ్గా చూశాడు. "ఆయన్తో నీకు పనుందో లేదో చెప్పు!" గజరాజుని గద్దించాడతను.

గజరాజు అతనివేపు పళ్ళు ఇకిలించాడు. వదులు పడి పోయిన స్ప్రింగులా మెల్లిగా లేచాడు. చేతులు పైకెత్తి వొళ్ళు విరుచుకున్నాడు. భుజాల్లో కాళ్ళలో టపటపమంటూ మెటికలు విరిగాయి.

"గురువు రానప్పుడు శిష్యుడే గురువు! మాట్లాడుతా" అన్నాడతను.

గార్డు రంగారావు వైపు చూశాడు. "మీరు ఆ గదిలో కూచోండి. ఇతన్ని తీసుకొస్తా" అన్నాడు.

"థాంక్స్" అంటూ రంగారావు వెనుదిరిగి చకచకా వెళ్ళిపోయాడు.

కిటికీ వైపు తిరిగి సిగరెట్ పీలుస్తున్న రంగారావు వెనక్కి తిరిగి, అప్పుడే గదిలోకి వస్తున్న గార్డునీ, గజ రాజునీ చిరునవ్వుతో చూశాడు. గది మధ్యలో వున్న టేబిల్ ముందు కుర్చీలో కూర్చున్నాడు. గజరాజు అతని ఎదురుగా కూచున్నాడు.

"లాయరుగారూ, మీకు ఇరవయి నిమిషాల టైమ్ అలాట్ చేయబడింది. గుర్తుంచుకోండి!" అన్నాడు గార్డు.

రంగారావు లేచాడు. కటకటాల తలుపుదాకా గార్డుని వెంబడించాడు. తలుపు మూసి గార్డు బయట గొళ్ళెం పెట్టాడు. రంగారావు చెయ్యి రెండు కమ్మీల మధ్య ఇవ

తలికి దూరింది.

"థాంక్స్" అంటూ అతను గార్డు చేతిని పట్టుకున్నాడు. తన అరచేతికీ కరచాలనం చేస్తున్న రంగారావు అర చేతికి మధ్య గరుకుగా తగులుతున్న వందరూపాయల నోటుని రెప్పవాల్చి చూసుకున్నాడు గార్డు. రంగారావు చేతిని మెల్లిగా లోపలికి లాక్కున్నాడు. గార్డుచెయ్యి అతని పాంటు జేబులోకి మారింది. అతను నవ్వుతూ చూశాడు.

"నాకు థాంక్స్ చెప్పకండి. ఈ ఇంటర్వ్యూని మీరు పై లెవెల్నుంచీ ఏర్పాటు చేయించుకున్నారు!" అన్నాడతను.

"ఇరవై నిమిషాలు నా క్లయింట్‌తో నేను కాన్ఫిడెన్షియల్‌గా మాట్లాడాలి...." రంగారావు మెల్లిగా నవ్వుతూ అన్నాడు.

"మాట్లాడండి. మీ ఏకాంతానికి భంగం రాదు. నేను కాపలా వున్నంతవరకూ ఇటుపేపు ఎవ్వరూ రారు...." అంటూ గార్డు దూరంగా వెళ్ళి గోడకి ఆనుకున్నాడు. రంగారావు గజరాజు వేపు నడిచాడు. అతని మొహంలోకి తదేకంగా చూశాడు.

"నేను జంబులింగం అసిస్టెంట్ కాను!" అన్నాడతను కంఠం బాగా తగ్గించి.

గజరాజు ఉలిక్కిపడ్డాడు. ఆశ్చర్యంతో అతని నోరు కొద్దిగా తెరుచుకుంది. అతని జిత్తులమారి కళ్ళల్లో ఏదో అనుమానం దొంగలా తొంగి చూస్తోంది.

"నువ్వు త్రివిక్రమ్ పేరు విన్నావా?" రంగారావు తగ్గు స్వరంతో ప్రశ్నించాడు.

గజరాజు మళ్ళీ వులిక్కిపడ్డాడు!

త్రివిక్రమ్! ఘరానా పెద్దమనిషి. ప్రభుత్వ యంత్రాం

గంలో, నేరప్రపంచంలో, చట్టప్రపంచంలో అతని అజ్ఞాత హస్తం వుంది. ఎన్నో రాజకీయ హత్యల్లో, పెద్ద ఎత్తున సాగిన దోపిడీల్లో, పార్టీఫిరాయింపుల్లో అతని ప్రమేయం వుందని చెప్పుకుంటూ వుంటారు. చివరకు జేబుదొంగల నుంచీ కూడా అతను కమీషన్ వసూలు చేస్తాడని ప్రతీతి వుంది. అన్నింటికీ అతీతంగా వుంటూ అన్నీ సాగిస్తూ వుంటాడతను. డబ్బూ, డబ్బు సాధించి పెట్టిన పలుకుబడీ అతని చుట్టూ కంచుకోటల్లా వున్నాయి.

ఆలోచిస్తూ గజరాజు కొంచెం కంగారుగా రంగా రావుని చూశాడు. నోరు మెదపకుండా వున్న గజరాజుని రంగారావు చిరునవ్వుతో చూశాడు.

"నేను త్రివిక్రమ్ కుడిభుజాన్ని!" అన్నాడతను సగర్వంగా.

పాము నాలుకలాసాగిన గజరాజు నాలుక ఆరిపోతున్న అతని పెదాల్ని తడిపే ప్రయత్నంచేసింది. త్రివిక్రమ్ అనుచరుడు ఇక్కడికి ఎందుకొచ్చాడు?

"త్రివిక్రమ్ నిన్ను బైటికి రప్పించడానికి నిశ్చయించు కున్నారు...." అంటూ రంగారావు ఆగాడు. బాగా తగ్గించబడిన అతని కంఠస్వరం సంభాషణ అతి రహస్యంగా సాగాలన్న ఉద్దేశాన్ని గజరాజుకి తెలియజేస్తోంది.

"నువ్వు చేసిన ప్రతి నేరాన్నీ ఆయన బాగా ఫాలో అయ్యారు. మొన్న రాత్రి నువ్వు మర్డర్ చేసిన కేశవ రావంటే ఆయనకి సదభిప్రాయంలేదు. చాకచక్యంగా అతన్ని హతమార్చి, లక్ష రూపాయలతో జారుకున్న నిన్ను తమ గొడుగు కిందికి తీసుకోవాలని ఆయన అను కుంటున్నారు. అందుకే నిన్ను విడిపించడానికి సంకల్పిం చారు...."

"ఎవరి సహాయమూ లేకుండా నేను బయట పడ గలను. ఎందుకంటే నేను కేశవరావుని చంపలేదు. అత నెవరో నాకు తెలీదు!" గజరాజు అర్ధొస్తూ అన్నాడు.

"ఎన్నో కేసుల్లో నీ తరఫున వాదించి, నీ అంగరక్షకు డుగా పేరుపొందిన లాయర్ జంబులింగాన్ని మేం కల్సు కున్నాం. ఈసారి నీ కేసు తీసుకోడానికి జంబులింగం వెన కాడుతున్నాడు. ప్రస్తుతం పోలీసువాళ్ళకి సిలువా, సుత్తీ దొరికాయి. పదునైన పొడుగాటి మేకులకోసం వాళ్ళు అన్వేషిస్తున్నారు. త్వరలో, అతిత్వరలో అవి వాళ్ళకి చిక్కుతాయి. నిన్ను సిలువవేసేస్తారు! ఆ సాక్ష్యాలు వాళ్ళకి లభిస్తాయని జంబులింగం నిర్ద్వంద్వంగా నమ్ము తున్నాడు...." గజరాజు మాటలు వినపడనట్టు రంగారావు చెప్పుకుపోతున్నాడు.

"ఆ కేశవరావెవడో అతన్ని నేను చంపలేదు!" గజ రాజు కోపంగా అన్నాడు.

"అయితే ఇక్కడ - అత్తారింట్లో గోళ్ళుకొరుక్కుంటూ ఎందుకూర్చున్నావ్?" రంగారావు ఎగతాళిగా నవ్వాడు.

"మొన్న నా పుట్టిన్రోజు. ధారాళంగా తాగాను. బార్‌లో ఏదో గొడవయ్యింది. పోలీసులు అరెస్టుచేశారు. వాళ్ళకి దొరికినవాడే దొంగ!" గజరాజు కసిగా హుంక రించాడు.

"అంతమాత్రానికే అయితే నువ్వు చాలా ఖరీదైన క్రిమినల్ లాయర్ జంబులింగానికి కబురుచేయనక్క ర్లేదు! ఆరాత్రే పోలీసులకి కేశవరావు శవం దొరికింది. అతని హత్య నీపద్ధతిలో జరిగింది. కారణం ఇదీ అని ఖచ్చితంగా చెప్పకుండా అనుమానంమీద, ముందు జాగ్ర త్తగా నిన్ను లోపల తోశారు. బార్‌లో కేశవరావు హంత

కుడు నువ్వే అని తేలుతుంది. నువ్వు మళ్ళీ పైకి తేల కుండా మునిగిపోతావు!" రంగారావు నవ్వాడు.

గజరాజు తన ఏనుగుకళ్ళని చిట్లించాడు. "నా పద్ధతా?" అమాయకంగా అడిగాడతను.

రంగారావు అతని కళ్ళల్లోకి చూశాడు. " 'బర్కిలీ మెథడ్ ఆఫ్ కిల్లింగ్' నీకు తెలుసా?"

గజరాజు అర్థంకానట్టు చూశాడు.

"చాలా ఏళ్ళక్రితం బ్రిటన్‌లో బర్కిలీ అనే వ్యక్తి మెడికల్ కాలేజీకి శవాల్ని సరఫరాచేసేవాడు. బేరం జోరుగా సాగడానికి అతను శవాల సంఖ్యను ధారాళంగా పెంచాలనుకున్నాడు. వీథుల్లో గాలించి ఎవరో అమాయ కుణ్ని పట్టేవాడు. ఇంటికి తీసుకెళ్ళి ఆతిథ్యం ఇచ్చేవాడు. పీకల్దాకా తాగించి, ప్రేమ నటిస్తూ అతన్ని గదిలో పడుకో పెట్టేవాడు. మత్తుతో నిద్రిస్తున్న ఆ వ్యక్తి మొహమ్మీద సిల్కురుమాలు కప్పి, మెత్తటి తలగడని మొహమ్మీద అదిమిపెట్టేవాడు. ఊపిరి ఆడక పైలోకం చేరుకున్న ఆ వ్యక్తి శవాన్ని మరునాడు మెడికల్ కాలేజీకి అమ్మేసే వాడు. ఆ పద్ధతిలో చనిపోయిన వ్యక్తి హత్యచేయబడ్డా డన్న అనుమానం రాదు. అది నాచురల్‌డెత్‌గానే కని పిస్తుంది!

"బర్కిలీ సప్లైచేస్తున్న శవాల సంఖ్యా, ఉన్నట్టుండి మాయమైపోతున్న వ్యక్తులూ పోలీసుల్లో అనుమానాన్ని పుట్టించారు. చివరికి బర్కిలీ బండారం బైటపడింది. అది వేరేసంగతి. అతని పద్ధతిలో నువ్వు హత్యలుచేశావు." రంగారావు ఆగి, నవ్వుతూ చూశాడు.

గజరాజు అయోమయంగా చూశాడు.

"అర్నెల్లక్రితం. ఒంటరిగా జీవిస్తున్న దుర్గాబాయి

హత్య ఇలాగే జరిగింది. దుర్గాబాయిని, నగలకోసం హత్యచేసింది నువ్వే అని నీకు తెలుసు!"

"నో! దుర్గాబాయిని నేను చంపలేదు. అనుమానం మీద కేసు బనాయించారు. కోర్టులో కేసు ఎగిరిపోయింది!" గజరాజు సగర్వంగా అన్నాడు.

"ఏదో టెక్నికల్ పాయింట్ ఆధారంతో తెలివిగా లాయర్ జంబులింగం నిన్ను రక్షించాడు! వారం రోజుల క్రితం మరణించిన డాక్టర్ దుర్గాప్రసాద్ ఆ కేసులో నీకు గట్టి ఎలిబీ ఏర్పాటుచేసినట్టు లాయర్ జంబులింగం మాకు చెప్పాడు."

గజరాజు అదిరిపడ్డాడు. రంగారావు నిజంగా రంగారావే. త్రివిక్రమ్ అనుచరుడే. జంబులింగంతో సంప్రదించి వచ్చినవ్యక్తే. తనకి డాక్టర్ దుర్గాప్రసాద్ ఎలిబీ సృష్టించినట్టు, లాయర్ జంబులింగానికీ, తనకూ, డాక్టరుకీ ముగ్గురికే తెలుసు!

"దుర్గాబాయి కథ అయిపోయింది. ఈ హత్య నేను చేయలేదు!" గజరాజు మొండిగా అన్నాడు.

రంగారావు చిన్నగా నవ్వాడు. "త్రివిక్రమ్ అంకుశం పోటుని తట్టుకోలేక, బ్రహ్మాండమైన ఫీజు తీసుకుని, నీ కేసు వాదించడానికి జంబులింగం అంగీకరించాడు. నీకథా కమామీషూ అతనే నాకు పూర్తిగా చెప్పాడు. నీ స్టేట్మెంట్ రికార్డుచేయడానికి నన్నుపంపించాడు...." అంటూ రంగారావు జేబులోంచీ జంబులింగం లెటర్‌హెడ్ కాగితాలూ, వకాల్తానామా ఫారాలూ తీసి, గజరాజుకి చూపించాడు.

నాలుకతో పెదాల్ని తడుపుకుంటూ గజరాజు ఆ కాగితాల్ని జాగ్రత్తగా చూశాడు.

"ఈ హత్య నీ హస్తలాఘవమే అని నీ అడ్వొకేట్ సంపూర్ణంగా నమ్ముతున్నాడు; పోలీసులూ నమ్ము తున్నారు. ఈ హత్య విషయంలో నీ గురించి పోలీస్ డిపార్టుమెంట్‌కి ఎంత తెలుసో తెలుసుకో డానికి త్రివిక్రమ్ పెద్దమొత్తాన్నీ, పలుకుబడినీ వినియో గించారు. నెత్తిమీద సమ్మెటలా దిగే ఎవిడెన్స్ దొరికే దాకా 'నేను చేయలేదు; నేను చేయలేదు' అంటూ నువ్వు పాటపాడుతూ కూచోవచ్చు! కానీ అది సరైన పద్ధతికాదు. మెడమీదికి దూసుకొస్తున్న గండ్రగొడ్డలినుంచీ తప్పించు కోడానికి ప్రయత్నించాలి. గజరాజూ, ఎదుగు! యథా ర్థాన్ని ఎదుర్కో!" రంగారావు అతని కళ్ళల్లోకి చూస్తూ అన్నాడు.

గజరాజు రెప్పవేయకుండా చూస్తున్నాడు. అతని కళ్లు రెస్ట్‌లెస్‌గా కదుల్తున్నాయి.

"యావజ్జీవ కారాగార శిక్ష అనుభవిస్తున్న గంగారామ్ నీకు తెలుసు. అతని తరఫున జంబులింగం వాదించాడు. అయితే గంగారామ్ తన లాయరుతో పూర్తిగా నిజం చెప్పలేదు. తనని సర్వనాశనంచేసే ఎవిడెన్సుని అతను దాచిపెట్టాడు. అది పోలీసులకి దొరికింది. కోర్టు గంగా రామ్‌ని క్రైమా చేసేసింది! అతను ముందుగా నిజం చెప్పివుంటే ఆ ఎవిడెన్సు మాయంచేయబడి వుండేది! నువ్వు కూడా...."

"గజరాజు ఎవిడెన్సులు వదలడు!" గజరాజు సగర్వంగా అన్నాడు.

"రంగారావు నవ్వాడు. "క్లూ వదలకుండా పకడ్బందీగా నేరాలు చేసే జిత్తులమారిగా నీకు పేరుంది. గతంలో అది నిజంకావొచ్చు. కానీ ఇప్పుడు నువ్వు నిన్ను రెండుసార్లు

ఉరితీయడానికి సరిపడేన్ని సాక్ష్యాలు వదిలేశావు. బురదలో తొక్కి మొజాయిక్ మీద అడుగుల గుర్తులు వదిలేశావు!"

గజరాజు కళ్ళు చిట్లిస్తూ చూశాడు. అతని కళ్ళలో ఏదో అనుమానం ప్రత్యక్షమైంది.

"గజరాజూ, కేశవరావుని హత్యచేసేముందూ, ఆ తర వాతా నువ్వు ఏమేంచేశావో వివరంగా చెప్పు...."

గజరాజు కోపంగా చూశాడు. "మళ్ళీ చెప్తున్నా! నేను ఎవర్నీ హత్యచేయలేదు! ఏదో హత్యజరిగినట్టు విన్నా...."

రంగారావు వెటకారంగా నవ్వాడు. టైమ్ చూసుకుని తగ్గుస్వరంలో ప్రారంభించాడు: "బాగా వర్షం కురుస్తోంది. రబ్బరు బూట్లూ, లాంగ్ కోటూ, హేటూ వేసుకుని గ్లవ్స్ ధరించి బయల్దేరావు. పైపు పట్టుకుని ఎగబ్రాకి, కేశవ రావు గదిలోకి చేరుకున్నావు. నిద్రిస్తున్న కేశవరావు తల గడ కిందినుంచీ తాళంచెవులు తీసి ఇనప్పెట్టి తెరవడానికి ప్రయత్నించావు. కేశవరావు మేల్కొన్నాడు. నువ్వు అతనికిమీదికి లంఘించావు. కేకలుపెట్టే అవకాశం ఇవ్వ కుండా అతని నోరు నొక్కేశావు. సిల్కుురుమాలుని అతని మొహంమీద కప్పి, మెత్తటి తలగడని దానిమీద బలంగా అదిమిపట్టుకున్నావు. కేశవరావు ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. ఇనప్పెట్టెలోని లక్షరూపాయలు ఖాళీ చేసి, చల్లగా జారుకున్నావు...."

గజరాజు ఎగతాళిగా నవ్వాడు. "వింటూంటే అదంతా నిజంగానే చేశానేమో అనిపిస్తోంది!"

అతని వ్యంగ్యాన్ని నిర్లక్ష్యంచేస్తూ రంగారావు చెప్పుకుపోయాడు.

"కేశవరావు ఇంటివెనక సందులోవున్న పెంకుటింటి

వరండాలో తలదాచుకున్న కుంటి బిచ్చగాడు నువ్వు పైపమ్మట ఎగబ్రాకడం, కాసేపటి తరవాత దిగజారడం కళ్ళారాచూశాడు. రోడ్డుమలుపు తిరుగుతూ నువ్వు వీధి లైటుకిందికి వెళ్ళావు. నీముఖం బిక్షగాడికి శుభ్రంగా కని పించింది. నీ ఆకారాన్నీ, సైజునీ, నీ ముఖాన్నీ అతను ఖచ్చితంగా వర్ణించాడు...."

గజరాజు బరువుగా ఊపిరి పీల్చుకుని, ఇబ్బందిగా కదిలాడు. ఏదో భయం అతని కళ్ళల్లో పొరలా కనిపించ సాగింది.

"కంగారు పడొద్దు. నీ అదృష్టంకొద్దీ ఆ బిచ్చగాడు పోలీసులతో మాట్లాడలేదు!" రంగారావు నవ్వుతూ అన్నాడు.

గజరాజు మొహంలో ఏదో తెరిపి కనిపించింది. అప్రయత్నంగా అతను పళ్ళు కొరుక్కున్నాడు. "ఆ అడుక్కుతినే వెధవ కుంటివాడు కాకుండా గుడ్డివాడైతే బాగుండేది!" అన్నా డతను.

రంగారావు నవ్వాడు. "అతను నిన్ను చూడకపోయినా మరేం ఫర్వాలేదు. నిన్ను పట్టిచ్చే సాక్ష్యాల్ని. ఆనవాళ్ళని నువ్వే పుష్కలంగా వదిలేసి పారిపోయావు! నీ ఉరితాడుని నువ్వే పేనుకున్నావ్!"

"నడుస్తూ అడుగుల గుర్తుల్ని నేను మాయంచేస్తాను!" గజరాజు మేకపోతు గాంభీర్యంతో అన్నాడు.

రంగారావు వెక్కిరింపుగా నవ్వాడు. "నీ చుట్టూ ఉచ్చు బిగుసుకోకుండా వుండాలంటే సూదిమొనంత ఎవిడెన్సు కూడా పోలీసుల చేతుల్లో పడకూడదు...."

గజరాజు అసహనంగా చప్పరించాడు. రంగారావు అతన్ని తీక్షణంగా చూశాడు.

"నేను చెప్పేది పూర్తిగా వింటే గర్వంగా, విసుగ్గా చప్పరించడం మాని భోరున ఏడుస్తావ్! బర్కిలీ పద్ధతిలో కేశవరావుని నువ్వు హత్య చేస్తున్న సమయంలో, ఊపి రాడక విలవిల్లాడుతున్న అతని చెయ్యి నీ కోటుని పట్టు కుంది. ప్రాణం పోయేలోగా శరీరంలో సంభవించిన కన్ వల్షన్స్‌తో అతని చేతివేళ్ళు నీ కోటు గుండీని లాగేశాయి. పొద్దుటే, బిగుసుకుపోయిన అతని పిడికిలిలో ఆ గుండీ పోలీసులకి చిక్కింది!" రంగారావు ఆగి చూశాడు.

గజరాజు కళ్ళు గుండ్రటి బిళ్ళల్లా అయ్యాయి అతను ఊపిరి పీల్చుకోవడం మానేశాడు. భయం ఉళితో చెక్కి నట్టు స్పష్టంగా అతని మొహంలో కనిపించసాగింది.

"నిన్ను గుండంలోకి తోయడానికి ఆ గుండీ చాలు! కానీ అది చాలదన్నట్టు నువ్వు మరో ఎవిడెన్స్‌నీ వదిలే శావ్!" రంగారావు చిన్నగా అన్నాడు.

గజరాజు పెదవులు వణికాయి. "ఏ....మి....ట....ది?" ప్రశ్న గుసగుసగా వెలువడుతోంది.

"వేలిముద్రలు పడకుండా వుండటానికి ముందు జాగ్రత్తతో గ్లవ్స్ తొడుక్కున్నావు. నోట్లకట్టల్ని జేబుల్లో కుక్కుకుని ఆదరాబాదరా కిటికీ గుండా పైపుమీదికి జారు కున్నావు. ఆ సమయంలో కిటికీ ఫ్రేముకి కొట్టబడి, కూచిగా కొంచెం పైకి పొడుచుకువచ్చిన మేకు నీ చేతి గ్లౌవ్‌కి తగులుకుంది. కంగారులో వున్న నువ్వు దాన్ని గమనించలేదు. అరంగుళం వెడల్పుతో చిరిగిపోయి, ఆ మేకుకి తగులుకుంది...."

"మైగాడ్!" గజరాజు బొంగురుగా అన్నాడు. "నేను.... నేను.... చూసుకోలేదు...."

"మూడొంతులు నువ్వు ఆ గ్లౌస్‌ని యధాలాపంగా

కోటు జేబుల్లో దోపేసివుంటావు. అవునా?" రంగారావు ప్రశ్నించాడు.

గజరాజు బలహీనంగా తల ఆడించాడు.

"ఏమాత్రం ఆలస్యం చేయకుండా నీ లాంగ్‌కోటునీ, గ్లాస్‌నీ మనం మాయం చేయాలి...."

"మీరు....మీరు....ఆ పని చేస్తారా?" గజరాజు ఆశగా గాబరాగా ప్రశ్నించాడు.

"ఆ పని చేస్తేగానీ, నిన్ను పట్టిచ్చే ఎవిడెన్స్ పోలీసులకి అందకుండా చేస్తేగానీ జంబులింగం నీ కేసు తీసుకోడు. అతను తీసుకోకపోతే ఎంతకీ పొదగబడని బాతుగుడ్డులా నువ్వు జెయిల్లో మగ్గుతావు!"

గజరాజు కళ్ళు సగం మూతలుపడ్డాయి. కాసేపు ఆలోచించి అతను రంగారావు కళ్ళలోకి చూశాడు.

"ఇదంతా....మీరు ఎందుకు చేస్తున్నారు? నేను మీకు ఏం చేయాలి?" ప్రశ్నించాడతను.

"ఇందాకే చెప్పాను. గజదొంగగా, హంతకుడుగా నువ్వు సంపాదించుకున్న ప్రఖ్యాతి బాస్‌కి నచ్చింది. నీలాంటివాడు తన చేతుల్లో వుండాలని ఆయన అనుకుంటున్నారు. నీ ద్వారా ఏవో కొన్ని అద్భుతాల్ని ఆయన చేయిస్తారు...."

"మీ బాస్ చెప్పింది చేస్తే నా కేమిటి లాభం?" గజరాజు కళ్ళు చిట్లిస్తూ అడిగాడు.

రంగారావు నవ్వాడు. "మా సహాయాన్ని తీసుకుని నువ్వు క్షేమంగా బైటపడ్డాక అడగాల్సిన ప్రశ్న అది! కేశవరావు మర్డర్ కేసు కత్తిలా నీ మీద వేళ్ళాడుతున్నంతకాలం నువ్వు బేరాలు చేయలేవు!"

గజరాజు కళ్ళు దించుకున్నాడు. కదలకుండా విగ్ర

హంలా కూచున్నాడు.

రంగారావు మళ్ళీ అన్నాడు: "మాతో చేరాక నీకు చట్టం బెడదా, పోలీసుల భయం వుండవు. రాజుగారి కొడుకులా, మంత్రిగారి అల్లుడిలా నువ్వు బతకొచ్చు! నీ చేతిలో లక్షలు పైసాల్లా చెలామణీ అవుతాయి. మే మంతా ఏడాదిలో ఎన్నో లక్షల్ని సరదాగా పేకాటలో, రేసుల్లో పోగొట్టుకుంటూ వుంటాం!"

గజరాజు గుడ్లు గోలీల్లా అయ్యాయి. మెల్లగా తల పంకించి అతను రంగారావుకేసి కొత్తగా చూశాడు.
"మీ గుంపుల చేరతాను!" అన్నాడతను నవ్వుతూ.

"వెరీగుడ్! చేరాలంటే నువ్వు చెక్కుచెదరకుండా బైటపడాలి. నువ్వు కేర్లెస్‌గా వొదిలేసిన ఎవిడెన్స్‌ని మాయంచేయాలి. హత్య జరిగిన సమయంలో నువ్వు మరోచోట ఉన్నట్టు నిర్భేద్యమైన ఎలిబీ సృష్టించాలి.... డా. దుర్గాప్రసాద్‌లాంటి నమ్మకమైన వ్యక్తి ఎవరేనా వున్నారా?" రంగారావు ప్రశ్నించాడు.

"ఉన్నారు."

"సోమవారం రాత్రి ఏ సమయంలో కేశవరావింట్లో వున్నావు నువ్వు?...."

"....పన్నెండు....దాటివుంటుంది...." గజరాజు ఆలోచిస్తూ అన్నాడు.

"కరెక్టు. డాక్టర్ రిపోర్ట్ ప్రకారం 12-15 ప్రాంతంలో కేశవరావు మరణించాడు. ఆ సమయంలో నీకు ఎలిబీ యిచ్చే వ్యక్తి ఎవరు?"

గజరాజు నవ్వుతూ చూశాడు. "సోమవారం సాయంత్రం అరుగంటల నుంచీ తెల్లారేదాకా నేను తన ఇంట్లో వున్నట్టు పారిజాతం కుండ బద్దలుకొట్టి చెప్తుంది!"

అన్నాడు సగర్వంగా.

"ఎవరా పారిజాతం?"

"నా....నా....స్నేహితురాలు. నా కోసం ప్రాణాలిచ్చేస్తుంది. సోమవారం సాయంత్రం ఆవింటినుంచీ...."

"సరిగ్గా అలాంటి ఎలిబీకోసమే పోలీసులు చూస్తూ వుంటారు. అలాంటి ఎలిబీలు నకిలీవని వాళ్ళకి తెలుసు. పారిజాతం ఇల్లెక్కడుంది?"

"వన్‌టౌన్‌లో."

"గుడ్! కేశవరావింటికి చాలా దూరం అన్నమాట. రాత్రి పన్నెండుకి అక్కడున్న నువ్వు 12-15 కి అతని ఇంటికెళ్ళి హత్య చేయడం అసంభవం. గజరాజూ, ఆమెని నేను చాలా అర్జెంటుగా కలుసుకోవాలి!"

"నంబర్ 15, ఇందిరా నగర్. వెళ్ళి కలుసుకోండి!" గజరాజు నవ్వుతూ అన్నాడు.

"ఓకే. తరవాత గుండీ వూడిపోయిన లాంగ్‌కోటూ, చిరిగిపోయిన గ్లౌ...."

"ఔను. వాట్ని....మీరు మాయం చేస్తారా?" గజరాజు ఆత్రంగా అడిగాడు.

"చేసితీరాలి! నా కళ్ళముందు అవి గాలిలో కలిసిపోయేదాకా, జంబులింగం కేసు టేకప్ చేయడు!"

"అవి పారిజాతం దగ్గరే వున్నాయి."

రంగారావు కనుబొమలు పైకి లేచాయి. జేబులోంచీ అతను జంబులింగం లెటర్‌హెడ్‌ని తీశాడు. బాల్ పాయింట్ పేనానీ, కాగితాన్నీ గజరాజుకి అందించాడు.

"ఆ వస్తువుల్ని తక్షణం నా స్వాధీనం చేయమని ఆమెకి రాసి, సంతకం పెట్టు!" అన్నాడతను.

గజరాజు రాయడం ప్రారంభించాడు.

"గజరాజూ, పారిజాతం నీ ఫ్రెండని అందరికీ తెలుసా?" రంగారావు ప్రశ్నించాడు.

"ఆమె నా కొత్త ఫ్రెండు. ఆమెని వదిలేసిన భర్తకే తెలీదు!" అంటూ నవ్వి గజరాజు మళ్ళీ రాయడం ప్రారంభించాడు.

"అలాగే ఆ లక్షరూపాయలు నా స్వాధీనం చెయ్యమని రాయి!"

గజరాజు ఉలిక్కిపడి, తలెత్తి చూశాడు. ఆశ్చర్యంతో నమ్మలేనట్టు నోరు పూర్తిగా తెరిచాడు. "వాట్?"

"కేశవరావు ఇనస్పెక్టర్లోంచీ నువ్వు లక్షరూపాయలు కొట్టేశావని జంబులింగానికి తెలుసు. ఆ రోజే ఆ మొత్తాన్ని అతను బాంకులోంచీ విత్‌డ్రా చేశాడు. ఆ లూట్‌లో సగం ఫీజుకింద ఇస్తేగానీ జంబులింగం నీ తరఫున కోర్టులో హాజరు కాడు! తతిమ్మాది బాస్ తీసుకుంటారు. ఉరికంబానికి వేళ్ళాడకుండా నిన్ను కాపాడ్డానికి జంబులింగం, త్రివిక్రమ్ చాలా శ్రమపడుతున్నారు. పైగా ...."

"ఇది అన్యాయం!" గజరాజు కీచుగా అరిచాడు. పేనా అతని వేళ్ళ మధ్యనుంచీ టేబుల్ మీదికి జారింది.

రంగారావు చిరునవ్వు నవ్వాడు "నువ్వు తెలివైనవాడి వనుకున్నాను. నీ ప్రాణం కన్నా నీ దృష్టిలో డబ్బు విలువైందని నాకు తెలీదు! బాస్‌తో చేరితే ఇలాంటి లక్షలు ఎన్నో నీ చేతుల్లో తిరుగుతాయని అప్పుడే చెప్పాను. నిజం చెప్పాలంటే తను తీసుకునే సగాన్ని నీ కోసం వివిధ వ్యక్తులమీద బాస్ ఖర్చుచేస్తాడు. నువ్వు ఆలోచించి తేల్చుకో. ఆ లక్ష చెల్లిస్తేగానీ నువ్వు లక్షణంగా వుండవు!"

గజరాజు అయోమయంగా, అడకత్తెరలో ఇరుక్కున్న వాడిలా చూస్తూ మౌనంగా వుండిపోయాడు. ఏదో వోటమి, ఏదో విచారం, తన అసహాయతమీద కోపం అతని మొహంలో కలిసికట్టుగా కనిపిస్తున్నాయి.

"గజరాజూ, నీకు మరో సంగతి తెలిసివుంటే అసలు ఆ పైకాన్ని ముట్టుకునే వాడివే కాదు!" రంగారావు అన్నాడు. గజరాజు ప్రశ్నార్థకంగా చూశాడు.

"ఎవరో కేశవరావని బ్లాక్ మెయిల్ చేశారు. బ్లాక్ మెయిలర్‌కి సమర్పించడానికి అతను బాంకులోంచీ ఆ పైకం తీశాడు. తీసుకునే ముందు, ముందుజాగ్రత్తగా ఆ వందరూపాయ నోట్ల నంబర్లు బాంకులో గుర్తుంచుకునేలా చేశాడు. ఆ నోట్ల నంబర్ల లిస్టు ఇప్పుడు పోలీసుల చేతిలో వుంది. సువ్వా డబ్బుని నీ స్నేహితురాలు పారిజాతం దగ్గర దాచావని నేను ఊహించగలను!" రంగారావు ఆగాడు.

గజరాజు మొహంలో కొత్త కంగారు. రంగారావు అతని భావాల్ని చదువుతూ మళ్ళీ అన్నాడు:

"పొరపాటున పారిజాతం అందులోంచీ ఒక్క నోటు తీసి ఖర్చుచేస్తే చాలు. బండారం బైట పడిపోతుంది! పోలీసువాళ్ళు ఎగిరి గెంతులేస్తూ హత్య, దొంగతనం నేరాల్తో బాటు బ్లాక్ మెయిల్ నేరంకూడా నీ తలకి చుట్టి, ఉరితాడుని నీ మెడకి చుట్టుతారు!"

గజరాజు పెదవులు వణకడం ప్రారంభించాయి. మెల్లిగా తనని కంట్రోల్ చేసుకుంటూ అతను ప్రశ్నించాడు: "నంబర్లు నోట్ చేయబడిన ఆ నోట్లని మీరు ఎలా చలామణీ చేస్తారు?"

రంగారావు సగర్వంగా నవ్వాడు. "దొంగనోట్లని

చలామణీ చేయడం అందరివల్లా కానట్టే ఈ నోట్లని చలామణీ చేయడం అందరివల్లా కాదు. మొత్తం సొమ్ముని త్రివిక్రమ్ తీసుకుంటారు. జంబులింగానికి యాభై వేలకి వేరే నోట్లిస్తారు. నువ్వు కన్నుమూసి తెరిచేలోగా ఆ నోట్లని ఆయన మాయం చేస్తాడు. ఆయన గురించి నీకు తెలీదు...."

గజరాజు మాట్లాడకుండా తలవంచి కాగితంమీద రాయసాగేడు. రాయడం ముగించి, వకాల్తా నామా కాగితాల్లో సంతకాలు చేశాడు. కాగితాన్ని రంగారావుకి అందించాడు.

"నా ప్రాణంకోసం ఆ డబ్బుని త్యాగం చేస్తున్నా...."

రంగారావు చిన్నగా నవ్వి, అతను రాసిందాన్ని చదూకుని పేపర్ని మడిచి జేబులో పెట్టుకున్నాడు. మెల్లిగా లేచి నిలబడి. గజరాజువైపు నవ్వుతూ చూశాడు.

"త్వరలో బాస్ నీచేత కొన్ని అద్భుతాలు చేయిస్తాడు, వాటిని నీకోసం ఆయన రిజర్వ్ చేశారు. వారం రోజుల్లో నువ్వు రెండులక్షలు సంపాదించుకోగలవు! దొంగిలించిన లక్ష పోయిందని ఏడవకు! వెళ్తాను; పారిజాతాన్ని కలుసుకోవాలి...." అంటూ కటకటాల వైపు అడుగులేశాడు.

"రంగారావుగారూ...." గజరాజు కంఠం అతన్ని ఆపింది.

"నా కష్టార్జితాన్ని మీ చేతికి ఇచ్చేస్తున్నా. నన్ను త్వరగా విడిపించి తీసుకెళ్ళండి! లాయర్ జంబులింగాన్ని పాతరోజులు గుర్తు చేసుకోమనండి...." గజరాజు నీరసంగా చూస్తూ అన్నాడు.

"గజరాజూ, నిశ్చింతగా వుండు. విశ్రాంతి తీసుకో. బాస్‌తో చేరాక నీకు విశ్రాంతి దొరకదు! వారం తిరిగేలోగా నిన్ను ఏనుగుమీద ఎక్కించి, బాజాభజంత్రీల్తో

బైటికి తీసుకెళ్తాం!" అన్నాడు రంగారావు తగ్గుస్వరంలో. గజరాజు మొహంమీద చిరునవ్వు ప్రకాశించింది.

రంగారావు గార్డుకోసం కటకటాలమీద చప్పుడు చేశాడు.

3

ఇందిరానగర్‌లో రోడ్డుమీద నిలబడి రంగారావు 15 వ నంబరు ఇంటివేపు చూస్తూ నిలబడ్డాడు.

రాత్రి ఎనిమిది దాటింది.

సిగరెట్ పీలుస్తూ ఇంటినీ పరిసరాల్నీ జాగ్రత్తగా గమనిస్తూ వుండిపోయాడతను. మధ్యతరగతి నివాసాల్లా వున్న ఇళ్ళమధ్య 15 వ నంబరు ఇల్లు ప్రత్యేకంగా అవుపిస్తోంది. చిన్నగా వున్నాకూడా ఇంపుగా వుంది.

పారిజాతం ఎవరో తనకి తెలీదుగానీ, డాబుసరిగా జీవించే వ్యక్తి అయివుండాలనిపిస్తోంది యింటిని చూస్తోంటే. చిన్న గేటుని తోసుకుని రంగారావు గుమ్మం వేపు అడుగులేశాడు.

ఇంటిముందు లైటులేదు. ముందున్న చిన్నతోటలో వున్న నైట్‌క్వీన్ మత్తెక్కేలా సువాసనని వెదజల్లుతోంది. వేళ్ళకణుపుల్తో తలుపుమీద రంగారావు చప్పుడు చేశాడు. నిమిషం తరువాత తలుపువెనుక చప్పుడైంది. సిగరెట్‌ని తోటలోకి విసిరాడతను.

తలుపు తెరిచిన స్త్రీ ఫుల్‌సూట్‌లో వున్న రంగారావుని ప్రశ్నార్థకంగా చూసింది.

"పారిజాతం...." అన్నాడు రంగారావు.

"నేనే....ఏం కావాలి?" ఆమె కంఠంలో విసుగు ధ్వనించింది.

"మీతో మాట్లాడాలి...."

"మీరెవరు?"

"లాయరు రంగారావు."

"మీరెవరో నాకు తెలీదు. నేను ఒంటరిగా వున్నాను" అందామె సందేహిస్తూ. ఆమె భాష స్వచ్ఛంగా వుంది. గజరాజు లాంటి గజదొంగతో ఈమెకి పొత్తు ఎలా కుదిరింది? ఆలోచిస్తూ రంగారావు చిరునవ్వు నవ్వాడు. గదిలో వెలుగుతున్న ఫ్లోరసెంట్ కాంతి ఆమె వెనుక నుంచీ పల్చటి దుస్తులగుండా దూసుకొస్తోంది.

"నా పనికి మీరు ఒంటరిగానే వుండాలి...." రంగారావు నవ్వుతూ అన్నాడు. పారిజాతం నవ్వలేదు. మౌనంగా అతన్నే క్షణకాలం చూసింది. ఏదో అనుమానం ఆమెని పీడిస్తోంది.

"గజరాజు పంపించాడు...." కంఠస్వరం బాగా తగ్గించి మెల్లగా అన్నాడతను.

పారిజాతం కళ్ళు గిన్నెల్లా పెద్దగా అయ్యాయి. అసంకల్పితంగా రెండడుగులు వెనక్కి వేసింది. అప్పుడే చూస్తున్నట్టు అతన్ని ఎగాదిగా చూసింది. రంగారావు లోపలికి జరిగాడు. తలుపు ఇంకొంచెం కదిలింది. పారిజాతం వెనక్కి తిరిగింది. తలుపు మూసి గొళ్ళెం పెట్టేసి వీపుని దానికి ఆనించి రంగారావు నించున్నాడు.

అతనివైపు తిరిగి పారిజాతం కన్నార్పకుండా చూస్తోంది. తనని అడక్కుండానే తన గురించి అంతా తెలుసుకోవాలన్న తాపత్రయం ఆమె కళ్ళల్లో కనిపిస్తోంది. సందేహ సరోవరాల్లో వున్న ఆమె కళ్ళు అతనివైపు ఏవో ప్రశ్నల్ని రువ్వుతున్నాయి.

తెల్లటి పల్చటి చీరలో ఆమె శ్వేతాభిసారికలా వుంది. జాకెట్టు పైటలోంచీ మరీ తెల్లగా కనిపిస్తూ పైటని ఎత్తి

పట్టుకుంది. ఎర్రటి తిలకం ఆమె నుదురుమీద ఉదయిస్తున్న సూర్యుడిలా వుంది. పొడుగ్గా. లావుగా వున్న పారిజాతంలో మగాణ్ణి అయస్కాంతంలా ఆకర్షించేది ఏదో వుంది.

చదువూ, సంస్కారం, దర్పంవున్న స్త్రీలా ఆమె అవుపిస్తోంది. గజరాజు చేతికిందికి ఆమె ఎలా చేరింది? గజరాజు సంపాదించే డబ్బు చేతికిందికి ఆమె చేరి వుంటుంది! రంగారావు తనలో నవ్వుకున్నాడు. డబ్బు మనిషికి లేని అర్హతల్ని తెచ్చిపెడుతుంది.

పారిజాతం అసహనంగా కదిలింది విసుగు ఆమె మొహానికి కొత్తరంగుని పులుముతోంది. రంగారావు కదిలాడు. "కూచుని మాట్లాడుకుందాం...." అన్నాడతను, ఆమె వెనుదిరిగింది. పొడుగాటి వాలుజడ మిట్టపల్లాలమీద సోమరితనంగా పాకుతున్న పాములా కదుల్తోంది. పారిజాతం తలలోని బొండుమల్లెలు రంగారావువైపు నవ్వుతున్నాయి. రంగారావు నవ్వుకున్నాడు. అభిసారిక ఎవరికోసమో ఎదురుచూస్తోంది!

ఆమె ఎదురుగా కుర్చీలో కూచుని రంగారావు ఆమెని తదేకంగా చూసాడు. కుడివైపున్న గదిలో ఏదో కిందపడ్డ చప్పుడైంది. రంగారావు వోరగా అటువైపుచూసి, తన చూపుల్ని ప్రశ్నార్థకంగా ఆమెవేపు తిప్పాడు. ఆమె మొహంలో కొద్దిగా కంగారు వ్యక్తమవుతోంది.

"పిల్లి...." అందామె నవ్వడానికి వ్యర్థప్రయత్నం చేస్తూ. రంగారావు అర్థమైనట్టు తల పంకించాడు.

"గజరాజు ఉరికంబానికి అంగుళాల దూరంలో వున్నాడు...." అన్నాడతను.

"అతనేం చేశాడు?" కళ్ళు చిట్లిస్తూ అమాయకంగా

ప్రశ్నించిందామె.

రంగారావు నవ్వాడు. "నేను అతని శ్రేయోభిలాషిని. నాముందు నటించడం అనవసరం. సోమవారం రాత్రి పన్నెండూ అయిదు నిమిషాలకి అతను ఇక్కడకి వచ్చాడు. తెల్లారేదాకా ఇక్కడేవున్నాడు. ఇది మీరు బాగా గుర్తుంచుకోవాలి. కోర్టులో ప్రమాణంచేసి మరీ అప్పజెప్పాలి!"

ఆమె నవ్వింది. ఆమె తలలోని మల్లెలు పెదవుల సందులో మెరుస్తున్నట్టనిపించింది రంగారావుకి. "అంతేనా?" అందామె.

"అంతేకాదు; ఎంతో వుంది!" అంటూ రంగారావు కోటుజేబులోంచీ కాగితాల్ని తీశాడు. జంబులింగానికి తన కేసు అప్పజెప్తూ గజరాజు సంతకాలు చేసిన ఫారమ్స్‌ని ఆమెకి చూపించాడు.

"మీరు...." అంటూ అందామె.

"గజరాజు పర్మనెంట్ లాయర్ జంబులింగంగారి పర్మనెంట్ అసిస్టెంటుని!" రంగారావు నవ్వుతూ అన్నాడు.

"గజరాజు దాచమని మీ కిచ్చిన లాంగ్‌కోటూ. గ్లవ్స్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఏక్షణంలో అయినా వాళ్ళు ఇక్కడికి రావొచ్చు...." అన్నాడు మళ్ళీ.

పారిజాతం కంగారుగా చూసింది. లాయర్ జంబులింగం గురించి గజరాజు రెండుమూడుసార్లు తనకి చెప్పాడు. అతను ధరించిన నల్లకోటు తనచుట్టూ కోటలా వుందనేవాడు.

"ఆ కోటూ గ్లవ్సూ కేశవరావు హత్యకేసులో ముఖ్యమైన ఎవిడెన్సుగా తయారయ్యాయి. అవి చట్టం చేతికి

చిక్కిన మరుక్షణం గజరాజు పని అయిపోతుంది. అతనితో పాటు, అతనికి సహకరించిన పారిజాతం మెడకి కట్టు కున్న రాయిలా మునిగిపోతుంది!"

అంతసేపూ పారిజాతం మొహంలో కనిపించిన హుందా, గాంభీర్యం ఎక్కడికో ఎగిరిపోయాయి. అదురు తున్న పెదవుల్ని పళ్ళతో అదిమిపట్టింది.

"భయపడకండి. ఆ ఎవిడెన్స్‌ని మాయం చేయడానికీ డిఫెన్స్ కేసుకు బలం కలిగించడానికీ నేను వచ్చాను...." అంటూ రంగారావు గజరాజు ఉత్తరాన్ని ఆమెకి అందించాడు. ముందుకువంగి జారిపోతున్న ఉలిపిరిపైటను సర్దు కున్నట్టు నటిస్తూ కాగితాన్ని అందుకుందామె.

"గజరాజు ఏం చెప్పాడు?" కాగితం విప్పకుండా అడిగింది పారిజాతం.

గజరాజు ఎలావున్నాడని ఆమె ఇంతవరకూ వాకబు చేయకపోవడాన్ని గుర్తించి రంగారావు నవ్వుకున్నాడు.

"ఏం చెప్పాలో అంతా అందులో చెప్పాడు!" అన్నాడతను.

పారిజాతం చేతులు కాగితం మడత విప్పాయి. ఆమె చూపులు అక్షరాలవెంట పరుగెత్తాయి. క్రమంగా ఆమె మొహంలో రంగులు మారుతున్నాయి. పూర్తిగా పాలిపోయిన మొహాన్ని పైకెత్తి ఆమె అయోమయంగా రంగారావుని చూసింది. విచారం, కోపం ఆమె మొహంలో కపలపిల్లల్లా కనిపిస్తున్నాయి. ఆమె ఆలోచనల్ని చదువు తున్న రంగారావు ప్రారంభించాడు.

"తనని బ్లాక్‌మెయిల్ చేస్తున్న నేరస్థుడికి సమర్పించడానికి కేశవరావు బాంకులోంచీ ఆ లక్షరూపాయలు విత్‌డ్రా చేశాడు. బాంకువాళ్ళు ఆ నోట్ల నంబర్లని

గుర్తుంచుకునేలా చేశాడతను, ముందు చూపుతో. ఆ నంబర్లున్న లిస్టు ప్రస్తుతం పోలీస్ డిపార్ట్మెంట్ చేతుల్లో వుంది....”

పారిజాతం తలపైకెత్తి దిక్కుతోచనిదానిలా చూసింది. భయం ఆమె కళ్ళల్లో కాపురం చేయడం ప్రారంభించింది.

“ఆ కట్టల్లోని ప్రతినోటూ గజరాజు డెత్‌వారెంట్‌లా పనిజేస్తుంది. గజరాజుతో పరిచయంవున్న వాళ్ళందర్నీ పోలీసులు దువ్వడం ప్రారంభించారు. అంచేత ఆ నోట్లని జాగ్రత్తచేసే భారం గజరాజు మామీద వుంచాడు....” రంగారావు ఆగాడు.

కాసేపట్లో భర్తని పోగొట్టుకున్న ఆడదానిలా ఆమె భోరున ఏడ్చేస్తుందేమో అనిపించిందతనికి. వణుకుతున్న పారిజాతం చేతుల్లోంచీ కాగితం కిందపడింది. రంగారావు వొంగి దాన్ని తీసి జేబులో పడేసుకున్నాడు.

“కోటునీ, గ్లవ్స్‌నీ మీరు మాయంచేయండి తతిమ్మా దాన్ని....నేను....జాగ్రత్తగా జాగ్రత్తచేస్తాను....” పారిజాతం ఆశగా అంది.

“లక్ష రూపాయలకోసం మీరు పదేళ్ళు జెయిల్లో మగ్గడానికి రెడీగావుంటే నా అభ్యంతరం ఏమీలేదు. మూడు ఎవిడెన్సుల్నీ కనిపించకుండా చేస్తేగాని. యాభై వేలు ఫీజుగా ముట్టజేస్తేగానీ లాయరు జంబులింగం కేసు తీసుకోడు. అది జరిగితేనే గానీ గజరాజుకి క్షేమంలేదు. అతను మునిగిపోతాడు. అతన్తోబాటు అతని మొలతాడులా మీరూ....”

“అది....కాదు....” వణుకుతున్న పారిజాతం కంఠం అడ్డుతగిలింది.

“పొద్దుట అతన్ని నేను కల్సుకున్నప్పటినుంచీ పోలీ

సులు నన్ను నీడలా వెంటాడుతున్నారు. రోజంతా కష్టపడి, వాళ్ళ కళ్ళుగప్పి ఇలావచ్చాను. నేను మిమ్మల్ని కలుసుకున్నట్టు పోలీసులకి అనుమానం కలిగితే గజరాజుకి, ముఖ్యంగా మీకు ప్రమాదం. మీలాంటి అందగత్తెను వాళ్ళు చేతులమీద స్టేషన్‌కి మోసుకెళ్తారు. మీలాంటి స్త్రీలచేత నిజం కక్కించే ప్రయత్నంచేయడం వాళ్ళకి ఎంతో ఇష్టం....” రంగారావు ఆగి ఆమెను చూశాడు.

“గజరాజు....ఇవతలకి రాగానే....పైకం ఆయనకి ఇచ్చేస్తారా?” పారిజాతం ని ఆశ ప్రశ్నించింది.

“అత్తారింటినుంచీ అతన్ని ఇవతలికి రప్పించడానికి బోల్డంత ఖర్చవుతుంది. మిగిలింది సలక్షణంగా అతనికి ఇవ్వబడుతుంది. నిజం చెప్పాలంటే వేరే నోట్లు అతనికి అందుతాయి” అన్నాడు రంగారావు.

పారిజాతం నీరసంగా వెనక్కి వాలింది. గుమ్మంలో ఏదో చప్పుడైంది. రంగారావు తటాలున తలతిప్పి చూశాడు. పైజమా జుబ్బా వేసుకున్న పొడుగాటి వ్యక్తి గుమ్మంలో నిలబడి చూస్తున్నాడు. రంగారావు ఆశ్చర్యంగా చూసాడు. పిల్లి! తను ఇంట్లోకి రాగానే గదిలో చప్పుడు చేసిన పిల్లి ఇతనే అయ్యుండాలి;

“చెల్లాయ్....ఆ నోట్లూ, కోట్లూ అన్నీ ఆయనకి ఇచ్చేయి!” అన్నాడతను పారిజాతం వైపు నడుస్తూ.

పారిజాతం ఉలిక్కిపడి బలహీనంగా అతన్ని చూసింది. ఆమె కళ్ళు వోరగా రంగారావుని చూశాయి.

“ఆ డబ్బు పాయిజన్! గజం బావతో ఇలాంటి ఇబ్బందులుంటాయని నీ కెన్నిసార్లు చెప్పాను!” అన్నాడతను.

“అన్నాయ్....”

"అతన్తోబాటు నువ్వూ, నీతోబాటు నేనూ కటకటాల వెనక్కి వెళ్ళడం నాకిష్టంలేదు...." అంటూ అతను జుబ్బా జేబులోంచీ ఒక పందరూపాయల కట్టని తీసి టీపాయ్‌మీద పడేశాడు. "ఇంకా నయం....తొందరపడి ఈ కట్టని బజార్లో ఖర్చు చేయలేదు!"

పారిజాతం ఆశ్చర్యంగా చూసింది. "అందులోంచీ డబ్బెందుకు తీశావ్?" కోపంగా అడిగిందామె.

"నాగరత్న....పట్టుచీర కావాలంది...." అన్నాడతను తలవాల్చుకుని.

పారిజాతం అతన్ని ఎగతాళిగా చూస్తూ లేచి నిలబడింది. రంగారావువైపు నీరసంగా చూసింది.

"రండి. అంతా తీసుకెళ్ళండి...." అందామె బరువుగా నిట్టూరుస్తూ.

రంగారావు టీపాయ్‌మీదున్న నోట్లకట్టని అందుకుని లేచాడు. "సోమవారం రాత్రి గజరాజు ఇక్కడున్నట్టు సాక్ష్యం చెప్పడం మరిచిపోకండి. లాయరుగారి ద్వారా మీకో పదివేలు వచ్చేలా చూస్తాను. అఫ్‌కోర్స్ అది గజ రాజు అకౌంటులోనే అనుకోండి!" అన్నాడతను.

పారిజాతం ఆశగా చూసింది. "....ఆ పైకం ఈ పైకంలోది కాకుండా చూస్తారుగా!" అందామె. రంగా రావు నవ్వుతూ తల ఆడించాడు.

"చాలా కాలంపాటు ఈ నోట్లన్నీ అజ్ఞాతవాసంలో వుంటాయి!" అన్నాడతను.

పారిజాతం గదివేపు నడిచింది. ఆమె నడకలో ఇందాకటి దర్పం, నిర్లక్ష్యం లేవు. రంగారావు బ్రీఫ్‌కేస్‌తో ఆమెని వెంబడించాడు.

4

గదిలోకి వచ్చిన శివరామ్‌ని లత నవ్వుతూ చూసింది. ఆమె చూపులు అతని చేతిల ని బ్రీఫ్‌కేస్‌మీద పడ్డాయి.

"హై డార్లింగ్! వాట్ న్యూస్?" మంచంమీంచి కిందికి లేడిలా దూకుతూ అరిచిందామె.

శివరామ్ చేతిలోని బ్రీఫ్‌కేస్ చక్రంలా తిరుగుతూ మంచంమీద వాలింది. తన దగ్గరగా వచ్చిన లత భుజమ్మీద చెయ్యేసి శివరామ్ ఆమెని మంచంవైపు తిప్పాడు. అతని కుడిచెయ్యి బ్రీఫ్‌కేస్‌ని చూపిస్తూ సాగింది.

"న్యూస్ ఇన్ బ్రీఫ్ ఆ బ్రీఫ్‌కేస్‌లో వుంది: తెరిచి చూడు!" అన్నాడతను నవ్వుతూ.

లత ముందుకి గెంతి మంచంమీద ఎగిరి కూచుంది. పైకీ కిందికీ వూగుతూ బ్రీఫ్‌కేస్‌ని వొళ్ళోకి లాక్కుంది. క్లిక్‌మనిపిస్తూ తెరిచింది. ఆమె కళ్ళు ఆశ్చర్యంతో కలువ రేకుల్లా విచ్చుకున్నాయి. ఆనందంగా శివరామ్‌వేపు తిరిగాయి. ఆమెనే చూస్తూ శివరామ్ సిగరెట్ వెలిగించాడు.

"ఓహ్....! డార్లింగ్, ఎంత?" లత ఉద్రేకంతో అరిచింది.

"ఎంతో ఎక్కడుంది? లక్ష!" శివరామ్ నవ్వుతూ మంచం దగ్గరగా నడిచాడు.

"వాట్! వన్ లాక్! గుడ్ హెవెన్స్! ఏ చెట్టుకి కాశాయి ఈ నోట్లన్నీ?"

శివరామ్ మంచంమీద వాలి, రెండు కాళ్ళనీ నిటారుగా పైకెత్తి అర్ధచంద్రాకారంలో లతమీంచీ అటువైపుకి వేశాడు. అతని కుడిచెయ్యి బ్రీఫ్‌ని దగ్గరగా లాగింది. మూసేసి, దాన్ని మంచంకిందికి గిరాటేశాడు.

"హనీ, పరుగెత్తు. తలుపుకి తాళం బిగించు. నీకో

కథ చెప్తా!" అన్నాడతను.

నాట్యానికి నడకలు నేర్పుతున్న దానిలా లత గుమ్మం వైపు వెళ్ళింది. తాళంవేసి లేడిలా గెంతులేస్తూ మంచాన్ని సమీపించింది. మంచం వారగా బోర్లా పడుకుని, వెల్లకిలా పడుకున్న శివరామ్ ఛాతీమీద గెడ్డం ఆన్చింది. నవ్వుతూ అతని కళ్ళల్లోకి చూసింది.

"కమాన్! ఏం చేశావో చెప్పు డార్లింగ్!" ఆమె కంఠంలో ఆత్రం గంటలా ధ్వనించింది.

"నిన్నటి న్యూస్‌పేపర్ చూశావా?" శివరామ్ ప్రశ్నించాడు.

"చూశాను; చదువలేదు!"

"అనగా అనగా ఒక కేశవరావు. అతను ధనవంతుడు. సోమవారం పొద్దుటే అతను బాంక్‌లోంచీ లక్ష రూపాయలు విత్‌డ్రా చేశాడు. ఆరోజు అర్ధరాత్రప్పుడు అతను హత్యచేయబడ్డాడు. ఇనప్పెట్టెలో అతను దాచిన లక్ష రూపాయలు మాయం అయిపోయాయి...."

"గుడ్‌గాడ్!" లత ఆశ్చర్యంతో అరిచింది.

"'బర్కిలీ మెథడ్ అఫ్ కిల్లింగ్'ని ఉపయోగించి స్వాభావిక మరణాల్లా అపుపించేలా హత్యలు చేయడంలో చేయి తిరిగిన గజరాజుని పోలీసులు అరెస్టు చేశారు. తన సొంతం అయిన ఆ ప్రక్రియలో అతనే కేశవరావుని శవంగా మార్చాడని పోలీసులు గట్టిగా నమ్ముతున్నారు. ముందు జాగ్రత్తగా, ఏదో సాకుతో అతన్ని అరెస్టుచేసి అతన్ని వుచ్చులా బిగించే ఎవిడెన్స్ కోసం పోలీసులు అన్వేషిస్తున్నారు...."

"ఇదంతా పేపర్లో వుందా?" లత అడ్డొస్తూ అడిగింది.

"ఇంకా ఎంతో వుంది. క్రిమినల్ కేసుల్లో ఆరితేరిన

లాయర్ జంబులింగం గతంలో చాలాసార్లు గజరాజుని ఉరికంబం నుంచీ తప్పించాడు. గాడిదను గుర్రంలా చిత్రించి కేసుని తలక్రిందులు చేయడంలో అతను నోరు తిరిగిన ఘటం. గజరాజు అతనికి పుష్కలంగా డబ్బు చెల్లించేవాడు.

"కానీ ఈసారి గజరాజు కేసుని జంబులింగం తీసుకోడం లేదు. గజరాజునీ, అతన్నీ తోడుదొంగలుగా పేపర్లు చిత్రించాయి. మొసలి పళ్ళమధ్య ఇరుక్కున్న ఏనుగులా గజరాజు ఈసారి చట్టం పళ్ళమధ్య ఇరుక్కుని జెయిల్లో మగ్గుతున్నాడు. కాజేసిన లక్ష రూపాయల్ని ఎక్కడో దాచేశాడతను. అతని సహాయంతో ఆ సొమ్మని మనం తీసుకుంటే ఎలా ఉంటుందని ఆలోచేంచాను...." ఆగి, శివరామ్ మరోసిగరెట్ వెలిగించాడు.

ఆశ్చర్యంతో విచ్చుకుంటున్న లత కళ్ళు ఇంకా చెప్పమని అతన్ని అడుగుతున్నాయి.

శివరామ్ ప్రారంభించాడు "బుర్ర వేడెక్కేలా ఆలోచించాను. గజరాజు బంధువులా నటిస్తూ అడ్వకేటు జంబులింగాన్ని కల్సుకున్నాను. గజరాజుని రక్షించమన్నాను. అతను ఒప్పుకోలేదు. గజరాజుకి సంబంధించిన కొన్ని ముఖ్యమైన వివరాల్ని అతన్నుంచి సంపాయించాను. నిమిషానికి యాభై రూపాయల రేటుతో అతన్ని ఇరవయి నిమిషాలు మాట్లాడేలా చేశాను.

"లాయరుగా నటిస్తూ, జెయిల్లో గోళ్ళు కొరుక్కుంటు కూచున్న గజరాజుని కల్సుకున్నాను. కాంక్రీటుని సిమెంటుతో రీ ఇన్ఫోర్స్ చేసినట్టు త్రివిక్రమ్ పేరుతో నా పాత్రని పటిష్టం చేసుకున్నాను. తను అమాయకుడంటూ గజరాజు బుకాయించాడు. ఆనవాళ్ళు వదలకుండా హత్యలు

చేయడంలో తనని మించినవాడు లేడని అతని నమ్మకం. అదే గర్వంతో అతను బుకాయించాడు. పోలీసులకి చిక్కిన అతని లాంగ్‌కోటు గుండీ, చిరిగిన గ్లవ్ ముక్కా అతన్ని హంతకుడిగా నిరూపిస్తాయని నమ్మకంగా అతనికి చెప్పాను.

"గజరాజు హడిలిపోయాడు. అతను వదిలేసిన ఆ ఎవిడెన్స్‌లు పోలీసులకి చిక్కితే అతను క్రైమా అయిపోతాడని అదరగొట్టేశాను. తన గాంగ్‌లో అతన్ని చేర్చుకోడానికి త్రివిక్రమ్ నిశ్చయించుకున్నాడనీ, అందుకోసం అతన్ని రక్షిస్తాడనీ గజరాజుకి ధైర్యం చెప్పాను. మొదట గుండీలేని లాంగ్‌కోటునీ, చిరిగిన గ్లవ్‌నీ మాయం చేయాలన్నాను. హత్యజరిగిన సమయంలో తనకి ఎలిబీ ఇచ్చే స్త్రీ చిరునామా ఇచ్చాడు గజరాజు...."

"డార్లింగ్....అతను నిన్ను అంతలా నమ్మేశాడా?" లత ప్రశ్నించింది.

"ఎవిడెన్స్ వదిలేసిన సంగతి నేను చెప్పాక, అతనికి నన్ను నమ్మక తప్పలేదు. లాయర్ జంబులింగం ఆఫీసులో నేను కొట్టేసిన లెటర్‌హెడ్డూ, ప్రింటెడ్ ఫారమ్మూ అతనికి ఎంతో నమ్మకాన్నిచ్చాయి. నన్ను నమ్మడంవల్ల తను బయటపడే అవకాశం వుందనీ, అదో క్కిటే అవకాశమనీ అతను అనుకునేలా వర్కౌట్ చేశాను. నొటోరియస్ ముఠాలో చేర్చుకోబడే ఛాన్స్ అతనికి కొత్త ఊపిరి పోసింది. సో....తను వదిలేసిన ఎవిడెన్స్‌ని మాయం చేయమని అతను నన్ను అడిగాడు!" శివరామ్ నవ్వుతూ పొగ లాగాడు.

"ఎవిడెన్స్‌ని నాశనం చేసే అవకాశం నీకు ఇచ్చా

డతను. ప్రాణాలకు తెగించి, ప్రాణంతీసి దోచిన లంకె బిందెని నీకు ఎలా అప్పగించా డను?" లత ప్రశ్నించింది.

శివరామ్ నవ్వాడు. "అతని ప్రాణాలు దక్కాలంటే జంబులింగం కేసు తీసుకుని గెలవాలి. కేసు గెలవాలంటే జంబులింగానికి యాభై వేలు నైవేద్యంపెట్టాలి. త్రివిక్రమ్ అతన్ని ప్రోత్సహించాలి. ప్రోత్సహించాలంటే తతిమ్మా యాభై వేలు త్రివిక్రమ్‌కి చెల్లించాలి. ఇదంతా గజరాజు బుర్రలోకి బాగా ఎక్కించాను. ఊపిరాడక జెయిల్లో అతను చస్తాడేమో అనిపించింది!"

"తరవాత?" లత కంఠంలో ఉత్కంఠ పలికింది.

"నేనిచ్చిన డోస్ అతనికి చాల్లేదు. బ్లాక్‌మెయిల్ చేయబడిన కేశవరావు విత్‌డ్రా చేసిన నోట్ల నంబర్లు బాంకులో పోలీసులచేతల్లో ఉన్నాయన్నాను. మర్డర్ చోరీ కేసుల్తో బాటు బ్లాక్‌మెయిల్ కేసుకూడా తలకి చుట్టుకుని అతన్ని పాతాళానికి తొక్కేస్తుందన్నాను. త్రివిక్రమ్‌తో చేరాక అతను లక్షలమీద దొర్లిచ్చన్నాను. గజరాజు కన్ను లొట్టపోయినా చావు తప్పితే చాలనుకున్నాడు. కోటునీ, గ్లవ్సనీ, లక్ష రూపాయల్ని కళ్ళు మూసుకుని రంగారావుకి అప్పగించమని తన ప్రియురాలు పారిజాతానికి చీటీ రాశాడతను."

"ఓహో!"

"పారిజాతం గజరాజు దోచితెచ్చి తన దోసిట్లో పోసే డబ్బుని ప్రాణాధికంగా ప్రేమించింది. గజరాజు పోతే

పోయాడు, లక్షా దక్కితే చాలన్న ఆశ ఆమెలో కనిపిం చింది. సంగతిని రంగులు పూసి ఆమెకి వివరించాను. కోతిని అంటిపెట్టుకున్న తోకలా గజరాజుతోబాటు బోను లోకి వెళ్ళిపోతుందని ఆమెకి అర్థమయ్యేలా చెప్పాను. పారిజాతం వణికిపోయింది. చచ్చిపోయిన ఎలుకను పారేస్తున్నట్టు గజరాజు కోటునీ, గ్లవ్సనీ, లక్షరూపా యల్నీ నా చేతిల కుక్కింది:" శివరామ్ నవ్వుతూ అన్నాడు.

"డార్లింగ్....నువ్వాడిన నాటకం బైటపడితే...."

"బైటపడదు. గజరాజు నా గురించి పోలీసులకి చెప్ప లేదు. పారిజాతం చెప్పదు. జంబులింగం నన్ను ఈపా టికి మరిచిపోయి వుంటాడు. గజరాజుకి శిక్ష పడుతుందో లేదో మనకి ఖచ్చితంగా తెలీదు. శిక్ష పడకపోయినా అతను నా గురించి దండోరా వేసుకోడు. తేలుకుట్టిన దొంగలా కిక్కురుమనకుండా వుంటాడు. రంగారావు పగటివేషగాడని అతను తెలుసుకోడానికి కొంత టైమ్ పడుతుంది. ఇప్పుడున్న పరిస్థితిని బట్టి ఆలోచిస్తే ఏదో విధంగా సాక్ష్యాలు సంపాయించి పోలీసులు గజరాజుకి శిక్షపడేలా చూస్తారు...."

"ఉన్న ఎవిడెన్స్‌ని నువ్వు నాశనం చేశావుగా?" లత అనుమానిస్తూ అంది.

శివరామ్ పకపక నవ్వాడు. "గజరాజు లాంగ్‌కోటూ, గ్లవ్సూ ధరించాడని మాత్రమే నాకు తెలుసు. ఆ కోటుకి ఒక గుండీ వూడి హంతుడి చేతిలో ఇరుక్కున్నట్టూ, గ్లావ్ చిరిగిపోయినట్టూ తెలివిగా నేను కల్పించాను! నేను అతనికి

చెప్పిన విధంగా ఏ బిచ్చగాడూ అతన్ని చూడలేదు. పోలీసులకి దొరికిన బలహీన ఆధారాలకి చిలవలు పలవలు కల్పించి, గజరాజు మతి పోగొట్టాను!"

లత నవ్వుతూ తలని అతని ఛాతీమీద ఆన్చింది.

"నువ్వు తెగించి ఖూనీకోరుకి టోపీ వేశావు. అతను పైటపడితే, ముందు ముందు...." లత తన అనుమానాన్ని వ్యక్తం చేయబోయింది.

శివరామ్ నవ్వు ఆమెని ఆపింది. "డోంట్ యూ వర్రీ హానీ! ఉల్లిపాయలు తిన్న వ్యక్తిలా అతను నోరు మూసుక్కూచుంటాడు. రాత్రిపూట వేషాలు వేసి అమాయకుల్ని దోచుకునే జిత్తులమారి గజదొంగ అయిన గజరాజుని పగటివేషగాడిలా నేను దోచుకున్నాను! ఆధారాలు దొరక్కుండా దోచుకోడంలో తనొక్కడే ఆరితేరిన వాడు కాదని గజరాజు తెలుసుకుంటాడు! రంగారావు తమని నిలువుదోపిడీ చేశాడని అతనూ, అతని ప్రియురాలూ ఎవ్వరికీ చెప్పుకోలేరు. సో....ఉయ్ ఆర్ సేఫ్ అండ్ రిచ్!" అంటూ అతను తన వేళ్ళని లత జుట్టులోకి జొనిపాడు.

లత నాగకన్యలా కదుల్తూ అతని ఛాతీమీద ముందుకి జరిగింది. శివరామ్ ఆమెని చిలిపిగా చూశాడు. ఆమె చేతులు అతని మెడచుట్టూ బిగుసుకోసాగాయి.

"హనీ, గెటప్! సింగారించి, సిద్ధంకా. గుడారం ఎత్తేద్దాం!" అన్నాడు శివరామ్. లత అయిష్టంగా కదిలింది. □

['శివరామ్ నేరాలు' సీరిస్‌లో ఇది ఎనిమిదవ కథ]

అతడు బ్రహ్మచారుడు!

కొటుప్రోలు శ్రీమన్నారాయణ సత్యనారాయణ

"వర్ధనా!...."

వీధి వరండాలో వాలుకుర్చీలో కూర్చొని, ఆ రోజు పేపరు చదువుతున్న భర్త పిలుపు విని—వంటింట్లోంచి తడిచేతులు చీరకొంగుకు తుడుచుకుంటూ వచ్చింది వర్ధనమ్మ.

మౌనంగా భార్య చేతికి పేపరిచ్చారు నాయుడుగారు.

పేపరు అందుకుంటూనే—ఆమె దృష్టి మొదటి పేజీలో ప్రచురించబడిన ఫొటోమీద పడింది!....

"అబ్బ! మనబ్బాయి ఫొటో!....పేపర్లో వేశారండీ! ....పరీక్షల్లో అన్నీ ఫస్టు మార్కులు వచ్చివుంటాయి!.... అందుకే ఫొటో వేశారు....వాడి గురించి ఇంకా ఏం రాశారో చదవండి — వింటాను!...." మురిసిపోతూ, పేపరు తిరిగి భర్తకిచ్చి—క్రింద చతికిలబడి కూర్చుంది, చెవులు రిక్కించి....

"బ్యాంకు దోపిడీకి విఫల యత్నం చేసి పట్టుబడి జైలు నుంచి తప్పించుకున్న ఇతని కోసం పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు!...."

"ఏమిటండి?....ఏమిటి మీరంటున్నది?" గాబరాగా అంది వర్ధనమ్మ.

"నేను అనటం కాదు పేపరులో వున్నది చదివాను!"

"మనబ్బాయి బ్యాంకు దోపిడీ చేయడం ఏమిటి?.... నేను నమ్మను!...."

"పేపర్లో ఫొటోతో సహా వేశారు—చూశావుగా!"

"అదంతా అబద్ధం!....పట్నంలో మన అబ్బాయి బుద్ధిగా కాలేజీలో చదువుకుంటున్నాడు....అయినా వాడు అలాంటివాడు కాదండీ!...."

"కాకూడదనే అనుకుంటున్నాను. కానీ...."

"ఇంకా కానీ ఏమిటండీ?....మీరు వెంటనే పట్నంవెళ్ళి వాడ్ని తీసుకొచ్చేయండి!....లేకపోతే నిజంగా దొంగని వాడ్ని పోలీసులు లాఠీలతో కొడతారు....వెళ్ళండి!....నా కొడుకుని తీసుకురండి!...." దుఃఖం పెల్లుబికి వచ్చింది

వర్ధనమ్మకి.

"అలాగే!" అని కుర్చీలోంచి లేచారు నాయుడుగారు.

2

సాయంత్రం అయిదున్నర దాటింది.

పరీక్షలు దగ్గర పడటంతో కాలేజీనుంచి రాగానే స్నానంచేసి పుస్తకాలు ముందేసుకొని చదువుకుంటున్న శివరావు—

తలుపు చప్పుడైతే వెళ్ళి తీశాడు.

ఎదురుగా నాయుడుగారు కనిపించగానే—

"మీరా!....రండి!...." లోపలకు ఆహ్వానించాడు శివరావు.

"బాగా చదువుతున్నావా, బాబూ?" లోపలి కొచ్చి కుర్చీలో కూర్చుంటూ అడిగారు నాయుడుగారు.

"ఆఁ....మంచినీళ్ళిమ్మంటారా?"

"వద్దులే నాయనా!....పట్నం పనిమీద వచ్చాను....వచ్చిన పని అయింది....తిరిగి వెళ్తూ మిమ్మల్ని పలకరించి వెళ్దామని వచ్చాను....మా వాడేడి?...."

"ఇప్పుడే కాస్త అలా బయట తిరిగొస్తానని వెళ్ళాడు—"

"అబద్ధం ఆడకు!....నాకంతా తెలుసు...."

"మీరు బాధపడతారని - ఈ వార్త వింటే మీ ముసలి గుండె తట్టుకోలేదని అబద్ధం చెప్పి మిమ్మల్ని మభ్యపెట్ట బోయాను....బాబాయిగారూ!....ప్రతాప్ ఈ మధ్య బాగా మారిపోయాడు....కాలేజీకి అసలు రావటంలేదు...త్రాగుడు నేర్చుకున్నాడు....బాగా తప్పత్రాగి ఎప్పుడో అర్ధరాత్రికి రూంకి వచ్చేవాడు....ఇప్పుడు అదీ లేదు. 'శ్వేత' అనే ఉంపుడుగత్తెతో సంబంధం వుంది. ప్రతాప్ ఎక్కువగా

అక్కడే వుంటున్నాడు....నేను చాలాసార్లు, ఎన్నో విధాలుగా నచ్చచెప్పి చూశాను....నా మాట వినలేదు....ఆ ఉంపుడుగత్తె ప్రోద్బలంతోనే ప్రతాప్ బ్యాంకు దోపిడీకి పాల్పడి వుంటాడని నా అనుమానం!...." చెప్పాడు శివరావు.

"ఆ ఉంపుడుగత్తె అడ్రస్ నీకు తెలుసా?"

"వెలమపేటలో కొల్లివారి వీధిలో వుంటుందని ఓసారి ప్రతాప్ చెప్పాడు!...."

"వెళ్ళొస్తాను బాబూ!" కుర్చీలోంచి లేచారు నాయుడుగారు.

"మంచిదండి!"

"బాగా చదువు - కన్నవాళ్ళకి, కర్మభూమికి కష్టం కలిగించకు - భారంగా మిగలకు!...." అన్నారు నాయుడుగారు.

"అలాగేనండి! నమస్కారం!...." అంటూ భక్తితో రెండు చేతులు జోడించాడు శివరావు.

గుమ్మం దాటి వెళ్ళిపోతున్న నాయుడుగారిని చూస్తూ- 'ఇంత మంచివారి కడుపున ఎలాంటివాడిని పుట్టించావురా భగవంతుడా!....' అనుకున్నాడు శివరావు.

3

"ఎవరు కావాలి?" చిరాగ్గా అడిగింది శ్వేత.

"ప్రతాప్...."

"నువ్వెవరు?"

"వాడ్ని కన్నవాడ్ని!"

"బ్యాంకు దోపిడీ చేయడం చేతకాక—పోలీసులకు పట్టుబడి జైలునుంచి తప్పించుకున్నాడు....ఎక్కడున్నాడో నాకేం తెలుసు?...."

"లేదు. నువ్వే వాడ్ని ఎక్కడో దాచావ్! చెప్పమ్మా! నా కొడుకుని నాకివ్వు!...." ప్రాధేయ పడుతున్నారు నాయుడుగారు.

"నాకేం తెలియదంటే వినవేం?"

"అసలు నా కొడుకుని నీ వల్లో ఎందుకు వేసుకున్నావ్? వాడిచేత ఎందుకు దొంగతనం చేయించావ్?"

"నేనేం నీ కొడుకుని వలలో వేసుకోలేదు....రోజూ నా పొందుకోసం వచ్చేవాళ్ళు చాలామంది వున్నారు. వాళ్ళలో మీ అబ్బాయి ఒకడు....డబ్బు లేనిదే నా ప్రక్కకి వచ్చే అర్హత లేదు....ఆ అర్హత పొందాలంటే డబ్బు సంపాదించాలి....అందుకు నన్నేదయినా ఉపాయం చెప్ప మన్నాడు....'చలపతి' వద్దకు వెళ్ళమని సలహా ఇచ్చాను. మీ అబ్బాయిని తన ముఠాలోకి తీసుకున్నాడు చలపతి...." చెప్పింది శ్వేత.

"ఎవరా చలపతి?"

"గూండా నాయకుడు!"

"ఎక్కడుంటాడు?"

"వెళ్తావా?"

"అవును! నా కొడుకుగురించి ఆచూకీ తెలుసుకోవాలి!"

"నేనూ వస్తాను. చలపతి నాకోసం ఎదురు చూస్తూంటాడు...." అని ఇంట్లోకి వెళ్ళి హేండ్‌బ్యాగ్ తెచ్చుకొని బయల్దేరింది శ్వేత.

శ్వేతని అనుసరించారు నాయుడుగారు.

ఆయన మనసు బాధతో కృంగిపోతోంది!

లేకలేక పుట్టిన కొడుకు -

ఆల్లారుముద్దుగా పెంచుకున్న కొడుకు -

ఎన్నో ఆశలతో, ఆశయాలతో పెంచుకున్న కొడుకు..

దొంగ!

ఈ ఊహనే భరించలేకపోతోం దా పితృ హృదయం!

4

రాత్రి ఎనిమిది గంటలు దాటింది.

ఊరుకి దూరంగా వున్న ఆ బంగళా వరండాలో పచార్లు చేస్తూ మధ్య మధ్య చేతినున్న వాచీ చూసుకుంటున్నాడు చలపతి.

స్టూలుమీద సగం వరకు ఖాళీ అయిన ఖరీదయిన విస్కీ సీసా, ఆ ప్రక్కన సోడా సీసాలు వున్నాయి.

"కమాన్ డార్లింగ్!....ఏమిటీవేళ ఇంత ఆలస్యం అయింది?...." వరండా మెట్లెక్కి వస్తూన్న శ్వేతని వాటేసుకోబోయి. ఆగి—

"ఆ ముసలాడు ఎవరు?" అడిగాడు చలపతి.

"ప్రతాప్ తండ్రట."

"ఎందుకొచ్చాడు?"

"నా కొడుకుకోసం!" చెప్పారు నాయుడుగారు.

"జైలు నుంచి తప్పించుకున్న నీ కొడుకుని పోలీసుల కంటే నా మనుషులే ముందుగా పట్టుకుంటారు....ఎందుకో తెలుసా?....నేనే బ్యాంకు దోపిడీ చేయించానన్న విషయం, ఇక్కడి రహస్యాలు....అన్నీ బయటపడతాయి....అందుకే వాడు బ్రతక్కూడదు!....నా చేతులతోనే వాడ్ని 'షూట్' చేస్తాను....వెళ్ళు!.... చూడూ!.... నువ్వు నా గురించి పోలీసులకు చెప్తే-నీ చాప్టర్ క్లోజ్!....జాగ్రత్త!...." అని శ్వేతని వాటేసుకొని ఉపలికి వెళ్ళి తలుపేశాడు చలపతి.

5

అప్పుడే వచ్చి పోలీస్ స్టేషన్ ముందు ఆగిందో జీప్!

ఇన్‌స్పెక్టర్, నలుగురు కానిస్టేబుల్స్-జీప్ దిగారు.... ఆ వెనకే చేతులకు సంకెళ్ళు వేయబడిన చలపతి, అతని ముఠాలోని ముగ్గురు మనుషులు దిగారు.

"కానిస్టేబుల్స్! వీళ్ళని లాకప్‌లో పెట్టండి!...." లోపలకు వచ్చి కుర్చీలో కూర్చుంటూ అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"ప్రతాప్‌ని నేను హత్య చేయలేదు!" అన్నాడు చలపతి.

"ఇందాకట్నుంచీ ఇదే మాట అంటున్నావ్!.... బ్యాంకు దోపిడి చేయించినవాడివి నువ్వేనని ఎవరో ఒకతను ఇందాకే మాకు ఫోను ద్వారా ఇన్‌ఫర్మేషన్ అందించాడు....నీ రహస్యాలు బయటపెడతాడని రాత్రి ప్రతాప్‌ని హత్యచేశావ్!...."

"నేనీ హత్య చేయలేదు!" మళ్ళీ చెప్పాడు చలపతి.

"మరెవరు చేశారు?"

"నేను ఇనస్పెక్టర్!"

అందరూ అటువైపు చూశారు.

ఎర్రని రక్తంతో వున్న ఆరంగుళాల కత్తితో లోపలకు వచ్చాడు అరవై ఆరేళ్ళ వ్యక్తి.

"ఎవరు నువ్వు?" అడిగాడు ఇన్‌స్పెక్టర్.

"స్వాతంత్ర్య సమరయోధుడ్ని."

"అయితే....ఈ హత్య ఎందుకు చేశావ్?"

"నా కన్నా....నా కన్నవాళ్ళ కన్నా నాకు ఈ దేశం అంటే వల్లమాలిన ప్రేమ, అభిమానం, గౌరవం....

అందుకే—మాతృదేశానికి స్వాతంత్ర్యం తీసుకు

రావటం కోసం—ఎందరో మహానుభావులతోపాటు నేను కూడా - ఎన్నోసార్లు జైలుకెళ్ళి లాఠీ దెబ్బలు తిని, సత్యాగ్రహాలు చేసి—కష్టపడి స్వాతంత్ర్యం తీసుకు వచ్చాం!

నా మాతృదేశంలో ఎక్కడ చూసినా హత్యలు, మానభంగాలు, దోపిడీలు....

ఈ వార్తలు పేపరులో చదివినప్పుడు, రేడియోలో విన్నప్పుడు - నా మనసు ఎంతో ఆవేదనతో కుమిలిపోయేది....బాధపడేది....

కానీ—

నా ఇంట్లోనే ఓ దొంగ - దోపిడీదారుడు వున్నాడని నేనిన్నాళ్ళూ గ్రహించలేకపోయాను....ప్రతాప్ నా ఒక్కగానొక్క కొడుకు!....ఇలాంటి వాడివల్ల దేశానికి చాలా నష్టం!....ముందు ముందు దేశానికి తీరని సమస్యగా తయారవుతాడు....నా కొడుకు అలా కావటం నా కిష్టంలేదు....అందుకే—

నిన్నంతా ఈ ఊళ్ళో వాడికోసం ఆచూకీ తీసి - తిరిగి నేను మా ఊరు చేరేసరికి చాలా రాత్రి అయింది....ఊరు మధ్యలో వున్న శివాలయం దగ్గర - మా ఇంటివైపు వెళ్తూ కనిపించాడు....వాడు ఎక్కడ కనిపించినా హత్య చేద్దామనే ఉద్దేశ్యంతో ఇంటి దగ్గర్నుంచి ఈ కత్తితో బయల్దేరాను....శివాలయం దాటాక, వాడి వెనక వైపుగా వెళ్ళి ఈ కత్తితో పొడిచి చంపేశాను....

ఈ చలపతి గురించి ఫోన్లో చెప్పింది కూడా నేనే!" అని ఆగారు నాయుడుగారు.

"కానిస్టేబుల్ అరెస్ట్ హిమ్!" నాయుడుగారిని చూపిస్తూ ఆర్డరు జారీ చేశాడు ఇన్‌స్పెక్టర్. □

మృత్యు స్వప్నం

భోయినపల్లి
పురుషోత్తం

గాలిలో తేలుతున్నట్టనిపిస్తుంది విశ్వపతికి. ఎక్కువగా తాగడంవల్ల అలా వుంది అనుకొన్నాడు. కాళ్ళూ చేతులూ స్వాధీనం తప్పుతున్నాయి. ఒళ్ళంతా కంపిస్తుంది. రోమాలు నిక్కబొడుచుకుంటున్నాయి. ఎంత తాగినా కనీసం సిగరెట్ వెలిగించుకోగలిగినంత

కంట్రోల్‌లో ఉంటాడు విశ్వపతి.

మరేమిటి ఇవాళ ఇలా అవుతుంది. కాళ్ళు తేలిపో తున్నాయి. ఆలోచించంగా మెట్లెక్కుతున్నాడు. ఏదో శక్తి తనను అగాధంలోనికి తోస్తున్న భావన అతడిని పిచ్చివాడి చేస్తుంది.

తనకేదో అవుతుందని గ్రహించాడు విశ్వపతి. లేక పోతే ఎప్పుడూ లేనిది ఏమిటిది!?!

గుండ్రంగా తిరిగినట్టుండే మెట్లు పూర్తిగా ఎక్కేశాడు. పై అంతస్తుకి రాగానే, విశ్వపతి భయం పెరిగి పోయింది. ఎదురుగా చూసి త్రుళ్ళిపడ్డాడు. గదిలో గోడకి గుండ్రంగా ఉన్న పెయింటింగ్ అంటించబడి ఉంది.

గుండ్రంగా చుట్టబడినట్టున్న సన్నటి తెల్లగీతల మధ్య వికృతంగా ఉన్న పుర్రె బొమ్మ అది!?? కేవలం ఆర్టిఫిషియల్‌గా గీయబడిన బొమ్మ అది. మనిషి పుట్టూ మృత్యువు ఎలా వల పన్నిందో చక్కగా గీసాడు ఆర్టిస్ట్.

విశ్వపతి గొంతు ఎండిపోతూంది. పుర్రె పెయింటింగ్ తన మృత్యువునే సూచిస్తుందని అనిపిస్తూం దతడికి——

తూలుతున్నట్టు లోనికి నడిచాడు. అకస్మాత్తుగా కళ్ళు మసకబడి పోయాయతడికి. తల విదిలించి కళ్ళు చికిలించి చూశాడు. మసగ్గా కనబడుతూంది అంతే! ఒళ్ళు తేలికై పోతూంది. ఉచ్ఛ్వాసనిశ్వాసలు విపరీతంగా పెరిగి పోయాయి.

గదిలో గాజు కిటికీ దగ్గర ఒక మసక ఆకారం నిలబడి ఉంది. ఆ ఆకారం సీటిగొట్టం పట్టుకొని పైకి ఎక్కి వచ్చి, కిటికీ గాజుపలక తోసుకొని లోపలకు వచ్చిందని గ్రహించాడు విశ్వపతి.

ఆకారం ఇక ఉపేక్షించలేదు. చేతిలో ఉన్న నల్లటి రివాల్వర్ విశ్వపతికి గురిపెట్టి ట్రిగ్గర్ నొక్కింది. రివాల్వర్ ప్రేలి బుల్లెట్ తనవైపు దూసుకొస్తూంటే, గిలగిల ఊగిపోతూ శక్తి అంతా కూడదీసుకొని అర్చాడు విశ్వపతి.

సత్తువ లేకపోయింది విశ్వపతికి. అతడి శరీరం రక్తంతో తడిసిపోతూంది. బుల్లెట్ విసురుకి వెనగ్గా ఉన్న కుర్చీలో పడిపోయాడతడు. కొన ఊపిరితోనే కంటి రెప్పలు బిగదీసి, ఆకారంవైపే తీక్షణంగా చూడసాగాడు.

క్రమంగా ఆ ఆకారం మసకదనంపోయి, స్పష్టతను సంతరించుకోసాగింది!??

ఉలికిపడి లేచాడు విశ్వపతి.

"ఏమండీ.........ఏమండీ.........మిమ్మల్నే. కళ్ళు తెరవండి...." విశ్వపతిని కుదిపేస్తూంది సావిత్రి.

చటుక్కున కళ్ళు తెర్చి చుట్టూ చూశాడు. గడియారం గడియారం టిక్ టిక్ మనే శబ్దం తప్ప గదంతా నిశ్శబ్దంగా ఉంది. విశాలమైన ఆ గదిలో నిశ్శబ్దం అతడిని హేళన చేస్తుంది.

"ఏమిటండీ? అలా కేకలేసారు. మొన్నటిలాంటి కలే మళ్ళీ వచ్చిందా?" కంగారుగా అడుగుతూంది సావిత్రి.

ఇంకా తేరుకోలేదు విశ్వపతి. సావిత్రి లేచి నీళ్లు తెచ్చి అందించింది. అవి తాగి భారంగా నిట్టూర్చాడు విశ్వపతి. టైమ్ చూశాడు. నాలుగున్నర దాటింది.

"ఏం పాడు కలలో" అని, కించిత్తు బాధగా భర్త పంక చూస్తూ "ఇక పడుకోండి" అంటూ విశ్వపతికి మెడవరకూ దుప్పటి కప్పింది సావిత్రి. ఆమెకు ముఖ్యంగా

ఏళ్ళవరకూ ఉంటాయి. యవ్వనపు ఛాయలు ఆమెలో ఇంకా ప్రవహిస్తూనే ఉంటాయి. అందుకే నలభై నాలుగేళ్ళ విశ్వపతి ఆమెను ఏరికోరి చేసుకున్నాడు. చూసే వాళ్ళకు, ఎన్నో ఏళ్ళనుండి సంసారం చేస్తున్న దంపతుల్లా ముచ్చటగా అగుపిస్తారు వాళ్ళు.

కళ్ళు మూసుకొన్నా నిద్ర రావడంలేదు విశ్వపతికి. మనక ఆకారం ఇంకా చెరిగిపోలేదు అతడి స్మృతి పథంలో.

అకస్మాత్తుగా నాగరాజు గుర్తొచ్చాడతడికి!? పాములాంటి నాగరాజు!? బుసలుకొట్టే నాగరాజు, కటకటాల లోపలినుండి ఊచలు దృఢంగా పట్టుకొని, క్రూరంగా తనవంకే చూస్తున్నట్టు ఫీలయ్యాడు విశ్వపతి.

కాసేపాగి ఏదో గుర్తు తెచ్చుకొన్నాడు చకచకా. ఇంకా సరిగ్గా వారం రోజులుంది నాగరాజు జైలునుండి విడుదల కావడానికి.

తర్వాత మెల్లగా నిద్రలోనికి జారుకున్నాడు.

2

"ఎంత కాలంనుండి వస్తుందా కల?" అడిగాడు వాసుదేవరావు, విశ్వపతి చెప్పింది పూర్తిగా విని.

ఎదురుగా కూర్చున్న విశ్వపతి, భార్య మొహంలోనికి ఒకసారి చూసి తర్వాత డాక్టర్‌తో చెప్పాడు. "సుమారు మూడు వారాలనుండి. గత వారంరోజులుగా దాదాపు ప్రతి రాత్రి వస్తూంది!"

విశాలమైన ఆ గది చిత్రమైన ఫర్నిచర్‌తో నిండిపోయివుంది. రోగిని ట్రీట్ చేసే బెడ్, హీటర్‌లాంటి సామగ్రి సగం గదిని ఆక్రమించింది. వాసుదేవరావు నగరంలో ప్రసిద్ధిచెందిన సైకోథెరపిస్ట్, హిప్నాటిస్ట్. ఖరీదైన

మానసిక వైద్యుడు!

పుస్తకాలు ట్రాక్స్ పెన్స్‌లాంటి వస్తువులతో నిండి పోయిన వెడల్పాటి టేబుల్ అటువైపునుండి, మెత్తటి కుర్చీలో కొద్దిగా కదిలి చెప్పాడు వాసుదేవరావు "కల మానసిక భయానికి సంబంధించింది. మానసిక భయం అందరికీ ఉండొచ్చు. కానీ ఇలాంటి కలలు చాలా అరుదుగా వస్తూంటాయి."

"దీనివల్ల నేను మెంటల్‌గా ఏమయినా అప్‌సెట్ అయ్యే ప్రమాదం ఉందంటారా?" అడిగాడు విశ్వపతి. అలా అడుగుతూనే కల తల్చుకొని భయపడ్డాడతడు.

విశ్వపతి భయం గమనిస్తూ చెప్పాడు వాసుదేవరావు "ఎంత పిరికివాడయినా కేవలం కలకు భయపడి మెంటల్‌గా అప్‌సెట్ అవడం అసాధ్యం! అయితే ఆ కల గురించి మీరు ఎక్కువగా ఆలోచించడం మానేయాలి."

"ఎలా డాక్టర్! ఇప్పటికే ఆ కల తల్చుకుంటుంటే వళ్ళు జలదరిస్తూంది నాకు. ప్రత్యేకించి కల వచ్చేటప్పుడు నా మానసిక పరిస్థితి మరింత బలహీనపడిపోతూంది."

"రాత్రిళ్ళు ఆయన అంతంత కేకలు వేస్తుంటే ప్రక్కనున్న నాకే గుండెలు కొట్టుకుంటున్నాయి" సావిత్రి, వాసుదేవరావు వంక చూస్తూ చెప్పింది.

రెండు క్షణాలు ఆలోచించి "ఆ కల వచ్చేముందు మీకు కలకు సంబంధించిన సంఘటనలు ఏమయినా గుర్తొస్తున్నాయా? కాసేపు ఆలోచించి చెప్పండి" అన్నాడు వాసుదేవరావు.

కాసేపాగి చెప్పాడు విశ్వపతి "లేదు డాక్టర్, అలాంటివేమీ తట్టడం లేదు. నేను నిద్రలోనికి జారగానే అకస్మాత్తుగా వస్తుందా కల."

"ఫోన్! మిమ్మల్ని కాల్చి చంపే హంతకుడి రూపం ఎలా ఉంటుందో చూడలేకపోతున్నారా?"

"అదే చిత్రం! ఎంత ప్రయత్నించినా ఆ ఆకారం మసగ్గానే ఉంటుంది తప్ప క్లియర్‌గా కనిపించడంలేదు. అలా కనిపించేటప్పటికే మెలకువ వచ్చేస్తుంది!!"

మరి కాసేపు మాట్లాడేక చెప్పాడు వాసుదేవరావు "ప్రస్తుతానికి మెడిసిన్స్ ఏమీవద్దు. వీలయినంత వరకూ మనసు ప్రశాంతంగా ఉంచుకోవడానికి ప్రయత్నించండి. ఈసారి కల విపరీతంగా వస్తే మళ్ళీ కలవండి."

భార్యాభర్తలిద్దరూ ఫీజు చెల్లించాక ఇంటికి వచ్చేశారు.

విశాలమైన రెండంతస్తుల భవంతి విశ్వపతిది. తన కున్న రెండు ప్రయివేట్ ఫర్మ్‌ల్లో చాలా సంపాదించా డతడు. ఇద్దరు కూతుళ్ళకు రెండేళ్ళ క్రితమే పెళ్ళిళ్ళుచేసి బాధ్యతలు వదిలించుకొన్నాడు. కొడుకును పైచదువులకు అమెరికా పంపించాడు.

సంవత్సరంన్నర క్రితమే మొదటి భార్య సుభద్ర చనిపోవడంతో, ఆరునెలలు ఒంటరి జీవితం గడిపాడు. తరువాత ఓ బీదకుటుంబంలో సావిత్రిని చూశాడు.

నిజానికి సావిత్రి అనాథ. ఆమెకు ఆ కుటుంబం ఆశ్రయం ఇస్తుందంతే! సావిత్రిలో పూర్తిగా గృహిణి లక్షణాలు ఉండడంతో, ఆమె అంగీకారంతో పెళ్ళి చేసు కొన్నాడామెను. పెళ్ళయిన తర్వాత సావిత్రికి పిల్లలు పుట్ట లేదు.

"సార్ ఫోన్ బాంబే పార్టీవాళ్ళట" వైర్‌లెస్ ఫోన్ పట్టుకొచ్చాడు ఎకౌంటెంట్. ఇంట్లో ఉన్నప్పుడే ఆ ఫోన్‌ని ఉపయోగిస్తాడు విశ్వపతి. అతడు ఫోన్ అందుకోగానే వెళ్ళి

పోయాడు ఎకౌంటెంట్.

"హలో విశ్వపతి, హియర్" అన్నాడు విశ్వపతి.

"నమస్తే సాబ్! నేను! బోలారామ్‌ని మాట్లాడు తున్నాను" కరుగ్గా వినిపించింది అవతలనుండి.

విశ్వపతి కనుబొమ్మలు ముడిపడ్డాయి. "ఏమిటి?" అన్నాడు క్లుప్తంగా.

"బాంబుపార్టీ అని ఎందుకు చెప్పానో ఆశ్చర్యపోతు న్నారా విశ్వం సాబ్!" కొద్దిగ నవ్వుతున్నాడు బోలా రామ్.

"ఇలాంటివి నాకు మామూలే" తొణక్కుండా చెప్పాడు విశ్వపతి.

"క్షమించండి సాబ్, మొన్న మీ లారీ - అది అలా జరిగిపోయింది. ఒట్టేసి చెబుతున్నాసాబ్ ఈసారి అలా కానివ్వను. మణిపురి కాంట్రాక్టు నా కిప్పించండి"

విశ్వపతి ముఖం ఎర్రబారింది "ఎక్కడ నుండి మాట్లాడుతున్నావిప్పుడు?"

"ఎందుకు సాబ్!"

"ముందు చెప్పు."

"క్షమించండి సాబ్. చెప్పను. కాంట్రాక్టు ఇప్పిస్తా నంటే చెప్తా"

చిరాగ్గా ఆఫ్ బటన్ నొక్కేశాడు విశ్వపతి. మరో మూడు నెంబర్లు నొక్కాడు "హలో పోలీస్ స్టేషన్" అని, తనను పరిచయం చేసుకొన్నాడు.

"చెప్పండి" అన్నాడు ఇన్‌స్పెక్టర్ అవతలి నుండి.

"బోలారామ్ నన్ను వేధిస్తున్నాడు, మళ్ళీ లారీ కాంట్రాక్టు ఇవ్వమంటున్నాడు"

అవతలనుండి కాసేపు నిశ్శబ్దం "మీరేమన్నారు?"

"ఏమిటి ఇన్‌స్పెక్టర్! అలా అడుగుతారు. అలాంటి వాడికి మళ్ళీ కాంట్రాక్టు ఇస్తానా? కొంపితో తల గోరుక్కోవడమే వాడితో వ్యవహారం."

"చూడండి విశ్వపతిగారు. అలాంటి వాళ్ళతో అప్రమత్తతగా ఉండాలి. చట్ట వ్యతిరేకమైన పనులు చేయడమే వాళ్ళకానందం. అలాంటి వాడి ఉచ్చులో ఇరుక్కున్నారంటే. మీకు చాలా ప్రమాదం".

"అందుకే ఇదా మీకు ఫోన్ చేసింది. నన్నిలా మాటి మాటికి వేధిస్తూ ఉంటాడేమో, వాడిని కస్టడీలోనికి తీసుకోవడానికి వీలుపడదా?"

"గతంలో మీ లారీలో మత్తుపదార్థాలు దొంగ రవాణా చేస్తున్నందుకు, కోర్టు వాడికి ఎనిమిదినెలల జైలుశిక్ష విధించింది. శిక్ష అనుభవించేశాడు. కాబట్టి వాడు మళ్ళీ నేరం చేస్తేగాని వాడిని కస్టడీలోనికి తీసుకోవడానికి వీలు పడదు"

"అలా అయితే వాడి సతాయింపులతో నేనిలా వేగవలసిందేనా?" నిరాశగా అడిగాడు విశ్వపతి.

"తప్పదు. ఎప్పుడయినా వాడి వ్యవహారం మోతాదు మించితే మాకు చెప్పండి అప్పుడు న్యూసెన్స్ కేస్ క్రింద అరెస్టు చేయడానికి వీలుంటుంది."

ఆఫ్ బటన్ నొక్కి "డామిట్" అన్నాడు విశ్వపతి అసహనంతో.

మళ్ళీ రింగయింది ఫోను. "యస్" అన్నాడు విశ్వపతి.

"విశ్వం సాబ్! పోలీసోళ్ళకి ఫోన్ చేసినట్టున్నారు. ఈ పోలీసోళ్ళకి చెప్పటం తప్ప కష్టండవు సాబ్. నా మాట వినండిసాబ్, ఈ రోజుల్లో యాపారస్తులంతా సీక్రెట్‌గా చేసేదే ఇది. అంతా రాంగ్ రూట్‌లో బోయేటప్పుడు, మనం

రైట్ నే బోవాలనుకొంటే ఎలా? ఎవడినో గుద్దేస్తాం. లాకీ నాకిప్పించండి సాబ్, అంతకీ మీకు కావాలంటే వాటా తీసుకోండి" డైరెక్టుగా వేరండి నికి దిగిపోయాడు బోలో రామ్.

ఉద్రేకాన్ని అణుచుకొని మెల్లగా చెప్పాడు విశ్వపతి "బోలారామ్! నీకు ఆఖరిసారి చెబుతున్నాను. నా లారీ దొంగ రవాణానికి ఉపయోగించే ప్రసక్తేలేదు" అని ఆఫ్ బటన్ తో పాటు మరో బటన్ కూడా నొక్కేసాడు. ఇక మళ్ళీ రింగవదు ఫోన్.

3

"టెలిపతి. క్లెయర్ వాయన్స్ వీటి గురించి ఎప్పుడయినా విన్నారా?" కుర్చీలో నుండి లేస్తూ అడిగాడు వాసుదేవరావు

"విన్నాను!" స్పష్టంగా చెప్పాడు విశ్వపతి. ఈసారి అతను ఒక్కడే వచ్చాడు భార్యను తీసుకురాకుండా. ఆ రాత్రి కూడా అతడికి మృత్యుకల వచ్చింది.

"ప్రతి మనిషికి నూ కొంతశాతం మానసిక బలం వుంటుంది. అది కొంత మందిలో ఎక్కువవాళ్ళలో ఉంటుంది. అది స్వతహాగానయినా రావచ్చు లేదా యోగా ధ్యానం లాంటి వాటివల్ల నయినా రావచ్చు. ఈ ఎక్కువ శాతం మానసికబలం కలవాళ్ళు. ఎవరికీ అంతుపట్టని విషయాలను సూక్ష్మ పరిజ్ఞానంతో ఇట్టే పసికట్టగలరు. లోతుగా ఆలోచించుకొంటూ పోతే ఆలాంటి శక్తే టెలిపతి క్లెయర్ వాయన్స్ లకు దారి తీస్తుంది.

....క్లెయర్ వాయన్స్ కలవాళ్ళు ఎలాంటి యంత్ర సహాయం లేకుండా ఇద్దరు వ్యక్తులు ఒకరితో మరొకరు యదేచ్ఛగా సంభాషించుకోవచ్చు మనస్సుతో. ఇది చాలా తక్కువగా ఉంటుంది....

....ఇక టెలిపతీ విషయానికొస్తే ఇది చాలా విచిత్ర మైన అంశం. భవిష్యత్తులో జరిగే సంఘటన అంటే అది కొన్ని సంవత్సరాల తరువాత అయినా కావచ్చు లేదా కొన్ని గంటల తర్వాత అయినా కావచ్చు. ఆయా సంఘట నలు రాత్రిళ్ళుగాని, సాయంత్రం సమయంలో గానీ టెలిపతి శక్తివున్న స్మృతిపథంలో అస్పష్టంగా, ఊహా మాత్రంగా గోచరిస్తూ ఉంటాయి.'' వివరంగా చెప్పాడు వాసుదేవ రావు.

"అంటే నాకు టెలిపతి అనే శక్తి ఉందా?!" విభ్రాంతిగా అడిగాడు విశ్వపతి.

"అవును! టెలిపతి ఉందని మీరేదో అతీంద్రియ శక్తులున్నట్టు ఊహించుకోకండి. ఇది చాలా సర్వ సాధా రణం. ప్రతి పదిమందిలోనూ ఇద్దరి ముగ్గురికి టెలిపతి ఉంటుంది. కానీ తొంభైతొమ్మిది శాతం వరకూ ఇది గోప్యంగా ఉంటుంది. ఎక్కడో ఎవరికో స్పష్టంగా తెలుస్తుంది. అయినా అది వాళ్ళకి టెలిపతి అని అర్థంకాక పోవచ్చు—"

ప్రక్కనే ఉన్న పుస్తకాల రాక్‌లోనుండి, ఒక బౌండ్ పుస్తకం, ఒక ఫైలు తీసి చూపించాడు వాసుదేవరావు. ఫైల్‌లో ఓ పేపర్ కటింగ్‌లో ఓ వ్యక్తి ఫోటో.

"కెనడాలో 1956 లో 'లాయిస్‌కార్' అనే ఈ మిలటరీ ఆఫీసరుకి సరిగ్గా సంవత్సరం తర్వాత తాను యుద్ధంలో చనిపోయినట్టు కలవచ్చేదట. అలా ఏడాది పాటు ఆ కలను భరించాడతను. సరిగ్గా సంవత్సరం పూర్తయిన తర్వాత ఈ ఆఫీసరు సరిహద్దు యుద్ధంలో మరణించాడు. ఇతడికి టెలిపతి ఉన్నట్టు ఇతడు సంప్రతించిన డాక్టర్లు, మానసిక నిపుణులు ముందే నిర్ధారించారు....

...ఇలాంటి సంఘటనలు విదేశాలలో కోకొల్లలు. అన్నిటికంటే చిత్రమైన విషయం ఏమిటంటే—ఇలాంటి శక్తులు కలవాళ్ళు విదేశాల్లో కంటే, మన దేశంలోనే ఎక్కువగా ఉన్నారు. కానీ, విదేశాలలో లాగ వాళ్ళు వార్తల్లోనికి ఎక్కరు. బాబాలుగాను, గ్రామదేవతలుగానూ, మంత్రగాళ్ళుగానూ మిగిలిపోతారు.'' చెప్పాడు వాసుదేవ రావు.

''అంటే—ఈ మిలటరీ ఆఫీసరుకి నాలాంటి కలే వచ్చేదంటారా?!''

చిన్నగా నవ్వి చెప్పాడు వాసుదేవరావు ''వీటి గురించి భయపడడం అంత హాస్యాస్పదం మరోటి లేదు. మనం గుర్తుంచుకోవలసింది ఒక్కటే. ఇవి నిజంగా జరగడానికి ఎంత ఆస్కారం ఉందో, జరగకపోవడానికి కూడా అంతే ఆస్కారం ఉంది. వీటి గురించి భయపడి మానసికవత్తిడి మరింత పెంచుకొంటే అది మరో ప్రమాదానికి దారి తీయడం అవుతుంది''

నిట్టూర్చాడు విశ్వపతి ''మరి రాత్రి కల!?''

''ఇందాక మీరు చెప్పినదానిని బట్టి ఆలోచిస్తే, మీ కొచ్చే కలను గురించి మీరు అంతర్గతంగా ఎంతో భయ పడుతున్నారు. దానికి తోడు మేడమీద గదికి సంబంధించే ఆ కలరావడం వలన, అద్దెకు దిగిన వాళ్ళపైకి మీ కల మళ్ళింది. మరోలా చెప్పాలంటే మీ మెదడు ఆలోచించిన రీతిలోనే మీ కల సాగింది. అందువల్ల ఇలాంటి మానసిక సంబంధమైన విషయాలలో సాధ్యమైనంత వరకూ నిర్లిప్తంగా ఉండడానికి ప్రయత్నించాలి.''

''ఆ కల ఎంత భయానకంగా ఉంటుందో మీకు తెలి యదు. అది వచ్చేముందు నా శరీరం స్వాధీనం తప్పు

తోంది."

"దీనిని బట్టి తెలుస్తూంది. మీరు ఆ కల గురించి ఎక్కువగా ఆలోచించి మీ భయాన్ని మరింత పెంచు కొంటున్నారు. ఆ భయమే కల మళ్ళీ రెండోసారి రావడానికి చాలా వరకూ దోహదం చేస్తుంది."

"నన్ను హిప్నటైజ్ చేసి, ఆ కలను మళ్ళీ రాకుండా చేయవచ్చు కదా!?" అడిగాడు విశ్వపతి.

"ఆ కల ప్రభావం మీపై ఎంతవరకూ ఉందో పూర్తిగా తెలియనంత వరకూ, నేను హిప్నాటిక్ ట్రీట్‌మెంట్ చేయదల్చుకోలేదు. మీరన్నట్టు హిప్నాటిజం ద్వారా మిమ్మల్ని ఆ కల గురించి పూర్తిగా మర్చిపొమ్మని సజెషన్ ఇవ్వవచ్చు. కానీ, ఆ కల ఇప్పటికే మీలో లోతుగా నాటుకొని పోవడం జరిగితే, ఐ మీన్ 'లాయిస్ కాక్' లాగ మీ విషయంలో కూడా కల నిజమయ్యే ప్రసక్తి ఉంటే - ఆ కల, నేనిచ్చిన సజెషన్, రెండూ కలసి ఏంటీ అయి మీరు తీవ్రమైన మానసిక వత్తిడికి గురయ్యే ప్రమాదం ఉంది."

వెన్ను జలదరించింది విశ్వపతికి. కల తనలో బలంగా నాటుకొంది అనే మాటతో. కాసేపు మౌనంగా ఉండిపోయాడు.

"ఈ రోజు నుండి మీరు ప్రతి సాయంత్రం ఒక ఇంజెక్షన్ తీసుకోవాలి నా దగ్గిర. అలాగే రాత్రి నిద్రపోయే ముందు నేనిచ్చిన మాత్ర వేసుకోవాలి. వీటి ప్రభావంతో ప్రశాంతంగా నిద్రపడుతుంది మీకు. ఒకవేళ కలరావడం గనుక సంభవిస్తే అది సాఫీగా ఉంటుంది తప్ప, సంక్షోభంగా ఉండదు" చెప్పాడు వాసుదేవరావు.

"థాంక్స్ డాక్టర్! నేను సాయంత్రం వస్తాను" అంటూ

లేచాడు విశ్వపతి.

"ఇట్స్ గుడ్"

4

"సార్! మీ కోసం ఎవరో వచ్చారు. లోనికి పంప మంటారా?" సెక్రటరీ ఇంటర్‌కమ్‌లో అడుగుతూంది.

"రమ్మను" అనాలోచితంగా అని, సొరుగు తెర్చి ఏదో కాగితం తీసి మరో కాగితంతో దానిని టాలీచేస్తూ చూసుకో సాగాడు విశ్వపతి. అతి ఖరీదైన ఫర్నిచర్‌తో చల్లటి ఏసీ గాలితో విశాలంగా ఉందా గది. విశ్వపతి ఆఫీస్‌రూమ్ అది.

డోర్ తెర్చుకొని ఒక యువకుడు నిశ్శబ్దంగా వచ్చి విశ్వపతి ఎదురుగా ఉన్న కుర్చీలలో ఒక దానిలో హుందాగా కూర్చున్నాడు.

విశ్వపతి కాసేపటికి తలెత్తి. కొద్దిగా కొత్తగా చూశాడా యువకుడిని. అతడి ఆఫీస్‌రూమ్‌కి బిజినెస్ గురించి మాట్లాడడానికే వస్తారు కొందరు. ఎదురుగావున్న యువ కుడిని ఎప్పుడూ చూసినట్టు గుర్తు లేకపోవడంతో "ఎవరు మీరు?" అడిగాడు.

ఆ యువకుడు జేబులోనుండి ఏదో కార్డ్‌లాంటిది తీసి మడత విప్పి చూపించాడు. అందులో అతడి ఫోటో ఏవో సంతకాలు, ముద్రలు ఉన్నాయి "ఐయామ్ ఎన్ ఇంటెలి జెన్స్ ఆఫీసర్" చెప్పాడు.

చేతిలో కాగితాలు క్రిందపెట్టేసి సర్దుకొని కూర్చు న్నాడు విశ్వపతి. "ఏం కావాలి మీకు?" అతడికి తెలియ కుండానే కొద్దిగా నుదురు చిట్లించి అడిగాడు.

"దుర్గాపురం కేసు గురించి మీతో మాట్లాడడానికి వచ్చాను"

సరిగ్గా రెండు క్షణాలు ఊపిరి అందనట్టు బిగుసుకొని

పోయాడు విశ్వపతి. చేదు తిన్నట్టయిపోయింది అతడి మొహం. కుర్చీలో బాగా వెనక్కి వాలి కళ్ళు మూసుకొన్నాడు. తర్వాత ముందుకి వంగి "మీరు నన్ను ఇలా వేధిస్తూనే ఉంటారా!" అన్నాడు ముఖంలో భావాలు మారుస్తూ.

"క్షమించండి, దుర్గాపురం హత్యల కేసు కోర్టు తాత్కాలికంగా కొట్టివేసింది. ఎందుకంటే హంతకుడు లేదా హంతకులు స్పష్టంగా చట్టానికి తెలీదు. ముద్దాయిలుగా చట్టానికి దొరికిన నలుగురిలో మీరూ ఒకరు. తగిన సాక్ష్యాధారాలు లేకపోవడంతో పోలీసులు ఆ ఫైలు మూసివేసారు.

ప్రస్తుతం కొత్తగా వచ్చిన డి.యస్.పి. దుర్గాపురం ఫైలు దుమ్ముదులిపి కేసు రీఓపెన్ చేయడంతో మా ఇంటలిజన్స్ చీఫ్ ప్రత్యేకించి మీ కోసం నన్ను నియమించారు. మామూలుగా అయితే పరిశోధన రహస్యంగా కొనసాగిస్తాం మేము. కానీ మీరు ఒకసారి కోర్టులో నిందితుడిగా నిర్ధారించబడ్డారు కాబట్టి ప్రత్యక్షంగానే మీపై నా పరిశోధన కొనసాగించవచ్చునని మా చీఫ్ ఆర్డర్!"

విశ్వపతి కళ్ళు తిరుగుతున్నట్టనిపించింది. "నన్నేం చెయ్యమంటారు" అన్నాడు నీరసంగా.

"మీరేం చెయ్యనవసరం లేదు. నేను పెద్దగా మిమ్మల్ని నా ప్రశ్నలతో వేధించను కూడా. ఆ రోజు జరిగిన హత్యలు ఎన్నో మీకు తెలుసా?"

కాసేపాగి చెప్పాడు విశ్వపతి, "అప్పుడు పోలీసులు ప్రశ్నించిన దాని ప్రకారం, రెండు హత్యలు జరిగాయని గ్రహించాను."

సూటిగా విశ్వపతి వంక చూసాడా యువకుడు "అప్పుడు కూడా మీకు ఇలాగే రెండు ఫర్మ్‌లు ఉన్నాయా, ఐ మీన్

ఇంతే ఆస్తి ఉందా?"

"లేదు"

"అప్పుడు మీరు ఇంత ధనవంతులు కారు. అవునా?"

"....అవును," క్లుప్తంగా చెప్పాడు విశ్వపతి.

"అప్పుడు ఏం చేసేవారు మీరు?"

"ఒక సినిమా థియేటర్‌కి మేనేజర్‌గా పనిచేసేవాడిని."

"ఇక్కడేనా?"

"కాదు!"

"మరి?"

"దుర్గాపురంలో."

ఈసారి ఆ యువకుడి కళ్ళు మెరిశాయి.

"చాలా వింతగా ఉందే. మీరు పనిచేసిన దుర్గాపురంలోనే హత్యలు జరిగాయన్న మాట"

ఆ మాటకు పెద్దగా చలించలేదు విశ్వపతి. "అందుకే పోలీసులు నన్ను అనుమానితుడిగా భావించారు" అని, "ప్లీజ్ నాకు చాలా పనులున్నాయి" అన్నాడు కొద్ది విసుగును ప్రదర్శిస్తూ.

"ఆల్‌రైట్. మళ్ళీ కలుస్తాను" అంటూ విశ్వపతి వంకే చూస్తూ లేచి వెళ్ళిపోయాడా యువకుడు.

యువకుడు నిష్క్రమించిన తర్వాత, విశ్వపతి ముందుకి వంగి నుదురు వేళ్ళతో పట్టుకొని మోచేయి టేబుల్‌పై ఆన్చి చాలాసేపు ఏదో ఆలోచిస్తూ ఉండిపోయాడు.

ప్యూను లోపలికి వచ్చాడు, అతడి చేతిలో ఉత్తరాల కట్ట. టేబుల్ మీద పెట్టి వెళ్ళిపోయాడు వాటిని.

విశ్వపతి లెటర్స్ నన్నింటిని పరిశీలించాడు. నల్ల కవరు ఒకటి అతడిని ఆకర్షించింది.

కవరు చించాడు. లోపల ఏదో కాగితానికి రెండు ఫోటోలు పిట్టబడి వున్నాయి. అతడికి ఏమీ అర్థంకాలేదు. కాగితం విప్పి ఫోటోలు పరీక్షగా చూశాడు.

ముందు రెండు మూడు క్షణాలవరకూ ఏమీ అర్థం కాలేదతడికి!? ఆరేళ్ళనాటి జ్ఞాపకాలు మెదడును తొలుచు కుంటూ చకచకా అతడి జ్ఞాపకశక్తిని తట్టి లేపుతున్నాయి.

ఏసీలో కూడా చమట్లు కారిపోతూండగా, కుర్చీలో నిస్సత్తువగా వాలిపోయాడు విశ్వపతి. అతడి శరీరమంతా కంపిస్తూంది.

ఆరేళ్ళ క్రితం తను చేసిన పాపానికి మరే సాక్ష్యమూ లేదనుకున్నాడు!??

కానీ ఇప్పుడు రెండు కలర్ ఫోటోలు తన పాపానికి అద్దం పట్టాయి.

చకచకా కాగితం మడత విప్పి చదివాడు—

"నమస్తే విశ్వం సాబ్,

సాబ్ మీకో చిన్న కథలాంటిది చెబుతాను. సుమారు ఆరేళ్ళ క్రితం, దుర్గాపురం అనే చిన్న గ్రామంలో మా బంధువుల ఇంటికి ఓ రెండు రోజులు చుట్టం చూపుగా వచ్చాను. బొంబాయిలో ఉండేటప్పుడు, పాకెట్ కెమెరా జేబులో వేసుకొని తిరగడం అలవాటు నాకు. అందుకే బొంబాయి నుండి వచ్చేటప్పుడు పాకెట్ కెమెరా వెంట తెచ్చు కున్నాను....

ఆ రోజు రాత్రి ఏమీ తోచక దుర్గాపురం ఊరి చివర ఉన్న విష్ణు థియేటర్‌కి సెకండ్ షోకి వచ్చాను. సినిమా అయిపోయిన తర్వాత ఊరి వాళ్ళందరితోపాటు నేనూ వచ్చేస్తున్నాను. అంతా

వెళ్ళిపోయారు ముందు. నేనొక్కడినే వస్తున్నాను వెనుకగా. నాముందు పొడుగ్గా లావుగా ఉన్న వ్యక్తి దొంగ చూపులు చూస్తూ కంగారుపడుతూ వడివడిగా నడుస్తున్నాడు. (అది తమరే!) నేను చిత్రంగా అతడినే చూస్తూ వెంట నడిచాను....

ఒకచోట ఊరికి కాస్త ఎడంగా ఓ పెంకు టిల్లుంది. అప్పటివరకూ జనం వెనకాల నడిచిన ఇద్దరు దంపతులు ఆ ఇంటిలోనికి వెళ్ళిపోయారు. నాముందు వ్యక్తి కంగారుగా అటూ ఇటూ చూడడం గమనించి ఓ చెట్టు ప్రక్కన నక్కాను నేను. ఆ వ్యక్తి చటుక్కున పెంకుటింటిలోనికి దూరాడు.

నన్ను ఆశ్చర్యం. అనుమానం కలగాపులగంగా మిన్నుముట్టాయి. వెంటనే చురగ్గా కదిలి పెంకు టింటి కిటికీలో నుండి లోపలికి చూశాను.

నేనూ చాలాకాలం చిన్న చిన్న వీధి దొంగ తనాలు. జేబు దొంగతనాలు చేసే దొంగనే కానీ, నాకే ఒళ్ళు జలదరించింది లోపలి దృశ్యం!?

పొడుగాటి వ్యక్తి దంపతులిద్దరినీ కత్తితో పొడిచి చంపుతున్నాడు. బహుశా ఆ స్త్రీ వంటి మీద నిండుగా ఉన్న నగలను ఆశించి ఉంటాడు ఆ వ్యక్తి.

నాకు సమయానికి కెమెరా గుర్తొచ్చింది. గబగబా కెమెరాతీసి రెండు స్నాప్స్ నొక్కాను. చక్కగా ఫ్లాష్ మెరవడంవల్ల ఆ వ్యక్తి అది గుర్తించలేకపోయాడు. తర్వాత దడదడలాడే గుండెతో నా దారిన నేను వచ్చేశాను. తీసిన

ఫోటోలు ఎప్పటికయినా ఉపయోగపడతాయని పెంచింది.

బొంబాయి తిరిగి వెళ్ళిన నాలుగు రోజులకు నా స్నేహితుడు ఆహ్వానించడంతో దుబాయ్ వెళ్ళిపోయాను. ఫోటోల వ్యవహారం తాత్కాలికంగా మర్చిపోయానప్పటికి.

అదీ విశ్వం సాబ్ జరిగిన కథ! ఇప్పుడు రెండేరెండు మాటలు చెప్పండి!!

1. మీ బిజినెస్‌లో లారీల వ్యవహారం నాకు అప్పజెప్పేస్తే, చక్కగా వాటితో నేను నా బిజినెస్ చేసుకొంటాను.

2. పైది మీకు నచ్చకపోతే, ఓ 5 లక్షలు నా ముఖాన పారేస్తే నా దారిన నేను పోతాను. మళ్ళీ మీకు కనబడను సుమా!

చివరిగా ఒక్క మాట సాబ్. రేపు మంచి రోజు. రాత్రి పదిన్నరకి మీ ఇంటికి వస్తాను. మీరు ఒకటి ఖాయం చేశారో, రెండు ఖాయం చేశారో చెబుమరుగాని, ఫోటో నెగిటివ్‌లు కూడా వెంట తీసుకొస్తాను.

ఉంటాను సాబ్,

బోలారామ్."

గొంతెండి పోయింది విశ్వపతికి. ఉత్తరం ఆసాంతం చదివేసరికి. ఇలాంటి పరిస్థితి ఎదురౌతుందని కలలో కూడా ఊహించలేదతడు.

ఒక్కసారి తల విదిలించాడు. ఉత్తరం మళ్ళీ పూర్తిగా చదివాడు. ఫోటోలు కూడా పరిశీలించాడు.

అతడి ముఖం స్పష్టంగా కనబడుతూంది అందులో.

చేతిలో రక్తంతో తడిసిన కత్తి. క్రిందకు వాలిపోతున్న దంపతులు. ఆ ఫోటోలు కోర్టులో గనుక హాజరు పర్చ బడితే తనకు ఉరిశిక్షే!

మెల్లగా ఆలోచనల్లో పడ్డాడు—బోలారామ్ కోరినట్టు తన లారీలలో స్మగ్లింగ్ వ్యవహారాలు కొనసాగిస్తే!

వద్దు!! దంపతుల్ని హత్యచేసి సంపాదించిన నగలు మినహా ఇప్పటివరకూ సంపాదించిన ఆస్తంతా. వ్యాపారంలో న్యాయంగా సంపాదించిందే. ఒకసారి బోలారామ్ గాడికి లారి కాంట్రాక్టు ఇచ్చినందుకే అనవసరంగా తను పోలీసుల దృష్టిలో పడ్డాడు.

ఆలోచిస్తూంటే ఇప్పుడర్థమవుతుంది. తనను బ్లాక్ మెయిల్ చేసే ఉద్దేశ్యంతోనే బోలారామ్ తనను లారీ అడిగాడు. స్మగ్లింగ్ తను కాదంటే ఫోటోలు చూపించి తనను బెదిరించవచ్చనుకున్నాడు.

రేపు రాత్రే బోలారామ్ విశ్వపతి ఇంటికి వచ్చేది. నాగరాజు జైలునుండి విడుదల అయ్యేది ఆ రోజే!!

5

రాత్రి పదయింది.

భవంతి క్రింది భాగం హాలులో పెద్ద కుర్రకుర్చీలో కూర్చుని ఉన్నాడు విశ్వపతి. ఎదురుగా రెండు అరలున్న చిన్న గాజు టీపాయ్ ఉంది. నౌకర్లను ఆ రోజు రావద్దని క్రితం రాత్రే చెప్పేశాడు విశ్వపతి.

"ఇంజెక్షన్ చేయించుకున్నారా?" అడిగింది సావిత్రి భర్త దగ్గరికి వచ్చి.

"ఊఁ"

"వచ్చి టేబ్లెట్ వేసుకొని పడుకోండి. నిద్ర లేకపోతే రేపు జ్వరం వచ్చినా రావచ్చు" విశ్వపతి నుదురు వెచ్చగా

ఉండడం చేతితో స్పృశించి చూస్తూ చెప్పింది.

"సావిత్రీ నువ్వు వెళ్ళి పడుకో" విసుగ్గా చెప్పాడు.

ఆ సమయంలో భార్య ఇంకా నిద్ర పోకపోవడమే కాక, తన యోగక్షేమాలు విచారించడం నచ్చలేదతడికి.

"ఎంతసేపు కూర్చుంటారిక్కడ?"

"ఒక స్నేహితుడు రావాలి."

"అర్ధరాత్రి స్నేహితుడు ఎందుకండీ-తాగడానికేగా?"

"సావిత్రీ అవన్నీ నీకెందుకు. వెళ్ళి పడుకో" భార్య వంక చూస్తూ చెప్పాడు విశ్వపతి.

భారంగా నిట్టూర్చి వెళ్ళిపోయింది సావిత్రి.

కాసేపటికి, నిశ్శబ్దాన్ని చీలుస్తూ వినిపించిందొక స్వరం "నమస్తే విశ్వం సాబ్"

కంగారుపడకుండా నిదానంగా చూశాడు విశ్వపతి. బోలారామ్ లోపలికి వస్తున్నాడు చేతిలో సూట్ కేస్‌తో.... మాసిపోయిన దుస్తులు, దుబ్బు తల, నిర్లక్ష్యంగా ఉండే కనుముక్కు తీరు; చూడగానే పెద్ద గుణం కలవాడు, అని అందరూ గ్రహించగలిగేలా ఉంటాడు బోలారామ్.

"కూర్చో బోలారామ్."

"సాబ్‌కి నామీద దయ" నవ్వుతూ కూర్చున్నాడు బోలారామ్, విశ్వపతికి ఎదురుగా.

"కాదు. నువ్వే నామీద దయచూపాలి!"

తెల్లబోయాడు బోలారామ్. "ఎమిటి సాబ్ మీరనేది?"

చిన్నగా నవ్వి చెప్పాడు విశ్వపతి. "నీలా బ్లాక్ మెయిల్ చేసే వాళ్ళ ప్రవర్తన గురించి వేరే చెప్పా ల్సింది ఏం ఉంది! నెగిటివ్‌లు ఇచ్చేసి డబ్బు తీసేసు కుంటావు. ఓ రెండు నెలలు పోయాక ఫోటో కాపీలు నీ దగ్గర మరో నాలుగు ఉన్నాయంటూ, రెండు నాకు

పంపిస్తాప్ - అందుకే అలా మోసం చెయ్యకుండా ఐదు లక్షలతోనే నన్ను వదిలిపెట్టమంటున్నాను."

చురుక్కుమని చూశాడు బోలారామ్ "సాబ్, ఇలా అంటున్నానని ఏం అనుకోకండి. మీరు చెప్పినలాంటి బుద్ధి మీలాంటి డబ్బున్న వాళ్ళకే ఉంటుంది. చేసేది దొంగపని అయినా నిజాయితీగా చేస్తాం మేము."

బోలారామ్ కళ్ళల్లోనికి రెండు క్షణాలు చూశాడు విశ్వపతి. తర్వాత తేలిగ్గా నిట్టూర్చాడు, బోలారామ్ కళ్ళల్లో నమ్మకాన్ని గుర్తించి.

"అయితే సాబ్ డబ్బివ్వడానికే నిశ్చయించుకున్నారా?" అడిగాడు బోలారామ్.

"అవును" అన్నాడు విశ్వపతి.

"నేనూ ఖచ్చితంగా అదే ఊహించాను సాబ్! అందుకే ఎల్లుండే దుబాయ్ వెళ్ళిపోయే ఏర్పాట్లు చేసుకొన్నాను. మిమ్మల్ని మీ ఫోటోల్ని పూర్తిగా మర్చిపోతానింక. త్వరగా డబ్బిచ్చేయండి సాబ్!" అంటూ సూట్‌కేస్ ఓపెన్‌చేసి, నెగిటివ్ రీలు విశ్వపతికి చూపాడు బోలారామ్.

విశ్వపతి ఏం మాట్లాడకుండా కుర్చీ నుండి వంగి టీపాయ్ క్రింద అరలోనుండి, రెండు బాటిల్స్ రెండు గ్లాసులు తీసి టీపాయ్‌మీద ఉంచాడు. బోలారామ్ ఇబ్బందిగా చెప్పాడు "వద్దు సాబ్ ఇప్పుడిలాంటివేమీ వద్దు!"

"ఎల్లుండే దుబాయ్ వెళ్ళిపోతానంటున్నావు! అందుకే మన ఈ ఆఖరి కలయిక ఎలాంటి కక్షలు లేకుండా, ప్రశాంతంగా ఆనందంగా ఉండేందుకు ఇది తప్పనిసరి" చెప్పాడు విశ్వపతి, ఐస్‌పెట్టె కూడా సర్దుతూ.

బోలారామ్ ముఖంలో ఇంకా ఇబ్బంది తొలగిపోలేదు.

బాటిల్ ఓపెన్‌చేసి ద్రవం రెండుగ్లాసుల్లో నింపాడు. లావాటి మందం గల ఆ గ్లాసుల్లో ద్రవం అస్పష్టంగా కనబడుతూంది—బోలారామ్ వైపు ఉన్న గ్లాసులో - పలి నుంచి చూస్తేగా - కనిపించనటువంటి, చిన్న టాబ్లెట్ అప్పటికే ద్రవంలో కలసిపోయింది.

చెరోగ్లాసు అందుకొన్నారు. విశ్వపతి అంతా ఒకేసారి తాగేశాడు. బోలారామ్ నెమ్మదిగా గుటకలు మింగుతున్నాడు.

"బోలారామ్, డబ్బంటే నాకు ప్రాణం! ప్రాణమైనా ఇస్తాను గాని, నా చేతులతో నేను డబ్బివ్వలేను" తన గ్లాసులో మరికొంత పంపుకొంటూ చెప్పాడు విశ్వపతి.

తన గ్లాసులోది తాగడం పూర్తిచేసి తెల్లబోయి చూశాడు బోలారామ్. "అయితే సాబ్ నాకు డబ్బివ్వరా?!"

"ఇవ్వలేనన్నానుగాని, ఇవ్వనన్నానా? ఇదిగో తాళాలు ఇదిగో ఇనప్పెట్టి. ఐదులక్షలు తీసుకో"

అర్థంకానట్టు చూశాడు బోలారామ్. తాగిన ద్రవం అతడిపై పని చేస్తూంది. కళ్ళు మత్తుగా ఉన్నాయి.

"నా పరిస్థితి చెప్పానుగా. తీసుకో...." తాళాలు బోలారామ్‌కి అందించాడు విశ్వపతి. మాట్లాడుతూనే సిప్ చేస్తున్నాడతడు. బోలారామ్ తాళాలు అందుకొన్నాడు.

అతడి ముఖంలోనికి చూస్తూ చెప్పాడు విశ్వపతి, "ఇనప్పెట్టెలో డబ్బు చూసి నీ కళ్ళు చెదురుతాయనేగా నీ భయం. అలాంటి ప్రాబ్లమ్ లేకుండా ఇనప్పెట్టెలో ఐదులక్షలు మాత్రమే ఉంచాను—వెళ్ళు."

బోలారామ్ సూట్‌కేస్ మూసి పట్టుకొని పైకిలేచాడు. విశ్వపతి చూపినవైపు కదిలాడు. వాళ్ళు కూర్చున్న హాలు

దాటితే, వాళ్ళకు వెనుకగా ఒక పెద్దగదిలో ఉందిఇనప్పెట్టి.

విశ్వపతి తేలిగ్గా ఊపిరి పీల్చుకొన్నాడు. బోలారామ్ లాంటి కిరాయి రౌడీలకు కండబలం, మొండిబలం తప్ప బుద్ధిబలం ఉండదు.

ప్రక్కగదిలో బోలారామ్ ఇనప్పెట్టి తాళం తీసి తలుపు తెర్చాడు. పై అరలో నోట్లకట్టలు పేర్చబడి ఉన్నాయి. వాటిపై నల్లటి రివాల్వర్ మెరుస్తూంది. రివాల్వర్ తీసి పక్కన పెట్టాడు బోలారామ్. నోట్లకట్టలు సూట్ కేస్‌లో సర్దుకున్నాడు. సూట్ కేస్ మూసి, నెగిటివ్‌లు చేత్తో పట్టు కొని బయటికి వచ్చాడు.

ఇనప్పెట్టెకు మూలగా పై భాగాన ఇరవై నిమిషాల క్రితమే అమర్చిన; మూడు క్షణాలకు ఒకసారి ఫోటో తీసే ఆటోమేటిక్ కెమెరా, అతడు ఇనప్పెట్టె నుండి రివాల్వర్ చేతిలో పట్టుకొని నోట్లకట్టలు తీస్తూండగా స్నాప్స్ తీసిందని బోలారామ్‌కి తెలియదు! అంతేకాక అతడి వేలి ముద్రలు కూడా పడ్డాయక్కడ.

"ఇదిగో సాబ్ నెగిటివ్‌లు" అంటూ, కూర్చుని తాపీగా డ్రింక్ చేస్తున్న విశ్వపతికి నెగిటివ్‌లు అందించాడు బోలారామ్.

విశ్వపతి నెగిటివ్‌లను లైటర్‌తో అంటించి తర్వాత కాలిబూడిదయిన మసిని గ్లాసులో కలుపుకొని తాగేశాడు.

ఇప్పుడతని మనసు ప్రశాంతంగా ఉంది!!

"వస్తాను సా...." మాట పూర్తిచేయకముందే ముందుకు తూలి కుర్చీలో కూలబడ్డాడు బోలారామ్. లేవాలని ప్రయ త్నిస్తున్నాడతడు.

విశ్వపతి అతడినే చూస్తూ మౌనంగా కూర్చున్నాడు. సూట్ కేస్ నేలమీద వదిలేసాడు బోలారామ్. ఇప్పుడు

టాబ్లెట్ పూర్తి ప్రభావాన్ని చూపించసాగింది. విశ్వపతి వంక క్రోధంగా చూస్తూ, ఏదో అనబోయి అలాగే వాలి పోయాడు బోలారామ్.

చటుక్కున లేచాడు విశ్వపతి. సూట్ కేస్ అందుకొని బోలారామ్‌ని ఈడ్చుకొంటూ భవనం వెలుపల గార్డెన్ లోనికి తీసుకొని పోయాడు. నీటి గొట్టం దగ్గర గచ్చు మీద ఒకసారి బోలారామ్‌ని ఎత్తిపడేశాడు, సరిగ్గా నుదుటి మీద గాయం అయ్యేలా.

బోలారామ్ భారంగా మూలిగాడు. అతడి నుదురు చిట్లింది. నిస్త్రాణగా వాలిపోయి ఉన్న బోలారామ్ ప్రక్కనే పడేశాడు సూట్ కేస్. లోపలికి వెళ్ళి తలుపులు లాక్ చేశాడు. గబగబా ఇనప్పెట్టి ఉన్న గదిలోనికి కెమెరా పరిధిలోనికి వెళ్ళకుండా జాగ్రత్తగా వెళ్ళి దానిని ఆఫ్ చేశాడు.

తెర్చివున్న ఇనప్పెట్టెలోనుండి రివాల్వర్ క్రింది అరలో మూలగా ఉన్న హేండ్ గ్లౌస్ అందుకొన్నాడు. ఇనప్పెట్టి తలుపు అలాగే వదిలేసి, రివాల్వర్‌పై వేలి ముద్రలు చెడకుండా జాగ్రత్తగా పట్టుకొని తిరిగి హాలులో నికి వచ్చి వాటిని ప్రక్కనే ఉంచి కుర్చీలో కూలబడ్డాడు.

గ్లాసు నింపుకొని తాగుతూ ఆలోచనల్లో పడ్డాడు. మరో రెండు గంటల్లోగాని బోలారామ్‌కి మెలకువరాదు. పోలీసు లకు కట్టుకథ చెప్పడం చాలా సులభం....బోలారామ్ తనింటికి దొంగతనానికి వచ్చాడు. క్రింది తలుపులు లాక్ చేసి ఉండడంతో, నీటి గొట్టం ఎక్కి వచ్చాడు. డబ్బు దొంగిలించి నీటిగొట్టం నుండి దిగి పారిపోతూండగా జారి పడి స్పృహ తప్పాడు.

తగిన సాక్ష్యాధారాలు ఉన్నాయి కాబట్టి బోలారామ్

కటకటాలు లెక్కపెట్టడం తథ్యం!—ఈలోగా నాగరాజు గనుక వస్తే. టోలారామ్ వేలిముద్రలున్న రివాల్వర్‌తో వాడిని హతమారుస్తాడు. తరువాత పోలీసులకు ముందు కట్టుకథ కాక. మరో పటిష్టమైన కథ చెబుతాడు. ఒకే దెబ్బకు ఇద్దరు శత్రువులు!?

కేసు ఎలాంటిదయినా వాళ్ళకు రిస్కు లేకుండా, డిపార్ట్ మెంటుకి చెడ్డపేరు రాకుండా ఉండేటట్లుంటే చాలు అను కొనే పోలీసులున్నంతవరకూ తనలాంటి వాళ్ళు, ఇలాంటి కథల్ని ఎన్నయినా నిర్భయంగా సృష్టించవచ్చు అన్నది విశ్వపతి అభిప్రాయం. అతడి అభిప్రాయం అనుభవంతో కూడింది!

అప్పటికే రెండు బాటిల్స్ పూర్తవడంతో, మరో బాటిల్ తీసాడు విశ్వపతి. అది కూడా పూర్తిచేశాడు.

టైమ్ చూసుకొన్నాడు ఇంకో గంటచూసి నాగరాజు రాకపోతే మొదటి ప్లానే అమలుపర్చ దలచుకొన్నాడతను.

మైకం క్రమ్మడంతో కాసేపు కుర్చీలోనే కళ్ళు మూసు కొన్నాడు!?

....హఠాత్తుగా స్పృహ వచ్చింది విశ్వపతికి. పై నుండి ఏదో చప్పుడు స్పష్టంగా వినిపిస్తూంది అతడికి! మెల్లగా పైకిలేచాడు. విశ్వపతికి ఎక్కువగా తాగి తనెంత తప్పు చేశాడో అర్థమైంది! తలంతా దిమ్ముగా ఉంది. మెదడు ఆలోచించలేక పోతూంది!?

తడబడుతూ మేడమెట్ల వైపు నడిచాడు!

గాలిలో తేలుతున్నట్టనిపిస్తుంది విశ్వపతికి. ఎక్కువగా తాగడంవల్ల అలా ఉంది అనుకొన్నాడు. కాళ్లూ చేతులూ స్వాధీనం తప్పుతున్నాయి. ఒళ్ళంతా కంపిస్తుంది. రోమాలు నిక్కబొడుచుకొంటున్నాయి. ఎంత తాగినా

కనీసం సిగరెట్ వెలిగించుకో గలిగినంత కంట్రోల్‌లో ఉంటాడు విశ్వపతి.

మరేమిటి ఇవాళ ఇలా అవుతుంది. కాళ్ళు తేలి పోతున్నాయి. అనాలోచితంగా మెట్లెక్కుతున్నాడు. ఏదో శక్తి తనను అగాధంలోనికి తోస్తున్న భావన అతడిని పిచ్చివాడిని చేస్తుంది.

తనకేదో అవుతుందని గ్రహించాడు విశ్వపతి. లేక పోతే ఎప్పుడూ లేనిది ఏమిటిది!?!

గుండ్రంగా తిరిగినట్టుండే మెట్లు పూర్తిగా ఎక్కేశాడు. పై అంతస్తుకి రాగానే, విశ్వపతి భయం పెరిగిపోయింది. ఎదురుగా చూసి త్రుళ్ళిపడ్డాడు. గదిలో గోడకి గుండ్రంగా ఉన్న పెయింటింగ్ అంటించబడివుంది.

గుండ్రంగా చుట్టబడినట్టున్న సన్నటి, తెల్లగీతలమధ్య వికృతంగా వున్న పుర్రెబొమ్మ అది!?! కేవలం ఆర్టిఫిషియల్‌గా గీయబడిన బొమ్మ అది. మనిషిచుట్టూ మృత్యువు ఎలా పలపన్నిందో చక్కగా గీసాడు ఆర్టిస్ట్.

విశ్వపతి గొంతు ఎండిపోతూంది. పుర్రె పెయింటింగ్ తన మృత్యువునే సూచిస్తూందని అనిపిస్తూందతడికి....

తూలుతున్నట్టు లోనికి నడిచాడు. అకస్మాత్తుగా కళ్ళు మసకబడి పోయాయతడికి. తల విదిలించి. కళ్ళు చికిలించి చూశాడు. మసగ్గా కనబడుతూంది. అంతే! ఒళ్ళు తేలికై పోతూంది. ఉచ్ఛ్వాసనిశ్వాసలు విపరీతంగా పెరిగి పోయాయి.

గదిలో గాజు కిటికీ దగ్గర ఒక మసక ఆకారం నిలబడి ఉంది. ఆ ఆకారం నీటిగొట్టం పట్టుకొని పైకి ఎక్కివచ్చి, కిటికీ గాజు పలక తోసుకొని లోపలకు వచ్చిందని గ్రహించాడు విశ్వపతి.

ఆకారం ఇక ఉపేక్షించలేదు. చేతిలోవున్న నల్లటి రివాల్వర్, విశ్వపతికి గురిపెట్టి ట్రిగ్గర్ నొక్కింది. రివాల్వర్ పేలి బుల్లెట్ తనవైపు దూసుకొస్తూంటే, గిలగిల ఊగిపోతూ శక్తి అంతా కూడదీసుకొని అర్చాడు విశ్వపతి.

తరువాత అరవడానికి కూడా సత్తువ లేకపోయింది విశ్వపతికి. అతడి శరీరం రక్తంతో తడిసిపోతూంది. బులెట్ విసురుకి. వెనగ్గా ఉన్న కుర్చీలో పడిపోయాడతడు. కొనఊపిరితోనే కంటిరెప్పలు బిగదీసి, ఆకారం వైపే తీక్షణంగా చూడసాగాడు.

క్రమంగా ఆ ఆకారం మసకదనంపోయి, స్పష్టతను సంతరించుకోసాగింది!??

"ను....నువ్వా???" ప్రపంచ వింతలన్నీ ఒకేసారి చూస్తున్నంత ఆశ్చర్యంగా అన్నాడు విశ్వపతి.

"అవును నేనే! డబ్బుకోసం నువ్వు మా అమ్మను, నాన్నను నిర్దయగా పొడిచి చంపుతుంటే కిటికీలోనుండి ఆ దృశ్యాన్ని చూసి కూడా, కన్నీరు కార్చడం తప్ప ఏమీ చెయ్యలేకపోయాను. భయంతో అక్కడనుండి పారిపోయి వచ్చేసిన నాకు ఒక కరుణగల కుటుంబం ఆశ్రయం ఇచ్చింది. మా అన్నయ్యను జైలుపాలు చేశావని పేపర్లో చదివాను....

....నువ్వు నన్ను చూసి పెళ్ళి చేసుకొంటాననగానే అంగీకరించింది, అవకాశం దొరికిన వెంటనే నిన్ను హత మార్చడానికే! సాక్ష్యాధారాలు లేకుండా నిన్ను మట్టుపెట్టడానికే ఇన్నాళ్ళు ఎదురు చూశాను. కానీ, చిత్రంగా నీకు వచ్చే కలలోలాగే మృత్యువు నిన్ను క్రమ్మింది....

....మందు మైకంలో వున్న నీ దగ్గరనుండి హేండ్ గ్లౌస్, రివాల్వర్ తీసుకొన్నాను. పైకి రప్పించి కాల్చాను.

నేను చట్టానికి ఎలా దొరకనని ఆశ్చర్యపోతున్నావుకదూ; చెప్తావిను....

బోలారామ్ మనింటికి దొంగతనానికి వచ్చాడు, నీటి గొట్టం నుండి ఎక్కి. నిద్రపోతున్న నీ దగ్గర తాళాలు తీసుకొని డబ్బు దొంగిలించి పోతూండగా, నీకు మెలకువ వచ్చి బోలారామ్ వెంటపడ్డావు. ఈ గదిలో ఇద్దరికీ జరిగిన ఘర్షణ బోలారామ్ నిన్ను కాల్చి చంపాడు....

....నీటిగొట్టం నుండి దిగుతూ. హత్యచేసిన కంగారులో జారిపడి స్పృహ కోల్పోయాడు....అదీ నేను రూపొందించిన ప్లాను. ఈ రోజే మా అన్నయ్య జైలు నుండి విడుదల అవుతాడు! ఇక నీ ఆస్తి అంతా మాదే! సంవత్సరంపాటు నీతో కాపురం చేసింది ఈ శుభదినం కోసమే - చావు''

—అంటూ కొన ఊపిరితో, విచ్చుకొన్న కళ్ళతో వింటున్న విశ్వపతిని మరోసారి కాల్చింది సావిత్రి. ☐

వద్దంటే పనిమనిషి!



అబ్బో!

వసుంధర

ఆర్ధరాత్రి పన్నెండు గంటలు.

సేట్ మణిక్‌లాల్ యింటి ప్రహారీ చుట్టూ ప్రదక్షిణం చేశాడతడు. వాచ్‌మన్ కళ్ళబడని ఓ సురక్షిత స్థలాన్ని ఎన్నుకున్నాడు. ఒక్క ఉదుటున గోడ ఎక్కి అటువైపు దూకాడు. నెమ్మదిగా అక్కణ్ణించి ఇంటిని సమీపించాడు.

అతడో నీటిగొట్టా న్నెన్నుకుని దాన్ని పట్టుకుని పైకెగ బ్రాకాడు.

కొద్దిక్షణాల్లోనే అతడో గది కిటికీలోకి దూకాడు నీటి గొట్టంమీంచీ.

కిటికీ తలుపులు తెరిచి వున్నాయి.

గదిలో....

సేఠ్ మణిక్‌లాల్ మంచంమీద పడుకుని నిద్రపోతు న్నాడు. ప్రపంచంలో తనకు తిరుగులేని రక్షణ ఉన్న దన్నట్లు ప్రశాంతంగా నిద్రపోతున్నాడు.

అతడు చప్పుడు చేయకుండా గదిలోకి దూకాడు.

మెత్తటి కార్పెట్ అతడికి ఆహ్లాదకరమైన స్పర్శ నిచ్చింది.

అతడు లేచి నిలబడ్డాడు. నెమ్మదిగా మణిక్‌లాల్‌ను సమీపించాడు. తన జేబులోంచి ఓ రుమాలు తీసి చటు క్కున మణిక్‌లాల్ ముక్కువద్ద బలంగా పట్టి అదిమాడు.

మణిక్‌లాల్‌కు మెలకువ వచ్చింది కానీ మరుక్షణంలోనే స్పృహతప్పింది. ఆయన తల పక్కకు వేలాడేయగానే అతడు రుమాలు వెనక్కు తీసుకుని జేబుల పెట్టు కున్నాడు.

అప్పుడతడు వెతకడం ప్రారంభించాడు. ఎంతో శ్రమ పడకుండానే అతడికి తలగడకింద తాళాలు దొరికాయి.

ఉత్సాహంగా అతడు గదిలో మంచానికి పక్కగా ఉన్న ఇనప్పెట్టె వద్దకు వెళ్ళాడు. ఎంతో శ్రమలేకుండానే ఇన ప్పెట్టె తెరుచుకుంది.

మణిక్‌లాల్ గురించి అంతా ఆ ఊళ్ళో ప్రత్యేకంగా చెప్పుకుంటారు. ఆయన వ్యాపారంలో దిట్ట. కానీ డబ్బు దగ్గర మహా జాగ్రత్త మనిషి. స్వసుఖానికేమాత్రమూ

లోటు రానివ్వడు. ఇంటికిమాత్రం వాచ్‌మన్‌ని మించి మరే కాపలా ఉండదు.

డబ్బు సంపాదించేది స్వసుఖంకోసం. డబ్బును అందుకే వినియోగించాలంటాడాయన. ముఖ్యంగా డబ్బును రక్షించడానికి డబ్బును ఖర్చుపెట్టకూడదని ఆయన వాదన. ఆయన తన ముఖ్య సంపాదనంతా బ్యాంకుల్లో దాచుకుంటాడు. ఇంట్లో ఎంతో ఉండదు. ఆయనింట్లోని ఇనప్పెట్టి అతి సామాన్యమైనది. కానీ అందులో రెండు మూడు లక్షలకు తక్కువ కాకుండా ద్రవ్యముంటుందనీ - అయిదారు లక్షలు విలువచేసే నగలుంటాయనీ ముఖ్యంగా నేరస్థుల ప్రపంచంలో చెప్పుకుంటారు.

అతడిప్పుడు ఇనప్పెట్టెలోకి చూస్తున్నాడు.

అక్కడ నోట్లకట్టలున్నాయి. అన్నీ పందరూపాయలవి.

అతడుత్సాహంగా కట్టలు ఒకటొక్కటిగా తీశాడు.

మొత్తం ఇరవైఆరు కట్టలు. ఆ కట్టల అట్టడుగున ఓ కాగితముంది. దానిమీద కొన్ని నోట్ల నంబర్లున్నాయి. పరీక్షించి చూడగా అవన్నీ ఆ కట్టల్లోని నోట్ల నంబర్లు. ఇంకా పరీక్షించి చూడగా ఆ కాగితం ఒక కార్బన్ కాపీ అని తెలుస్తోంది.

అంటే మణికిలాల్ ఆ నోట్ల నంబర్లన్నీ కాపీ చేసి - ఒరిజినల్ కాపీవేరే ఎక్కడో దాచి-డూప్లికేట్ కాపీ ఇక్కడుంచాడన్న మాట. తన నోట్లు మార్చుకుందుకు ప్రయత్నిస్తే వెంటనే పట్టుబడతాడు.

అతడు నవ్వుకున్నాడు.

ఈ డబ్బును తానంత తొందరగా బయటపెట్టడు. ఒక్కసారిగా ఖర్చుపెట్టడు.

నోట్లకట్టల్నతడు జేబులోకి తోసేశాడు.

తర్వాత అతడి దృష్టి నగలపెట్టెలమీదకు వెళ్ళింది.

మొత్తం ఎనిమిది పెట్టెలున్నాయి.

వాటిలో....

రెండు వజ్రాల హారాలు, మూడు ముత్యాల నెక్లెసులు, ఒక బరువైన కాసులపేరు, రెండు చంద్రహారాలు ఉన్నాయి.

ఆ పెట్టెల అడుగున ఓ కాగితముంది. అందులో కొన్ని దుకాణాల పేర్లున్నాయి. అక్కడ ఈ నగల మోడల్సుంటాయి. ఆ దుకాణాలన్నీ పేరెన్నిక గన్నవి. అక్కడికెవరైనా ఈ నగలతో వెడితే వెంటనే పట్టుబడ తారు. మరే నగల దుకాణానికీ నగలతో వెళ్ళినా వారు వెంటనే ఆ కాగితంలో వ్రాయబడి వున్న దుకాణాలకి తెలియబర్చవలసి ఉంది.

అతడా వివరాలు చూసి నవ్వుకున్నాడు.

మణిక్‌లాల్ చాలా తెలివైనవాడు. కానీ అతడి తెలివి తనముందు చాలదు. తనీ నగల నెలా సొమ్ము చేసు కోవాలో తెలిసినవాడు. మణిక్‌లాల్ తీసుకున్న జాగ్ర త్తలు తనవద్ద పనికిరావు. అయితే తన జాగ్రత్తలో తనుండాలి.

అతడు హిప్ పాకెట్లోంచి పాలిథిన్ బాగ్ బయటకు తీశాడు. పెట్టెలలోని నగ లన్నింటినీ అందులోకి మార్చాడు.

ఇనప్పెట్టెలో అతడు కాజేయాల్సినదేమీలేదు-ఒక్క కవరు తప్ప!

కుతూహలంగా అడదా కవరు బయటకు తీశాడు.

కవర్లోని వివరాలతడికి కలిగించిన ఆశ్చర్య మింతా

అంతా కాదు.

ఊళ్ళో యింతా అంతా అనలేని పలుకుబడి ఉన్న సీతారామరాజుగారిని గురించి దారుణమైన వివరా లున్నాయి.

సీతారామరాజు రాజకీయవాది కాడు. ఆయన ఏ పక్షా నికీ చెందినవాడూ కాదు. కుల, మత, రాజకీయాలతో నిమిత్తం లేకుండా సంఘసేవ చేస్తూంటాడాయన. ఆయన ఎందరో అనాథుల కాశ్రయం కల్పించాడు. అన్యాయానికి గురైనవారిని ఆదుకుంటాడు.

ఊళ్ళో ఏ సమావేశమైనా సీతారామరాజును పిలవడం జరుగుతుంది. గొప్ప సంఘసేవకుడిగా కేంద్రప్రభుత్వమే ఆయన్ను గుర్తించి పద్మశ్రీ సత్కారం చేసింది.

అలాంటి సీతారామరాజు దేశద్రోహి అన్న విశేషం ఈ కవర్లో బైటపడింది.

సంఘసేవ పేరిట సీతారామరాజు విదేశీ రాయబార కార్యాలయాలతో సంబంధాలు కలిగి ఉన్నాడు. ఆయన తరచు విదేశీయులను కలుస్తూంటాడు. ఇటు దేశనాయకు లతో పరిచయం - అటు విదేశీయుల పరిచయం! దేశంలో యెవ్వరూ అనుమానించని పరిస్థితి।

సీతారామరాజు దేశానికి సంబంధించిన ముఖ్య రహ స్యాలను తెలుసుకుని విదేశాలకు చేరవేస్తున్నాడు. అందు గురించి ఆయనకు అపరిమితమైన ప్రతిఫలం లభిస్తోంది. దాన్నాయన సంఘసేవ కుపయోగిస్తున్నాడు.

మణిక్‌లాల్ ఈ విషయం తెలుసుకున్నాడు. అందుకు తిరుగులేని ఋజువులు సంపాదించి ఈ కవర్‌లో భద్రపరి చాడు. తరచుగా ఆయన సీతారామరాజును బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడు. ప్రస్తుతం ఇనప్పెట్టెలో ఉన్న డబ్బు అ

బాపతుడే.

మణిక్‌లాల్ కవర్లోని కాగితంమీద సీతారామరాజు వద్ద నుంచి తనెప్పుడెప్పుడెంత మొత్తాలు తీసుకున్నదీ రాసుకున్నాడు. ఇనప్పెట్టెలోని డబ్బు నాయన ఈ రోజే సంపాదించాడు.

"ఇది నా కోసం!" అనుకున్నాడతడు.

అంతటనే అతడి ఉత్సాహం పెరిగింది.

కవర్లో సీతారామరాజుకు సంబంధించిన ఫోటో లున్నాయి. కాగితా లున్నాయి. ఆ కవరు తన దగ్గరుంటే....?

ఆ కవరు పాడి ఆవులాంటిది.

సీతారామరాజువంటి నయవంచకుడు - తన మోసం బయటపడకుండా ఉండడానికి ఎంతైనా ఇవ్వగలడు.

తనకు డబ్బు కావాలనిపించినప్పుడల్లా ఆయన్ను పీడించవచ్చు.

ఈ రోజు నిజంగా తన అదృష్టం పండింది.

అప్పుడతడి కెంత ఆనందం కలిగిందో వర్ణించడం కష్టం. ఓ బలహీన క్షణంలో అయితే ఆ నగలు, డబ్బు అక్కడే వదిలిపెట్టేసి సీతారామరాజుకు సంబంధించిన కవరు ఒక్కటీ పట్టుకుని వెడదామనుకున్నాడు. కానీ అంతకంటే తెలివితక్కువ ఆలోచన వేరే ఉండదని గ్రహించడానికి కొద్ది క్షణాలు మాత్రమే పట్టిందతడికి.

ఆ కవరు నతడు జనీను లోపలకు జారవిడిచాడు. తర్వాత ఇనప్పెట్టె తలుపులు మూసి తాళంవేసి తాళం చెవులను యథాస్థానంలో ఉంచాడు.

సేఠ్ మణిక్‌లాల్ ఒళ్ళు తెలియకుండా నిద్రపోతూనే ఉన్నాడు.

"ఉదయం లేచి ఇనప్పెట్టె కాళీ అయిందని చూసుకో గానే-కొన్నాళ్ళపాటు నీకు నిద్ర ఉండదు. ప్రస్తుతానికి హాయిగా నిద్రపో—" అనుకుంటూ అతడు గది కిటికీ లోంచి బయటకు చూశాడు.

కొద్దిసేపట్లోనే అతడు నీటిగొట్టంమీంచి నేలమీదకూ-నేలమీంచి గోడ దగ్గరకూ - గోడమీదనించి రోడ్డుమీదకు చేరు కున్నాడు.

2

ఉదయం ఎనిమిదిగంటల సమయం.

సీతారామరాజు తనింటి డ్రాయింగు రూంలో ఓ ఫ్రెంచిదేశీయుడితో మాట్లాడుతున్నాడు.

అతడి పేరు మార్క్. అతడికి హిందూదేవాలయంలో ప్రవేశించి పూజ చేయించుకోవాలని ఉన్నదట.

"అది సాధ్యం కాదు...." అన్నాడు సీతారామరాజు.

"ఎంత డబ్బయినా ఇస్తాను" అంటున్నాడు మార్క్.

"డబ్బుతో అన్నీ సాధించలేము" అన్నాడు సీతా రామరాజు.

"మా మతం ఇతర మతస్థులను చర్చిలోకి నిషేధిం చదు. హిందూమతస్థులకింత సంకుచిత భావ మెందుకు!" అన్నాడు మార్క్.

"హిందూ మతస్థులు పూజామందిరంలో క్రీస్తు బొమ్మను నిషేధించరు. క్రైస్తవులు కృష్ణుడి పటానికి పూజ చేయగలరా?" అని సీతారామరాజు నవ్వి "ఇప్పుడు మతాల ఔన్నత్యాల ప్రసక్తి అనవసరం. కావాలంటే నీ దేశంలో హిందువులను చర్చిలోకి రానివ్వకుండా నిషే ధించు. ఇక్కడ ఆలయ ప్రవేశం గురించి నొక్కించకు. ఎవరి పద్ధతులు వారివి" అన్నాడు.

"ఈ ఊళ్ళోనూ, చుట్టుపక్కలా-చూడదగ్గ ప్రత్యేక విశేషాలు చెప్పు. నీ సూచనల మేరకు అన్నీ చూస్తాను" అన్నాడు మార్క్.

"విలియమ్స్!" అని గట్టిగా పిలిచాడు సీతారామరాజు.

పక్క గదిలోంచి ఓ యువకుడు వచ్చాడు. అతడు సన్నగా పొడవుగా నాజూకుగా వున్నాడు. పిట్ట మొహం. వయసెంతుంటుందో ముఖం చూసి చెప్పటం కష్టం. మీసాలు లేవు. చురుకైన కళ్ళు.

"ఇవాళ్టి మన ఖాసింభాయి టాక్సీకి అప్పజెప్పు. అన్నీ నీకే తెలుసుగా" అన్నాడు సీతారామరాజు.

విలియమ్స్ వినయంగా ఆయనకు నమస్కరించి మార్క్‌ని తీసుకుని వెళ్ళిపోయాడు.

అప్పుడే సీతారామరాజు పక్కన టెలిఫోన్ మ్రోగింది.

"హలో!" అన్నాడాయన రిసీవర్ తీసి.

"హలో - రాజుగారేనా!" అందవతలి గొంతు.

"అవును - మాణిక్‌లాల్‌గారా?" అన్నాడు సీతారామరాజు.

"అవును - మీరెలా గుర్తుపట్టారు!"

"ఒకసారి ఫోన్లో గొంతు వింటే చాలు - కంప్యూటర్లోలా రికార్డయి పోతుంది నా మెదడులో! ఏమిటీ - కంగారుగా ఉన్నట్టున్నారు?"

"కంగారు పడాల్సిన విషయమే. నేనే కాదు - మీరు కూడా!"

"నేనెందుకు కంగారు పడాలి?"

"మీ గురించిన సమాచారం నాకు కొంత తెలుసు. ఆ విషయం మీకు తెలుసు...."

"అవును. అందుకు ఛార్జి చెల్లిస్తూనే ఉన్నానుగా...."

"చెల్లిస్తున్నారు. కానీ ఇప్పుడు మీరు చేసిన పని బాగోలేదు."

"నేనేం చేయలేదే!"

"రాజుగారూ....ఇనప్పెట్టెలోంచి ఆ కవరు కాజేస్తే అయిపోయిందనుకోకండి. నా దగ్గర అదే సమాచారం ఇంకా చాలా స్థలాల్లో ఉంది...."

"మీరు చెబుతున్నది నాకేమీ అర్థం కావడం లేదు" అన్నాడు సీతారామరాజు చిరాగ్గా.

"బుకాయించకండి. ఇనప్పెట్టిలో డబ్బూ, నగలూ కూడా పోయినంత మాత్రాన అది ఎవరో దొంగ చేసిన పని అని నేననుకోలేను. నన్నలా తప్పుదారిని పట్టించాలని మీరు వేసిన పథకమది. అవునా?"

"ఏం జరిగిందో వివరంగా చెప్పండి!"

"రాత్రి నా గదిలోకి దొంగ జొరబడ్డాడు. నా ఇనప్పెట్టి తెరచి డబ్బు, నగలు, ఓ కవరు పట్టుకుపోయాడు."

"అప్పుడు మీరేం చేస్తున్నారు?"

"నిద్రపోతున్నాను...."

సీతారామరాజు నవ్వి "మీ యింటి కాపలా అంత దారుణంగా ఉందన్న మాట" అన్నాడు.

"అది ఇంటి కాపలా విశేషం కాదు, మీ గొప్పతనం. మీ మనిషి తల్చుకుంటే ఇనుపగోడల్ని ఛేదించుకు పోగలడని నాకు తెలుసు - ఇది మీ మనిషి పని తప్ప వేరొకటి కాదు."

"నిజంగా ఈ విశేషం గురించి నాకేమీ తెలియదు."

"నిజంగానా!"

"ఊఁ" అని, "అసలు మీరు నన్నెందు కనుమానిస్తున్నారు?" అన్నాడాయన.

"నా ఇనప్పెట్టెలోంచి పోయిన కవర్లో మీ నుంచి నాకు డబ్బు సంపాదించి పెట్టే విశేషాలున్నాయి."

సీతారామరాజు భ్రుకుటి ముడతలు పడింది "అయ్‌సీ" అన్నాడు.

"నా అనుమానమంతా మీమీదే ఉంది. మీ రెంత కష్ట పడినా ఫలితం మాత్రం దక్కలేదు. నెగెటివులు వేరే చోట వున్నాయి. కాబట్టి మర్యాదగా నా డబ్బు, నగలు వెనక్కి పంపించేయండి. ఒకవేళ నిజంగా ఇందులో మీ హస్తం లేనిపక్షంలో మరో వ్యక్తి చేతిలోకి మీ రహస్యాలు వెళ్ళాయని గ్రహించండి. అంటే మీరు చాలా ప్రమాదంలో పడ్డారన్నమాట. అంటే మిమ్మల్ని బ్లాక్‌మెయిల్ చేసే వ్యక్తుల సంఖ్య పెరుగుతుంది."

సీతారామరాజు ముఖం నిండా దిగులు అలుముకుంది. "మణిక్‌లాల్‌జీ! మీరు నన్ననుమానించకండి. ఈ విష యంలో నాకేమీ తెలియదు. మీ అజాగ్రత్త నా ప్రాణాల మీదకు వచ్చింది. ఇప్పుడు నేనా దొంగను త్వరగా పట్టు కోవాలి" అన్నాడు.

"విష్ యూ బెస్టాఫ్ లక్! ఈ దొంగతనంలో నా కంటే మీకే నష్ట మెక్కువ. అది చెప్పడానికే ఫోన్ చేశాను."

అవతల క్లిక్‌మంది.

సీతారామరాజు ఫోన్ పెట్టేసి ఉస్సురని నిట్టూర్చి "విలియమ్స్!" అని గట్టిగా అరిచాడు.

పక్క గదిలోంచి ఓ యువకుడు వచ్చాడు. అతడు లావుగా, పొట్టిగా ఉన్నాడు. మనిషి ముఖంలో ఎంతసేపు చూసినా ఏ భావాలూ కనపడవు. నిశ్చలమైన కళ్ళు. వెడ

ల్పాటి ముఖం. ఫ్రెంచికట్ మీసాలు.

"విలియమ్సింకా రాలేదు సార్!" అన్నాడతడు.

"పోనీ నువ్వు ఫ్రీగా వున్నావా?" అన్నాడు సీతారామ రాజు.

"ఉన్నాను సార్!"

"అయితే నేను చెప్పిందివిను...." అంటూ చెప్పడం ప్రారంభించాడు సీతారామరాజు.

3

చిన్న గది.

ఇద్దరూ సోఫాల్లో ఒకరికొకరు ఎదురుగా కూర్చుని ఉన్నారు.

ఇద్దరికీ మధ్య టీపాయ్. టీపాయ్‌మీద పందరూపా యల నోట్లకట్టలు - నగలు!

"మణిక్‌లాల్ ఇంట్లో దొంగతనం అసాధ్యమన్నావు. సాధించుకుని వచ్చాను. మొత్తం ఇనప్పెట్టెలో ఉన్న దంతా దోచుకుని వచ్చాను. ఎనిమిది నగలు-రెండు లక్షల అరవై వేలు క్యాషు...."

"గుడ్!" అన్నాడొకడు.

"ఈ డబ్బు, నగలు నీవి. నాకు లక్ష రూపాయలు క్యాషివ్వు. అవీ వేరే నోట్లు. అంతే చాలు నాకు...." అన్నాడతడు.

"వెల్-మిస్టర్ శివరామ్! ఇల్లలకగానే పండగ కాదు."

"ఎందుకని?"

"మణిక్‌లాల్ ఇంట్లో దొంగతనం చేసిన వారందరూ పట్టుబడ్డారు. అందుకే దొంగలకా యిల్లు సింహస్వప్నం" అన్నాడొకడు.

"నాకు కాదని ఇప్పుడే ఋజువు చేశాను" అన్నాడు

శివరాం.

"అప్పుడే ఋజువై పోయినట్లు నేను భావించడంలేదు."

"ఎందుకని?"

"మణిక్‌లాల్ తన ప్రయత్నాలలో తానుంటాడు. అవి ఫలించడానికి కాస్త టైము పట్టవచ్చు. అందువల్ల ఒక వారంరోజులవరకూ ఈడబ్బు, నగలు నువ్వే ఎక్కడైనా దాచుకో. అనవసరంగా నా ప్రాణాలమీదకు వస్తుంది...."

"నీమాటలు వింటూంటే నువ్వు జగదీప్‌వేనా అని పిస్తోంది" అన్నాడు శివరాం ఆశ్చర్యంగా.

"జగదీప్‌ని కాబట్టే మణిక్‌లాల్‌వంటివారికి దూరంగా ఉండమంటున్నాను. రావణాసురుడంతటివాడు సీతమ్మను పట్టితెచ్చుకున్నాడు కానీ ముట్టుకోలేదు. ఎలాంటి పెద్ద నేరస్థులకీ పరిమితులుంటాయి. ఈ విషయం గుర్తుంచుకో...." అన్నాడు జగదీప్.

సరిగ్గా అప్పుడే బయట తలుపుమీద మూడుసార్లు టక టకా మ్రోగింది.

"నా మనిషయుంటాడు" అన్నాడు జగదీప్.

"ఈ నగలు, డబ్బు దాచేసేదా?" అన్నాడు శివరాం.

"అవసరంలేదు" అంటూ "కమిన్!" అన్నాడు జగదీప్.

అప్పుడు లోపలికో వ్యక్తి వచ్చాడు.

అతడు లాల్చీ, షరాయి వేసుకున్నాడు. తెల్లగా ఉన్నాడు.

"చందాల పేరుచెప్పి మణిక్‌లాల్ ఇంటికి వెళ్ళి వచ్చాను సార్!" అన్నాడు.

"అక్కడేం జరిగింది?"

"నేను వెళ్ళాకనే మణిక్‌లాల్ ఇనప్పెట్టి తెరిచి చూసు కున్నా డనుకుంటాను....'' అన్నాడతడు.

"ఏం జరిగింది?''

"నేను చందాగురించి అడగ్గానే ఆయన లేదని చెప్పే శాడు. నేనేమో మన సంస్థగురించి విశేషంగా చెప్పాను. డబ్బిచ్చినా ఇవ్వకపోయినా ఆ సంస్థగురించి ఆయన తెలుసుకుని తీరాలన్నాను....''

"తర్వాత....''

"మణిక్‌లాల్ తన గదిలోకి వెళ్ళాడు. రోజూ ఆ టైముకోసారి ఇనప్పెట్టి చూసుకుంటాడన్న విషయం మనకు తెలిసిందేకదా! అలాగే జరిగింది. ఆయన తలు పులు వేసుకున్నాడు. నేను మన డిస్టంట్ హియరర్ సాయంతో అక్కడేం జరిగిందీ విన్నాను....''

డిస్టంట్ హియరర్ ఒక వినికిడి సాధనం. దాని సహా యంతో ఓ యాభై గజాల దూరంలో ఏం జరుగుతున్నదీ వినవచ్చు.

తనేం విన్నదీ అతడు జగదీప్‌కి చెప్పాడు.

"సరే-నువ్వు వెళ్ళు'' అన్నాడు జగదీప్. అతడు వెళ్ళి పోయాక—"మిస్టర్ శివరాం! నువ్వు తెలివైనవాడివే! మణిక్‌లాల్‌ని దెబ్బతీసినట్లే అనిపిస్తుంది. అయితే ఆయన చాలా కంగారుపడుతున్నాడన్న మాట....'' అన్నాడు.

శివరాం ముఖంలో గర్వం కనపడలేదు.

"ఈ ఫోన్‌టాక్‌నిబట్టి మణిక్‌లాల్ అసాధ్యుడని తెలు స్తోంది. అజ్ఞాతంగానైనా - తానెవరో చెప్పకుని మరీ సీతా రామరాజును బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడన్నమాట....నువ్వు చెప్పినట్లితడితో మనం చాలా జాగ్రత్తగా ఉండాలి'' అన్నా

డతడు.

"అది సరే - కానీ నువ్వు ప్రయోజనకరమైనపనే చేశావు. సీతారామరాజిప్పుడు బాగా బెదిరిపోయాడు. ఆయన కూడా తక్కువ ప్రమాదకరమైన మనిషని నే ననుకోను. ఇదే మంచి సమయం. రెండో మూడో లక్ష లాయన్నుంచి రాబట్టుకో. అత్యాశకుపోకు. ఆ కాగితాలు తిరిగిచ్చేయి. ఎందుకంటే వాటిగురించి నిన్ను అట్నించి మణిక్‌లాల్ మనుషులూ, ఇట్నించి సీతారామరాజు మనుషులూ కూడా వేటాడుతారు" అన్నాడు జగదీప్.

"బ్లాక్‌మెయిలింగ్ నా కలవాటులేని పని. సగంవాటా యిస్తాను. నా తరఫున ఓ రెండులక్షలు వసూలుచేయించి పెట్టగలవా?" అన్నాడు శివరాం.

"అయాంసారీ: మణిక్‌లాల్ వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటే ప్రమాదమని బాస్‌నుంచి నాకు ఆజ్ఞ - న్నాయి" అన్నాడు జగదీప్.

"కొంపతీసి మణిక్‌లాల్ నీ బాస్ మనిషికాడు గదా!"

"నీ కా భయమక్కర్లేదు. మణిక్‌లాల్‌ని దెబ్బతీసిన వాడికి మా బాస్ మంచి బహుమానం కూడా యిస్తాడు. ఆయన మణిక్‌లాల్ పతనాన్ని కోరుకున్నాడుకానీ—దెబ్బ తీయడా కి ప్రయత్నించి దెబ్బతినడంవల్ల - మణిక్‌లా లంటే ఆయనకు భయం...."

శివరాం కాస్త భయపడుతూ "నువ్వు నన్ను బాగా బెదరగొట్టేస్తున్నావు" అన్నాడు.

జగదీప్ లేచి శివరాం భుజంతట్టి "భయపడకు. నువ్వు సీతారామరాజుని ఓ పట్టుపట్టు. సంఘసేవకుడిగా పేరున్న మనిషిగదా—చెడ్డపేరంటే భయపడతాడు. నేను నీకు మణిక్‌లాల్ గురించిన నిజాలు చెప్పాలనుకున్నాను.

అంతే!" అన్నాడు.

శివరాం లేచి నిలబడి "వస్తాను" అన్నాడు.

"ఈ నగలు, ర్యాషు తీసుకుపో!" అన్నాడు జగదీప్.

శివరాం ఆశ్చర్యంగా "ఎంతో విలువైన ఈడబ్బుకు జగదీప్ తృణప్రాయంగా చూస్తున్నాడంటే ఏదో విశేష ముంది...." అనుకున్నాడు.

4

శివరాం అప్పుడు మారువేషంలో ఉన్నాడు.

పంచ, లాల్చీ వేసుకున్నాడు. పైన కండువా. భుజానికి వ్రేలాడే సంచీ. అతడు కాఫీహోటల్లో ప్రవేశించి—ఫోన్ ఏ గదిలో ఉందీ అనడిగేడు.

అక్కడ ఓ చిన్న గది ఉంది. అందులో ఫోనుంది. ప్రయివేటుగా ఫోన్ చేసుకునే సదుపాయ ముందక్కడ. అయితే రెండ్రూపాయలు ఛార్జి.

శివరాం ముందుగానే రెండ్రూపాయలూ ఇచ్చి ఆ గది లోనికి వెళ్ళాడు. ఓ నంబరు తిప్పాడు.

"హలో!" అన్నాడు.

"సీతారామరాజు స్పీకింగ్!"

"నమస్కారం రాజుగారూ...."

"నమస్కారం - తమరెవరు?"

"తమరికి మణిక్ లాల్‌గారు చెప్పేఉంటారు. ఆ కాగితాలు నాదగ్గరున్నాయి. రెండులక్షలిస్తే వాటిని మీకు తిరిగిచ్చేస్తాను...."

"బ్లాక్ మెయిలర్‌వా?" అన్నాడు సీతారామరాజు.

"అలాగే అనుకోండి...."

"ఎవరు నువ్వు?"

"తమరే అన్నారుగా - బ్లాక్‌మెయిలర్నని...."

"నీ పేరు?"

"అవన్నీ తమరి కెందుకు? నాకు రెండులక్షలివ్వండి. మీ కాగితాలు మీరు తీసుకోండి-" అన్నాడు శివరాం.

"నువ్వు డబ్బు తీసుకుని కాగితాలు తిరిగిస్తావని నమ్మక మేమిటి?"

"మీరు ప్రమాదకరమైన మనిషని నాకు తెలుసు. మీతో ఆటలాడే సాహసం నాకు లేదు. నాకు బాగా డబ్బవ సరం పడబట్టి కానీ-తమని బ్లాక్ మెయిల్ చేసే సాహసం కూడా చేయలేను. మీ కాగితాలు మీకు భద్రంగా అందు తాయి - ...."

"నేనేం చేయాలో చెప్పు...."

"కాసేపట్లో మీ చేతికో తాళంచెవి అందుతుంది. అది హోటల్ నీలాంబర్‌లో నాలుగోనంబరు గదితాళం. వేరే యెవర్నీ పంపకుండా తమరే స్వయంగా బయల్దేరి ఓ రెండులక్షలు-పెట్టెలో గానీ-సంచీలో గానీ పెట్టి-ఆ గదిలో మంచంమీద పెట్టి-బయటకు వచ్చి-తాళం వేసి వెళ్ళిపోండి. ఆ తర్వాత వారంరోజులకు మీ కాగితాలు మీ కందుతాయి - ...."

"అందకపోతే?"

"మీరు నమ్మాలి. కోరి మీ బోంట్లతో విరోధం తెచ్చుకోలేను...."

"ఈ హడావుడంతా ఎందుకు? నువ్వు స్వయంగా మా యింటికి రా. మూడులక్షలు తీసుకుని ఆ కాగితాలను వెంటనే నా కిచ్చేసేయ్. నిన్ను నా అనుచరులలోకి కూడా తీసుకుంటాను...."

"ఎందుకు నాపై అంత అభిమానం?"

"మణిక్‌లాల్ ఆ కాగితాలు తన దగ్గరుంచుకుని నా

ప్రాణాలు తీస్తున్నాడు. నన్నా బాధనుంచి తప్పించి నందుకు నీ కే ఉపకారమైనా చేయగలను!"

"రాజుగారూ-ఉదయం మణిక్‌లాల్ మీతో ఏం మాట్లాడాడో నాకు తెలుసు. ఈ కాగితాల కాపీలు తన దగ్గర ఇంకా చాలా ఉన్నాయన్నాడు...."

"అదంతా బుకాయింపు...."

"ఏది యేమైనా-నేను మిమ్మల్ని నమ్మి మీ యింటికి రాలేను....అంతా నేను చెప్పినట్లు చేయండి - ...." అన్నాడు శివరాం.

"నీ యిష్టం - ...."

"మీరు నన్ను పట్టుకునేందుకు ప్రయత్నిస్తే - నా ప్రాణాలు పోయినా మీ కాగితాలు దొరకవు సరిగదా - మీ వివరాలు పదిమందికీ తెలిసే ఏర్పాట్లు జరుగుతాయి" అన్నాడు శివరాం హెచ్చరిస్తున్నట్టుగా.

"ఈ విషయంలో నాకు తెలుసు-ఏం చేయాలో! నిన్ను పట్టుకునేందుకు ప్రయత్నించి నాకై నేనే ప్రమాద మెందుకు తెచ్చుకుంటాను?" అన్నాడు సీతారామరాజు.

5

సీతారామరాజు ఓ పాలిథీన్ బాగ్‌లో రెండులక్షల రూపాయలు సర్దాడు. ఆ బ్యాగును ఓ కాగితంలో చుట్టాడు. ఆ కాగితం పొట్లాన్ని చేత్తో పట్టుకొని తన గదిలో కూర్చునివుండగా-"సార్! మీ కోసం ఎవరో ఓ చిన్న కుర్రాడొచ్చాడు-" అన్నాడు విలియమ్స్ వచ్చి.

"లోపలకు రమ్మను-" అన్నాడు సీతారామరాజు.

కుర్రాడు వచ్చాడు.

మాసిన లాగు. చిరిగిన చొక్కా. మూసిన గుప్పిట్లో యేముందో తెలుసుకోమన్నట్లు చేయి కదుపుతున్నాడు.

"తాళంచెవి తెచ్చావా?" అన్నాడు సీతారామరాజు నవ్వుతూ.

"అవునండి-" అన్నాడా కుర్రాడు.

"ఎవరున్నువ్వు? ఎక్కడుంటావు?" అన్నాడు సీతారామరాజు.

"నా పేరు గోపీ. నా కెవ్వరూ లేరు. అక్కడా యిక్కడా పనులు చేస్తూంటాను. బస్స్టాండులో మూటలు మోస్తూంటాను-" అన్నాడు గోపీ.

సీతారామరాజా కుర్రాడివంక జాలిగా చూసి-"నీ కీ తాళంచెవి ఎవరిచ్చారో చెప్పగలవా?" అన్నాడు.

గోపీ శివరాంని చూపించాడు.

"ఆయనెవరో నీకు తెలుసా?"

గోపీ తల అడ్డంగా ఊపాడు.

"నా యింటికొచ్చిన అనాధులనాధులు కాకూడదు. గోపీ!....నీకు మంచి బట్టలు కుట్టిస్తాను. చదువు చెప్పిస్తాను. ఇక్క డుండిపోతావా?" అన్నాడు సీతారామరాజు.

"మరి భోజనం?" అన్నాడు గోపీ ఆత్రుతగా.

ఆ కుర్రాడికి అన్నింటికన్నా భోజనం ముఖ్యమైనదని మరిచిన తన తెలివితక్కువతనాన్ని నిందించుకుంటూ-"అయ్యో-దాంతరవాతే ఏదైనా?" అని-"విలియమ్స్.... ఈ కుర్రాణ్ణి సొసైటీలో జేర్చు-...." అన్నాడు సీతారామరాజు.

6

శివరాం బాత్రూంలో ఉన్నాడు.

సీతారామరాజు రావడం, డబ్బు మంచంమీద పెట్టడం చూశాడు రహస్యంగా. ఆయన బయటకు వెళ్ళి తలుపు

తాళం వేసుకోగానే-అతడు డబ్బు తీసుకుని జేబులో పెట్టు కున్నాడు.

పక్కగది కూడా తనే బుక్ చేశాడు.

ఆ గదికీ ఈ గదికీ మధ్య తలుపు ఉంది. ఆ తలుపు ముందే గడియతీసి ఉంచుకున్నాడతడు.

వెంటనే అతడా గదిలోంచి ఇవతల గదిలోకి మారి పోయాడు. అవతలివైపు గడియ ఇవతల్నుంచి పడేలా చేయడం అతడికి తెలుసు. ఆ పనిచేసి ఇవతల్నించి కూడా గడియ పెట్టేక - శివరాం తృప్తిగా శ్వాస వది లాడు.

ఇప్పుడింక తననెవరు పట్టుకోలేరు.

ఈ గది నొక వేషంతోటీ-ఆ గది నొక వేషంతోటీ బుక్ చేశాడతడు.

తను ధరించిన పంచ, లాల్చీలనతడక్కడే వదిలి పెట్టాడు. ప్రస్తుతం అతడు పాంటు, షర్టు ధరించి ఉన్నాడు.

ఉత్సాహంగా మంచంమీద పడుకుని ఈలవేసుకున్నాడు శివరాం.

అతడి పిలుపు వినివచ్చినట్లుగా ఎదురుగా నిలబడ్డారు నలుగురు పోలీసులు. వాళ్ళని చూస్తూనే శివరాం తెల్ల బోయాడు.

"నీ దగ్గర దొంగనోట్లున్నట్టు మాకు సమాచార మందింది-" అన్నాడో కానిస్టేబుల్. శివరాం నిశ్చేష్టుడై ఉండగా అతడివద్ద రెండులక్షలూ స్వాధీనం చేసుకుని వాళ్ళతణ్ణి పోలీసుస్టేషనుకు తీసుకువెళ్ళారు.

శివరాం దగ్గరున్నవి దొంగనోట్లే అని ఋజువయింది.

ఇది సీతారామరాజు పన్నాగమేనని శివరాం గ్రహిం

చాడు. ఆయనపై పగ తీర్చుకోవాలని కూడా అను కున్నాడు.

సీతారామరాజతణ్ణి కలుసుకున్నాడు.

శివరాం పళ్ళు పిండాడు.

"మణిక్‌లాల్ దగ్గర్నుంచి డబ్బు, నగలు తీసుకుని ఊరు కుంటే నీకేమీ ప్రమాదం జరిగేదికాదు. అత్యాశకుపోయి బ్లాక్‌మెయిలింగ్ పేపర్లు తీసుకున్నావు. ఆ పేపర్లు నిజ మైనవని భ్రమపడ్డావు. అవి నీలాంటివాళ్ళకోసం ట్రాప్.."

"అంటే?"

"దొరికిందానితో తృప్తిపడక అత్యాశకు పోయేవా ళ్ళుండకపోరని మణిక్‌లాల్ నమ్మకం. అందుకే అలాంటి కాగితాలుంచుతాడు. అది చూసి బ్లాక్‌మెయిలింగుకి దిగిన వాళ్లు నీలాగే దొరికిపోతారు. నాకు బ్లాక్‌మెయిలర్సంటే భయంలేదు కాబట్టి మణిక్‌లాల్ సొమ్ము సులభంగా దొరికే ఉపాయమది. సమాజంలోంచి నీలాంటి దొంగల్ని ఏరి పారేయాలనే - మణిమలాల్ తనింటికి చెప్పుకోతగ్గరక్షణ ఏర్పరచుకోకుండా ఇలాంటి ట్రాప్స్ పెడుతున్నాడు. అయినా విచారించకు. జైల్నించి తిరిగిరాగానే - నిన్ను నువ్వు సంస్కరించుకుని సమాజంలో గౌరవంగా బ్రతక డానికి నేను సాయపడతాను" అన్నాడు సీతారామరాజు.

తాను, మణిక్‌లాల్ - ప్రభుత్వానికి సంబంధించిన రహస్య గూఢచారులన్న నిజమొక్కటిమాత్రం ఆయన శివరాంకి చెప్పలేదు.

జగదీష్ హెచ్చరికలోని నిజం శివరాంకి అప్పుడర్థ మయింది. జైల్నించి బయటపడ్డాక తాను సంస్కరించ బడాలన్న కోరిక లేకపోయినా మణిక్‌లాల్ జోలికిమాత్రం మళ్ళీ జీవితంలో పోకూడదని అతడనుకున్నాడు. □

దంతపు కత్తి

ఎమ్. వి. వి. సత్యనారాయణ

"మీకోసం యింతకు క్రితం ఫోన్ చేశాను సార్!"

అన్నాడతడు. డిటెక్టివ్ శిరీష్ అతడి వయిపు చూశాడు. తల వూపాడు.

అతడికి పాతికేళ్ళలోపు వుంటుంది వయసు. చామన చాయలో అంత ఎత్తూలేదు. అలా అని పొట్టివాడు కాదు.

లావూ సన్నమూ కాని శరీరం.

"మీ పేరు?" అడిగాడు శిరీష్.

"నన్ను కరుణాకర్ అంటారు సార్!"

"చెప్పండి. మీరు వచ్చిన పని?"

"మా నాన్నగారు మూడు రోజుల క్రితం పోయారు."

"ముసలితనంవల్లనా?"

"అవును సార్!"

"ఎంత వయసు వుంటుంది?"

"డెభ్భై నాలుగు సార్!"

"వూఁ!"

"మార్చి 10 న పోయారుసార్! పదకొండు వుదయం అంత్యక్రియలు చేశాం సార్!"

"ఈ రోజు 13."

"అవును సార్! ఈ వుదయం నాన్నగారి సమాధి వద్దకు వెళ్ళాను" కరుణాకర్ వూపిరి బిగబట్టాడు. చెప్ప దల్చుకున్న విషయం పూర్తిగా చెప్పడానికి సత్తువ చేకూర్చుకుంటున్నాడు.

"ఒక్కరే వెళ్ళారా?"

"అవును సార్! సమాధిని ఎవరో కదిపారు."

"అంతే?"

"సమాధిని త్రవ్వినట్టు అనుమానం వచ్చింది సార్! సమాధిమీద మట్టి క్రొత్తగా వుంది. సమాధిమీద పెట్టిన ముగ్గు మారింది.

"సమాధి వద్దకు మీ రెందుకు వెళ్ళారు!"

కరుణాకర్ తటపటాయించి "కాడలు కాచుకునే కుర్ర వాడు కబురు చెప్పాడు సార్! మా నాన్నగారిని ఖననం చేసేటప్పుడు అతను చూశాడు. స్మశానంలో పశువులను

మేపుకొంటున్నాడు. ఈ రోజు వుదయం అతడు మా నాన్నగారి సమాధి చూశాడు. కొద్దిపాటి మార్పులున్నట్టు గమనించాడట. శవాన్ని తక్కువ లోతులో పాతిపెడితే నక్కలు నేల తొలిచి శవాన్ని ఎత్తుకుపోతాయట! అందుకే అతడు మాకు సంశయంగా చెప్పాడు. ఎవరో మనుషులే సమాధిని కదిపి వుంటారని!'' అన్నాడు.

''సమాధి త్రవ్వి చూశారా?''

''లేదు సార్! అలా చెయ్యాలంటే మెజిస్ట్రేట్ అనుమతి కావాలట కదా! ఆ వ్యవహారాల గురించి నాకు తెలియదు. మీరు క్రిమినల్ లాయర్‌గా కూడా మంచి పేరు సంపాదించారు కదా, నాకు యీ విషయంలో సహకరిస్తారని యిటు వచ్చాను.''

డిటెక్టివ్ శిరీష్ తలవూపి, ''మెజిస్ట్రేట్ సమక్షంలో పోలీసుల పర్యవేక్షణలో మాత్రమే సమాధి తెరవాల్సి వుంటుంది. మీరే సరయిన వారసులు అని నిరూపించ కలిగే కాగితాలు కావలసి వుంటాయి. మీరు సమాధిని ఎందుకు తెరవాలనుకుంటున్నారో రాతమూలకంగా మెజిస్ట్రేట్‌ను సంతృప్తిపరచవలసి వుంటుంది'' అన్నాడు.

తరువాత కరుణాకర్ చేత కాగితాలు నింపించి తగిన పద్ధతిలో అర్జీ రాయించాడు డిటెక్టివ్ శిరీష్.

కాగితాలు మెజిస్ట్రేట్‌కి వెళ్ళాయి.

మెజిస్ట్రేట్ నుండి పోలీసులకు ఆదేశాలు వచ్చాయి.

మధ్యాహ్ననికి గానీ స్మశానంలో కావలసిన ఏర్పాట్లు జరగలేదు. మెజిస్ట్రేటూ, పోలీసు అధికారులూ, డిటెక్టివ్ శిరీష్ సమావేశమయ్యారు. పనివాళ్ళు పారలతో ముందుకు వచ్చారు.

పారలు సమాధిమీద త్రవ్వకం మొదలు పెట్టాయి.

2

క్రయిమ్‌బ్రాంచ్ యిన్‌స్పెక్టర్ కుమార్ చిరాకుగా చూశాడు.

"ఎక్కడ జరిగింది?" అడిగాడు కుమార్.

సార్జెంట్ చెప్పాడు.

"ఎస్. ఐ. ని తీసుకువెళ్ళు! ఫోటోలు తీయించు! వ్రేలి ముద్రలూ...."

"ఎస్. ఐ. గారు లేరు సార్!"

"ఏం? ఎక్కడికి వెళ్ళారు?"

"రామానందం సమాధిని తెరిపించడానికి.... వెళ్ళారు సార్!"

"నాన్సెన్స్.... పద.... జీపును సిద్ధం చెయ్యి. టెక్నికల్ యూనిట్‌ను కూడా...."

'బతుకు జీవుడా' నిట్టూర్చి సార్జెంట్ వెళ్ళిపోయాడు.

సరస్వతీ జంక్షన్ దాటి నాలుగో వీధి మొదటి యింటి ముందు జీపు ఆగింది. ఇన్‌స్పెక్టర్ కుమార్, అతడి వెనుక సిబ్బందీ యింట్లోకి నడిచారు.

ఒక యువకుడు జనాన్ని తప్పించుకుంటూ ముందుకు వచ్చాడు.

ఇన్‌స్పెక్టర్‌కి శాల్యూట్ కొట్టి "నేనే సార్! మీకు ఫోన్ చేసింది" అన్నాడతడు.

కుమార్ తల వూపి "మీ రెవరు?" అన్నాడు.

"చనిపోయినావిడ మా అమ్మే సార్!"

"మీ పేరు!"

"ప్రదీప్!"

"ప్రదీప్! మీ అమ్మగారి పద్దకు తీసుకు వెళ్ళండి!"

ప్రదీప్ దారి తీశాడు.

బెడ్ రూం గుమ్మంలో ఆగాడు ప్రదీప్. గుమ్మంలోంచి ఆమె కనిపిస్తోంది. ఉరి తాడుతో వ్రేలాడుతోంది. రెండు చేతులూ సడుముకు అటూ యిటూ అంటిపెట్టుకుని వున్నాయి. కాళ్ళు నేలకు రెండడుగుల ఎత్తున వ్రేళ్ళు క్రిందికి దిగి ఏటవాలుగా వొంగి వున్నాయి.

కుమార్ పైకి చూశాడు.

నడి వయసులో వున్నదామె. జుత్తులో అక్కడక్కడా బంగారు తీగల్లాగా తెల్లవెంట్రుక లున్నాయి. లావుపాటి స్త్రీ. బాధ ఆమె మొహంలో ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. నాలుక వెలికి వచ్చి వుంది. బాధపడి బాధపడి తన బాధకో పరిష్కారం లభించినట్టు ఆమె నిశ్చింతగా కొబ్బరి తాడుకు వ్రేలాడుతోంది.

గదిమధ్య సరంబీ దూలానికి కొబ్బరితాడు బిగించి వుంది. తాడు బరువుగా వ్రేలాడుతూ తెగిపోతుందా అన్నట్టుగా ఉంది.

"ఏం జరిగిందో చెప్పండి ప్రదీప్?" అడిగాడు ఇన్ స్పెక్టర్ కుమార్.

"నేను నిన్ననే బోర్డర్ సెక్యూరిటీఫోర్స్ నుండి రిటైరయి వచ్చాను సార్! నిన్న నేను యింటికి వచ్చిన సంతోషంతో మా అమ్మ వుక్కిరి బిక్కిరయింది. రాత్రి ఎవరెవరో వచ్చారు. అందరూ వెళ్ళిపోయాక నాతో అంది.

"నాకు పిచ్చి కలలు వస్తున్నాయి ప్రదీప్! ఏమిటో భయంగా వుంది" అని.

"పిచ్చి కలలా? ఏమిటమ్మా?" అన్నాను.

"నేను చచ్చిపోయినట్టు."

నేను తేలికగా నవ్వి, "చచ్చిపోయినట్టు వస్తే శుభ మంటారు!" అన్నాను!

మా అమ్మ మాట్లాడలేదు.

రాత్రి నేను కరువుతీరా నిద్రపోయాను. ఉదయం కూడా ఆమెలో ఎలాంటి దుఃఖంగానీ ఆవేశంగానీ కనిపించలేదు.

మధ్యాహ్నం నేను స్నేహితుల యిళ్ళకు వెళ్ళి వచ్చాను.

ఇంటి తలుపులు దగ్గరగా వేసివున్నాయి. మా అమ్మను పిలుస్తూ లోపలికి వెళ్ళాను. గదిలో కనిపించిన దృశ్యం యిది! ఎదురుగా సినీమా కంపెనీవాళ్ళ ఫోన్‌లో మీకు విషయం తెలియపరచాను."

సాంకేతిక సిబ్బందికి సైగచేశాడు కుమార్.

గదిలో వ్రేలిముద్రలుపడే అవకాశంవున్న ప్రాంతాల్లో వేట ప్రారంభమయింది. శవానికి కొద్దిదూరంలో తిరగబడిన స్టూల్‌వుంది.

ఫోటోగ్రాఫర్ శవాన్ని రకరకాల కోణాల్లో కెమేరాలో బంధిస్తున్నాడు.

"ప్రదీప్! చుట్టుప్రక్కల ఎవరయినా మీ అమ్మగారి గురించి-అన్నట్టు మీ అమ్మగారిపేరు?"

"శాంతమ్మ."

"శాంతమ్మగారి గురించి ఎవరయినా చెబుతారని వూహిస్తున్నారా? వుంటే వాళ్ళని పిలిపించాలి ప్రదీప్!"

ప్రదీప్ అక్కడచేరిన జనాన్ని చూచి, పెదిమ విరిచాడు. "అడిగాను సార్! నేను బయటికి ఉదయం తొమ్మిదింటికి వెళ్ళాక మా అమ్మను ఎవరూ చూడలేదట! మీరు ప్రశ్నిస్తానంటే ఏర్పాటుచేస్తాను సర్!" అన్నాడు.

కుమార్ తలవూపాడు.

ఇరుగుపొరుగువారిని పిలిపించాడు ప్రదీప్.

అతడి మాటే నిజమయింది. శాంతమ్మను ఉదయం తొమ్మిది తర్వాత చూడటం శవంగా మారాకనే! ప్రదీప్ మాత్రం మధ్యాహ్నం రెండింటికి చూశాడట. తల్లి శవంగా మారడం గురించి అతడు వాళ్ళను అడిగాడట. తరువాతనే దుఃఖం అణుచుకొంటూ ఫోన్‌కోసం పరుగెత్తాడట.

శాంతమ్మ శవాన్ని అంబులెన్స్‌లో ఎక్కించారు.

"మా అమ్మ ఆత్మహత్య చేసుకున్నదంటారా?" అడిగాడు ప్రదీప్.

కుమార్ అతడిని రెప్పవాల్చకుండా చూచి, "స్టూలు మీద శాంతమ్మ కాలిముద్రలున్నాయి. ఆత్మహత్యకుపయోగించిన తాడు ఎక్కడిది? ఆమె ఆత్మహత్యకు పాల్పడటానికి బలమైన కారణం ఏమిటి? యీ విషయాలు యింకా తెలియాలసివుంది?" అన్నాడు.

ప్రదీప్ నీరసంగా తలవూపాడు.

"మీ నాన్నగారు—?"

"రెండేళ్ళయింది సార్ ఆయన పోయి."

"కాని...."

"మా అమ్మను పుణ్యస్త్రీ చిహ్నాలను వదలిపెట్టవద్దని మానాన్న చెప్పారట సార్!"

కుమార్ తలవూపి, "రేపు ఒక్కసారి ఫోర్‌టవున్ పోలీస్ స్టేషన్‌కి రండి! మీచేత సంతకాలు చేయించుకుని మార్చ్యురీకి పంపిస్తాను. మీ అమ్మగారి శవాన్ని ఒప్పచెప్తారు!" అన్నాడు.

ప్రదీప్ కళ్ళనీళ్ళతో అటే చూస్తూండిపోయాడు.

కుమార్ స్టేషన్‌కి వెళ్ళేసరికి అక్కడ డిటెక్టివ్ శిరీష్ కాచుకున్నాడు.

"మీరెళ్ళిన సమాధి ఏమంటోంది!" అడిగాడు కుమార్ నవ్వుతూ.

"సమాధి క్షేమం. శవంకూడా క్షేమం!" అన్నాడు శిరీష్.

"అయితే ఎందుకు మా ప్రాణాలు తోడేశారు? ఒక ప్రక్క నగరంలో శవాలు తాండవం చేస్తున్నాయి. ఇక సమాధులలోని శవాలుకూడా...." కుమార్ నోరు కట్టు పడిపోయింది.

శిరీష్ చేతిలో కేబినెట్ సైజులో ఫోటోకాగితంవుంది. కాగితంలో కత్తి ఫోటోగ్రాఫ్‌వుంది.

"ఆరంగుళాల పొడవు రెండంగుళాల వెడల్పువున్న దంతపుకత్తి! విలువైన వజ్రాలు పొదిగిన కత్తి!" అని శిరీష్ రెండో ఫోటోగ్రాఫ్ తీసి చూపించాడు.

ఫోటోగ్రాఫ్‌లో తెల్లటి చర్మంమీద కత్తిముద్రవుంది.

"ఏమిటిది?" అడిగాడు కుమార్ తెల్లబోయి.

"ఈకత్తి అక్తర్ మ్యూజియంలోనిది. బంగ్లాదేశ్‌లో వున్న ఒకే ఒక్క మ్యూజియం అక్తర్ మ్యూజియం. ఆ మ్యూజియంనుండి పదేళ్ళ క్రితం దీన్ని ఎవరో అపహరించారు. ఆ కత్తిముద్ర శవం వెనుక అచ్చుపడి వుంది.

కరుణాకర్ తండ్రి రామానందం శవంమీదకు ఆ ముద్ర ఎలా వచ్చింది? కత్తిని శవంకింద దాచారా? ఎవరు దాచారు? కత్తిని శవంకింద దాచి మరల దానికోసమే రహస్యంగా సమాధిని తెరిచారా? కత్తిని ఎవరు దాచారు?" అన్నాడు డిటెక్టివ్ శిరీష్.

కుమార్ యింకా తేరుకోలేదు. సమాధి తెరవడం వెనుక యింత గూడుపుఠాణీ వుందా? ఒకప్రక్క శాంతమ్మ చావు ఒకటి తన ప్రాణంమీదకు వచ్చింది. కుమార్

క్రమంగా తెప్పరిల్లాడు.

"కరుణాకర్ ఏమంటాడు?" అడిగాడు కుమార్.

"ఏమంటాడు? తనకు తెలియదంటాడు!"

"శవంకింద అతడికి తెలియకుండా కత్తిని దాచడం ఎలా సాధ్యం? చనిపోయాకనే కత్తి దాచివుంటారు. అంత వరకూ నిర్ధారణేకదా! రామానందం చచ్చిపోయాక శవానికి అంతిమ సంస్కారం చేస్తారుకదా! పైగా శవం ఒక రాత్రంతా వుంచేశారు కూడా! వాళ్ళు హిందువులే కదా! మతాచారం ప్రకారంగా శవానికి స్నానం చేయించడం - దుస్తులు మార్చడం...."

"తెలుసుకున్నాను. రామానందంకి అలాంటి ఆచారాలు యిష్టం వుండవట! తండ్రి మాటప్రకారం ఎలావున్న శవాన్ని అలాగే సమాధి చేశారట. అసలు కొడుకు దహన సంస్కారం చేయాలనుకున్నాడట. రామానందం ఎలా పసికట్టాడో అతడి వుద్దేశ్యం మార్చాడట."

"చిత్రంగావుంది. ఇంతాచూస్తే రామానందమే కత్తిని తన వీపుక్రింద దాచుకుని అలాగే సమాధి అయిపోయాడేమో!"

శిరీష్ నవ్వి, "ఎందుకు?" అన్నాడు.

"ఎందుకో మనకు చెప్పి చచ్చాడా?"

"రామానందం కత్తిని సంపాదించివుంటే దాన్ని తన తర్వాత కొడుకుకు అందించాలని చూస్తాడు. అంతేకాని తనతోపాటు సమాధికావాలని కోరుకోడు."

"రామానందం సహజంగా మరణించాడా?"

"అవుననుకుంటాను. శవంమీద ఎలాంటి గాయమూ లేదు. కత్తి ముద్రపడిన అచ్చు తప్ప!"

"మ్యూజియంలో పోయిన కత్తీ యీ ముద్రవేసిన

కత్తి ఒకచేనని నీకు ఎలా తెలిసింది?"

"ఈమధ్య యీ కత్తి గురించి యింగ్లీషు పత్రికలో వ్యాసం వచ్చింది. వెంటనే ఆ ఫోటోని శవంమీది కత్తి ముద్రతో పోల్చాను."

తరువాత కుమార్ వివరంగా శాంతమ్మ చావు గురించి చెప్పాడు.

డిటెక్టివ్ శిరీష్ తలపంకించాడు.

"కరుణాకర్ ప్రదీప్ ఒక వయసువాళ్ళు. ఒకరికి తండ్రి సహజమరణం పొందితే మరొకరికి తల్లి అసహజంగా మరణించింది. అదీ మూడు రోజులతేడాలో!" అన్నాడు డిటెక్టివ్ శిరష్.

"అవును. రామానందం శవాన్ని పూడ్చిపెట్టారా?"

"లేదు. పోస్టుమార్టం చేయించమని మేజిస్ట్రేట్ ఉత్తర్వు యిచ్చారు!"

3

కరుణాకర్ వెనక్కి వెనక్కి చూసుకుంటూ సరస్వతీ జంక్షన్ దాటాడు. అతడి ఎక్కడా షర్వామీద గళ్ళ చొక్కా వేసుకున్న ముసలతను కనిపించలేదు. కరుణాకర్ యింట్లోంచి బయల్దేరినప్పటినుంచి ఆ ముసలతను వెంటాడాడు.

ముసలతను కావాలని వెంటాడాడా? కేవలం కాకతాళీయమా?

ప్రదీప్ యింట్లో దొరికాడు.

ప్రదీప్ వెల్లకితలా మంచంమీద పడుకుని ఆలోచిస్తున్నాడు. అడుగుల చప్పుడు విని తలతిప్పిచూశాడు.

"రా కరుణాకర్! ఏమయింది? ఎవరు సమాధిని తవ్వారో తెలిసిందా?" అడిగాడు ప్రదీప్.

కరుణాకర్ తల అడ్డంతిప్పి, "తెలియలేదు. అనవసరంగా డిటెక్టివ్ సహాయం కోరినట్టున్నాను. తీరాచూస్తే కోతిపుండు బ్రహ్మరాక్షసి అయ్యేలాగావుంది" అన్నాడు.

"ఏం? ఏమయింది?"

"ఏం కావడం ఏమిటి? ఏదో మ్యూజియంలో పోయిన కత్తి అట! నాన్నగారి ఒంటిమీద ముద్రపడిందట! ఏమిటో అంతా అగమ్యం."

"కత్తా? ముద్రా?" నోరావులించాడు ప్రదీప్.

"సరేలే! మీ అమ్మగారి విషయం ఏం తెలిసింది?"

"మా అమ్మకు ముక్కులో రక్తనాళాలు చిట్లాయట. వూపిరితిత్తులలో గుడపోగులు కనిపించాయట. ఉరివలన ప్రాణాలు పోకముందే ఎవరో తలగడతో అమ్మ మొహం మీద అదిమి చంపి వుంటారని పోలీసుల అభిప్రాయం!"

"చచ్చాం నువ్వో కొత్తకేసులో యిరుక్కున్నావన్నమాట!"

తలుపుమీద టకటక చప్పుడయింది.

ఇద్దరూ వులిక్కిపడి అటు చూశారు.

గుమ్మంలోవున్న వ్యక్తిని చూడగానే కరుణాకర్ నిగ్రహించుకున్నాడు.

"రండి సార్!" అని ముందుకు కదిలాడు.

డిటెక్టివ్ శిరీష్ నవ్వుతూ వాళ్ళవద్దకు వచ్చాడు.

ప్రదీప్‌ను డిటెక్టివ్‌కు పరిచయం చేశాడు కరుణాకర్.

శిరీష్ యిద్దరినీ పరిశీలనగా చూచి, "మిస్టర్ ప్రదీప్! మీకు జరిగిన నష్టానికి చింతిస్తున్నాను" అన్నాడు.

ప్రదీప్ కళ్ళు తడిశాయి.

"మీరు బి. ఎస్. ఎఫ్‌నుండి ఎప్పుడు రిటైరయి వచ్చారు?"

"మార్చి 11 న యిక్కడికి వచ్చాను సార్!" అన్నాడు ప్రదీప్.

"రావడంకాదు. రిటైర్ కావడం!"

"ఫిబ్రవరి 28 సార్!"

"సరిహద్దునుండి ఎప్పుడు బయల్దేరారు?"

"మార్చి ఒకటి సార్!"

"మీరు మార్చి 11 వరకూ యిక్కడికి రాకపోవడానికి వేరే కారణం ఏమైనా వుందా మిస్టర్ ప్రదీప్?"

"హౌరాలో మా స్నేహితులు అపారు సార్!"

"ఎవరా స్నేహితులు?"

"సరిహద్దు భద్రతాదళంలో నాతోబాటు రిటైరయిన వాళ్ళు సార్!"

"హౌరా నుండి ఎప్పుడు బయలుదేరారు?"

"మార్చి తొమ్మిది సార్!"

"అలా అయితే మార్చి 10 కి యిక్కడికి వచ్చెయ్యవచ్చును."

"అవును సార్! మధ్యలో విజయనగరం ఒక రాత్రి ఆగాను."

"ఎందుకు?"

"అతడు సంశయించి. "నేను పెళ్ళి చేసుకోవాలనుకున్న అమ్మాయి అక్కడే వుంది సార్! కనిపించి రావాలనిపించింది!" అన్నాడు.

"బంగ్లా సరిహద్దుల మీరెంతకాలం పాటు పని చేశారు?"

"ఏడు సంవత్సరాలు సార్! అన్నట్టు యీ ప్రశ్నలన్నీ ఎందుకడుగుతున్నారు సార్!"

"ఊరకనే. కేవలం జనరల్ యింటరెస్ట్! చిన్నవయసు

తోనే దేశానికి సేవచేసి తిరిగివచ్చారు!"

ప్రదీప్ మొహం కళకళ లాడింది.

"మీ అమ్మగారిని ఎవరో హత్య చేసినట్టు పోలీసులు అభిప్రాయపడుతున్నారు. మీ ఉద్దేశ్యం ఏమిటి?" అడిగాడు శిరీష్.

"నా వుద్దేశ్యమా సార్! మా అమ్మకు శత్రువులు లేరు సార్! పైగా మా అమ్మ బయటికి వెళ్ళదు సార్! ఎవరితోనూ ఘర్షణ పడే అవకాశం కూడా వుండదు సార్!" అన్నాడు ప్రదీప్.

డిటెక్టివ్ శిరీష్ మరో రెండు మూడు ప్రశ్నలు వేసి కరుణాకర్ వైపు చూచి బయటికి వెళ్ళిపోయాడు.

"ఆయనెందుకు వచ్చినట్టు?" అన్నాడు ప్రదీప్.

"నన్ను వెంటాడుతూ వచ్చివుంటారు. అనవసరంగా కదిపాను. మా నాన్నగారి సమాధిని ఎవరు తెరిస్తే ఎందుకని వూరుకోవలసింది ప్రదీప్! దంతపు కత్తి విషయంలో ఆయన నన్ను అనుమానిస్తున్నారు!"

ప్రదీప్ నిట్టూర్చాడు.

4

డిటెక్టివ్ శిరీష్ అతడిని రెప్పవాల్చకుండా చూశాడు. పశువులను కాచుకునే కుర్రవాడు.

"నువ్వు ఈ ఫోటోను గుర్తుపట్టావా?" అడిగాడు శిరీష్. అతడి చేతిలో పాతికేళ్ళ యువకుడి ఫోటో వుంది.

"గుర్తుపట్టాను అయ్యగారూ!...." అన్నాడు కుర్రవాడు.

"ఇతడిని యెక్కడ చూశావు? ఎప్పుడు చూశావు?"

"పదకొండో తారీకు ఉదయం ఒకసారీ, మర్నాడు మరోసారీ చూశాను సార్!"

"అతడు అక్కడ యేం చేస్తున్నాడో చెప్పగలవా?"

"ఏమీ చెయ్యలేదు సార్! చూచుకుని వెళ్ళిపోయేవాడు సార్!"

శిరీష్ తలవూపి కుర్రవాడిని పంపించేశాడు. ప్రక్క గదిలోకి వెళ్ళాడు. ఆ గదిలో ఒక ముస్లిమ్ కూర్చుండి వున్నాడు.

"కుర్రవాడి మాటలు విన్నారుకదా....!" అడిగాడు శిరీష్.

ముస్లిమ్ తలవూపాడు. వయసుమళ్ళిన ముస్లిమ్ అతడు. షర్వామీద గళ్ళచొక్కా వేసుకున్నాడు. పీచులాంటి గడ్డం, సున్నగా గొరిగిన మీసకట్టు, తలమీద కుర్తా.

"అతడికి దంతపు కత్తిని ఎందుకు అమ్మారు?" అడిగాడు శిరీష్.

"ఆ కత్తి విలువ నాకు తెలియదు సార్! ఎవరో నాకు అమ్మారు. నాకు డబ్బు అవసరం వచ్చి ఆ కత్తి అతడికి అమ్మాను. అమ్మిన తర్వాత తెలిసింది. ఆ కత్తి మ్యూజియంలో ఎత్తుకు వచ్చిన కత్తి అని. నా దేశానికి నేను అన్యాయం చేశాను. మా మతగురువు వాడిన కత్తి అది. దాన్ని గుర్తించలేక పొరపాటు చేశాను. ఇప్పుడు ఆ కత్తి సంపాదించి తిరిగి యిచ్చి నా తప్పు సవరించుకుంటాను" అన్నాడు ముస్లిమ్.

శిరీష్ తల వూపి, "శవం క్రింద కత్తిని దాచడం ఏమిటి? కేసలం తప్పించడానికా? దాచివుంచినవాడు సమాధిలోకి శవం వెళ్ళిపోయేవరకూ ఏం చేస్తున్నాడు?" అన్నాడు.

"కత్తిని శవం కింద - హిందువు శవంకింద వుంచితే యిక దానిని గురించి పట్టించుకోనని అతడనుకుని వుంటాడు."

"మార్చి 10 రాత్రి మీరు అతడిని వెంటాడారు. రామానందం యింట్లోకి వెళ్ళి అతడు మాయమయ్యాడు. రామానందం శవం చుట్టూ చేరిన జనంలో అతడు కలసి పోయాడు. కాని శాంతమ్మ ఎలా మరణించింది? మీరు ఆ యింటి మీద నిఘా వేశారు కదా! మీకు కూడా ఆమె మరణం విషయంలో అనుమానితులు ఎవరో తెలియదా?"

"తెలియదు సార్! తొమ్మిదింటికి ప్రదీప్ ఆ యింట్లోంచి బయటపడ్డాడు. నేను అతడిని వెంబడించాను. అతడిపద్ద నయానో భయానో దంతపు కత్తిని తిరిగి తీసు కుని వెళ్ళిపోవాలి. ఎందుకంటే నాకు యీ దేశంలో వుండ టానికి అనుమతి లేదు! నా బలహీనత అతడికి తెలుసు! ఎలా కారం కొట్టకలిగాడో నా కళ్ళలో కారం కొట్టి అతడు పరారై పోయాడు."

"అతడి తిరిగి ఎన్ని గంటలకు చూశారు?"

"మధ్యాహ్నం రెండు తర్వాత, కంగారుగా ఎదుటి ఫిలిం ఆఫీస్‌కి పరుగెత్తుతున్నాడు. శాంతమ్మ చనిపోయి నట్టు అప్పుడే తెలిసింది."

"ప్రదీప్ యింట్లో లేనప్పుడు మీరు యింట్లో ప్రవే శించలేదా?"

"లేదు సార్! అయినా కత్తిని యింట్లో వుంచు తాడా? నాకు తెలియక అతడికి అమ్మేశాను కాని....రెండు లక్షల రూపాయిల విలువ చేస్తుంది ఆ కత్తి."

"కత్తి ఎక్కడ దాచుంటాడు?"

"తెలియదు సార్!"

బల్లమీది టెలిఫోన్ గణగణ మ్రోగింది.

అవతల చెప్పేది పూర్తిగా విన్నాడు డిటెక్టివ్ శిరీష్. తరువాత రిసీవర్ క్రెడిల్ మీద వుంచాడు. ముస్లిమ్ వైపు

తిరిగాడు.

"మీ వ్రేలిముద్రలు తీసుకోనిస్తారా ఒకసారి?" అన్నాడు.

ముస్లిమ్ తెల్లబోయి చూశాడు.

"సార్!" అన్నాడు. అతడి ఒళ్ళంతా చెమటలుపట్టింది.

"మీరు ప్రదీప్ లేనప్పుడు యింట్లో ప్రవేశించారు. పోలీసులు మీ విషయం ఆరా తీశారు!"

"మాఫ్ కీజియే! నేను శాంతమ్మగారిని చంపలేదు."

"ఆ విషయం నిర్ధారించవలసింది తరువాత. మీరు ఉదాయం పదకొండూ ఒంటిగంట మధ్య ఆ యింట్లో గడిపారు! అవునా?"

ముస్లిమ్ మొహంలో కత్తివాటుకు నెత్తురుచుక్క లేదు.

"దంతం కత్తికోసం ఆ యింట్లోకి వెళ్ళాను సార్! అప్పటికే శాంతమ్మగారు చచ్చిపోయి వుంది. నన్ను నమ్మండి!"

"మీరు రెండు గంటలపాటు ఆ యింట్లో ఏంచేశారు?"

అతడు తల దించుకుని, "కత్తి గురించి వెతికాను!" అన్నాడు.

"రండి! మనం పోలీస్‌స్టేషన్‌కి వెళ్లాం!" అన్నాడు శిరీష్.

5

హౌరా వెళ్ళే విమానం రన్ వే మీద ఆగింది.

సెక్యూరిటీ అధికారులు తణిఖీ చేసి మరీ ప్రయాణీకులను రన్‌వే మీదకు వదులుతున్నారు.

విమానంలో ఇంధనం నింపడం, ప్రయాణానికి అనువైన యితర కార్యక్రమాలు నిర్వహించడం చేస్తున్నారు ఎయిర్‌పోర్ట్ సిబ్బంది.

సెక్యూరిటీ అధికారులను దాటి అతడు ముందుకు

నడవబోయాడు.

అతడి భుజం మీద చెయ్యి పడింది.

అతడు వులిక్కిపడి ప్రక్కకు తిరిగాడు.

డిటెక్టివ్ శిరీష్!

అతడు బ్రీఫ్‌కేస్ ఎత్తిపట్టి శిరీష్ మీదకు విసిరాడు.

డిటెక్టివ్ శిరీష్ కాచుకుని బూటు కాలెత్తి బలంగా పంచ్ యిచ్చాడు.

"రాస్కెల్! తల్లిని చంపుకొన్నందుకు నిన్ను పచ్చడిగా తన్నినా పాపంలేదు. కత్తి ఎత్తుకువచ్చావు. శవం కింద దాచి ముస్లిమ్ దృష్టిని ప్రక్కదారి పట్టించావు. కత్తిని తిరిగి పొందేలోగా శవం సమాధిలోకి వెళ్ళిపోయింది. సమాధి తవ్వావు. నిన్ను పశువులకాపరి గుర్తుపట్టాడు.

ఆరోజు తొమ్మిది గంటలకు నువు బయటికి వెళ్ళినట్టు నమ్మించావు. తిరిగి పెరటిదారిన యింట్లో ప్రవేశించి తలగడతో అదిమిపెట్టి నీ తల్లిని చంపేశావ్! హౌరా వెళ్ళిపోయి అక్కడ జనంలో కలిసిపోయి బతుకుదామనుకున్నావ్! కత్తిని అమ్మి లక్షలు సంపాదించాలని దురాశ పడ్డావు! ఘాతుకంగా ప్రవర్తించావు!"

ప్రదీప్ కిందపడి మూలుగుతున్నాడు.

బ్రీఫ్‌కేస్ తెరచుకుంది.

దంతపుకత్తి మిలమిలలాడుతోంది.

"ఈ కత్తిని ముస్లిమ్‌కి యిచ్చెయ్యమంది మా అమ్మ. ఎంత చెప్పినా వినదు. అందుకే చంపేశాను. ముస్లిమ్ ఎటూ మా యింట్లో రహస్యంగా ప్రవేశిస్తాడని తెలుసు." వగరుస్తున్నాడు ప్రదీప్.

డిటెక్టివ్ శిరీష్ వంగి దంతపుకత్తి అందుకున్నాడు □

బి.వి.ఈశ్వర్

హేమాంతకులు

అన్నపూర్ణమ్మగారు బాల్కనీలో కూర్చుని దృష్టిని రోడ్డు పైకి సారించారు. అది గొప్పవాళ్ళు మాత్రమే ఉండే కాలనీ. పట్టపగలే నిర్మానుష్యంగా వుంటుంది.

అన్నపూర్ణమ్మగారు కూర్చున్న బంగ్లాకు పై అంతస్థూ వుంది. పైన ఖాళీ టెర్రస్. వాటర్ టాంక్ తప్ప మరేమి

లేవు. టెర్రస్ పైనుంచి క్రిందకు దిగడానికి మెట్లు వున్నాయి. అవి ఇంటిమధ్య నుంచి వుండడము వలన దానిని ఆ ఇంటివాళ్ళు వుపయోగిస్తారు.

ఓ వ్యక్తి నడుస్తూవచ్చి బంగళా ము దు ఆగాడు. ఒక నిముషము నిలబడి మరలా ముందుకు సాగిపోయాడు.

బాల్కనీలో వున్న అన్నపూర్ణమ్మగారి దృష్టి ఆ వ్యక్తిపై పడింది. కాని పెద్దగా పట్టించుకోలేదు.

అప్పుడు సమయం సాయంత్రం 6 గం॥ దాటుతుంది. కనుచీకటి పడుతుంది.

పదిహేను నిముషాల తరువాత మరలా అతను దేని కోసమో వెతుకుతున్నట్టు, అన్నపూర్ణమ్మగారి ఇంటిని కళ్ళు అప్పగించి ముందుకు వెళ్ళాడు.

అపుడు వచ్చింది అనుమానం, అన్నపూర్ణమ్మగారిలో. ఆమెకు ఏభై సంవత్సరాల వయసు వుంటుంది. ఎర్రటి శరీరంతో తెల్లగా నెరసిన వెంట్రుకలతో చేనేత చీరలో హుందాగా వుంటుంది.

ప్రముఖ లాయరు దివంగత లింగరాజుగారి భార్య ఆమె. అనుమానం జాస్తి.

ఆ వ్యక్తి విషయము తెలుసుకోవాలని నిర్ణయించు కుంది ఆమె. అందుకే చీకటిపడినా బాల్కనీ నుంచి లేవ లేదు.

ఆ వ్యక్తి మరలా వచ్చాడు. అన్నపూర్ణమ్మగారి వంక విసుగ్గా చూస్తూ నెమ్మదిగా అడుగులువేస్తూ ముందుకు వెళ్ళాడు.

అన్నపూర్ణమ్మగారు ఆలోచిస్తూన్నారు. ఈ వ్యక్తి ఇక్కడే ఎందుకు తిరుగుతున్నాడు. ఒకవేళ దొంగతనానికి గాని వచ్చాడా! రోడ్డు వంక చూసింది. ఎవరూ లేరు?

అసలు ఆ వ్యక్తి ఇక్కడ ఎందుకు తిరుగుతున్నాడో తెలుసుకోవాలంటే తను అతనికి కనిపించకుండా వుండాలి.

వెంటనే బాల్కనీ నుంచి లేచింది ఆమె. పై అంతస్థు లోనే వున్న తన గదిలోకి వెళ్ళింది. ఇంట్లో లైట్లు వెయ్యి లేదన్న విషయం కూడ ఆమె మరచిపోయింది.

సన్నగా కిటికీ రెక్క తెరచి ఆ వ్యక్తిని గమనించ సాగింది.

మున్సిపాలిటీ లైట్ల వెలుగులో ఆ వ్యక్తి క్లియర్‌గా అన్నపూర్ణమ్మగారికి కనిపిస్తున్నాడు.

సమయం రాత్రి 9 గం॥ దాటింది. ఆ వ్యక్తి అన్న పూర్ణమ్మగారి ఇంటిముందుకు వచ్చి బాల్కనీలోకి చూశాడు. అక్కడ ఎవరు లేకపోవడంతో గేటువరకు వచ్చి ఏదో తనిఖీ చేసుకుని తృప్తిగా నవ్వుకుంటూ ముందుకు సాగి పోయాడు.

ఒక్కసారిగా అన్నపూర్ణమ్మగారిని భయం చుట్టివేసింది. ఆమె కొడుకు, కోడలు పనిబడి బొంబాయి వెళ్ళారు. లంకంత కొంపకు ఆమె ఒక్కర్తే కాపలా. బీరువానిండా నగలు, నగదు ఆమెను మరీ భయపెడుతున్నాయి.

అరగంట పైనే గడిచింది. ఆ వ్యక్తి కనిపించలేదు. కొంచెము ధైర్యము వచ్చింది అన్నపూర్ణమ్మగారికి. క్రిందకు వెళ్ళి భోజనము చేసి వచ్చారు. కాని పైన లైట్లు మాత్రం వెలిగించలేదు.

మరలా ఎందుకైన మంచిదని తన బెడ్‌రూమ్ కిటికీ నుంచి రోడ్డువైపు చూసింది.

అంతే!—

ఆమె గుండె కొట్టుకోవడము మానివేసింది. ఆ వ్యక్తి

ట్యూబ్ లైటు మసక వెలుతురులో ఓ రాయిపై కూర్చుని ఇటే చూస్తున్నాడు.

2

సమయం రాత్రి పన్నెండు గంటలు దాటుతుంది. అన్నపూర్ణమ్మ ఓపికగా ఆ వ్యక్తినే గమనిస్తున్నారు. పోలీసు కంప్లైంట్ ఇద్దాము అంటే ఆ వ్యక్తి చేసిన నేరము ఇంత వరకూ ఏమీ లేదు.

ఆ వ్యక్తి అక్కడనుంచి లేచి, పాంటుకు అంటుకున్న మట్టి దులుపుకున్నాడు. చుట్టూ ఒకసారి పరీక్షించిచూశాడు. వీధంతా నిర్మానుష్యంగా వుంది.

నెమ్మదిగా అడుగులువేస్తూ అన్నపూర్ణమ్మగారి ఇంటి వైపు వచ్చాడు.

అన్నపూర్ణమ్మగారి గుండెలు భయంతో బిగుసుకు పోయాయి. ఆమెలో ఎన్నో ఆలోచనలు. వూరువెళ్ళిన కొడుకు-కోడలిని తిట్టుకుంది. తను ఒక్కతే కావడముతో ఆ దొంగకి ధైర్యము వచ్చింది.

అనవసరంగా పనిమనిషి రామయ్యని ఇంటికి పంపివేసి నందుకు తనను తనే నిందించుకుంది.

ఆ వ్యక్తి ఆ ఇంటి మెయిన్‌గేట్ సమిపించాడు. మరలా చుట్టూ ఒకసారి చూశాడు. రోడ్డుపైని లైట్ల వెలుగు ఆ వ్యక్తిపై పడుతూన్నది.

అతను నల్లగా, పొడవుగా. బలంగా వున్నాడు.

గేటును సమీపించి, తాళంవేసి వుండడముతో పైకి ఎక్కి ఇవతల ప్రక్కకు దూకాడు. ఒక్కక్షణం కదల కుండా అట్లనే వుండి చెట్లచాటుకు తప్పుకున్నాడు.

అన్నపూర్ణమ్మగారిలోని భయం విపరీత స్థాయికి చేరు కుంది. ఆమె గుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయి.

బ్లడ్ ప్రెషర్ స్థాయి పెరిగింది.

ఎలా తనను తను రక్షించుకోవాలి.

డబ్బు నగలు ఇవ్వమని అడుగుతాడేమో! ఇవ్వకపోతే చంపేస్తాడా? ఆమె ఆం చిస్తూనే ఆ వ్యక్తి చేష్టలు గమనిస్తోంది.

ఆ వ్యక్తి బంగ్లాలో వెలుగుతున్న లైటువంక చూస్తూ, బంగ్లా వెనుకవైపుకు నడిచాడు.

అన్నపూర్ణమ్మ బంగ్లా టెర్రస్ పైకి వెళ్ళింది. అక్కడ నుంచి ఆ వ్యక్తి చర్యలను గమనిస్తుంది.

ఆ వ్యక్తి వెనుకవైపు వున్న వాటర్ పైప్‌దగ్గర ఆగాడు. దానిని చేతులతో తడిమాడు. వెనుకవైపు వెలుగు లేకపోవడము వలన ఆ వ్యక్తి సరిగా క పించడములేదు.

అతని వుద్దేశ్యం అర్థం చేసుకుంది అన్నపూర్ణమ్మ. వాటర్ టాంక్ ద్వారా టెర్రస్ పైకి వచ్చి అక్కడ నుంచి మెట్లద్వారా మొదటి అంతస్థు కి వస్తాడు. అపుడు వచ్చే మొదటి గది తనదే.

ఆమె ఇక ఆలస్యము చెయ్యలేదు. గబగబ దిగి క్రిందకు వచ్చింది. హాల్లోకి వెళ్ళి టెలిఫోను నెంబరు త్రిప్పింది!

"సాయంత్రమే ఈ పని చెయ్యవలసింది" అని తనను తనే నిందించుకుంది.

ఆమె దురదృష్టవశాత్తు ఆ ఫోను రెండురోజుల్నించి పనిచెయ్యడము లేదనే విషయము ఆమెకు గుర్తురాలేదు. కొద్దిసేపు ప్రయత్నించి విసుగ్గా ఫోను క్రెడిల్ చేసి, మొదటి అంతస్తుల వి తన గదిలోకి వచ్చింది.

ఎర్రరంగు బెడ్‌లైటు రక్తాన్ని చిమ్ముతుంది ఆ

గదిలో. టెర్రస్‌పై అడుగుల చప్పుడు వినిపిస్తుంది.

అంటే అపుడే పైకి ఎక్కాడన్న మాట. ఆమె ఒక క్షణం ఏదో ఆలోచించింది!

గబగబ తన బెడ్‌పైని తలగడలను తీసి ఒకదాని క్రిందుగా ఒకటి మంచంపై పేర్చింది. ఫ్లవర్‌వాజ్ తెచ్చి తలదగ్గర (అది తల అనిపించే విధంగా) పెట్టి పైన రగ్గు కప్పివేసింది.

వేగంగా పనిముగించి, రూమ్ తలుపుదగ్గరకులాగి బయటకువచ్చి ఓ స్తంభానికి వెనుకగా కారిడార్‌లో నిలుచుంది.

అదృష్టవశాత్తు కారిడార్‌లో లైటు లేదు.

సెకన్లు భారంగా గడుస్తున్నాయి. ఆ వ్యక్తి ఒక్కొక్క అడుగు నెమ్మదిగా వేస్తూ మెట్లు దిగుతున్నాడు.

వూపిరి బిగపట్టి ఎదురుచూస్తుంది అన్నపూర్ణమ్మ.

ఆ వ్యక్తి ఆమెను దాటుకుంటూ ముందుకు వెళ్లాడు.

వూపిరి పీల్చుకోవడం కూడ మరచిపోయింది ఆమె.

దగ్గరగా చేరవేసివున్న తలుపుదగ్గరకు నడిచాడు అతను. తలుపుల ఖాళీ గుండా పడుతున్న ఎర్రటి వెలుగు అతని ముఖము పైపడి క్రూరంగా పరావర్తనము చెందుతుంది.

ఆ వ్యక్తి నెమ్మదిగా తలుపునెట్టాడు. అడుగులో అడుగు వేసుకుంటూ మంచమువైపు నడిచాడు.

అతనిలో విపరీతమైన టెన్షన్ వుంది ఆ క్షణంలో.

మంచమువైపు కదులుతున్న అతని కదలికను చూసి, అతను హత్య చేయడానికే వచ్చాడు అని ఓ నిర్ణయానికి వచ్చేసింది అన్నపూర్ణమ్మ.

అతను మంచము దగ్గరకు నడిచి నవ్వాడు నెమ్మదిగా. జేబులో చెయ్యిపెట్టాడు.

భయంతో అర్చుకుపోయింది అన్నపూర్ణమ్మగారి

గొంతు - ఎంత గండం తప్పింది అనుకుంటూ

వేగంగా అక్కడ నుంచి లేచి అదే స్పీడుతో అతను వున్న గది ముందు ఆగి, అతను ఏమి చేస్తున్నాడో కూడ గమనించకుండా, తలుపులు వేగంగా దగ్గరకు లాగి, అదే వేగంతో బోల్టు వేసింది.

ఆ చప్పుడుకు వెనక్కు తిరిగిన అతను స్టన్ అయ్యాడు. వెంటనే మంచముపై కప్పుకుని వున్న రగ్గుని లాగి మరింత ఆశ్చర్యపోయాడు.

అపుడు మొదటిసారిగా అతనికి భయం వేసింది.

బోల్టువేసి వూపిరి పీల్చుకుంది అన్నపూర్ణమ్మ.

అతను లో నుంచి తలుపు బాదుతున్నాడు. ఆ దెబ్బలకి ఆ తలుపులు ఏ క్షణంలో అయినా వూడిపోవచ్చు.

3

అన్నపూర్ణమ్మ గబగబ మెట్లు దిగి క్రిందికి వచ్చింది.

పై నుంచి తలుపు బాదుతున్న చప్పుడు, అరుపులు వినిపిస్తున్నాయి. కాని అవి ఆమె పెద్దగా పట్టించుకోలేదు.

ఆమెకు ఇపుడు ఒకటే ఆలోచన. ఎట్లా పోలీసులకు కబురుచెయ్యాలి.

తాళంతీసి చప్పుడు కాకుండా గేట్ తీసింది. ప్రక్కింటికి వెళ్ళి వనజను లేపింది. జరిగింది చెప్పింది.

వనజ కంగారుపడుతూ భర్తను లేపి, పోలీసు స్టేషనుకు పంపింది. ఇద్దరు హడావిడిగా అన్నపూర్ణమ్మ గారి ఇంటికి చేరారు.

గదిలోని వ్యక్తి తలుపును పగలగొట్టడానికి ప్రయత్నిస్తున్నాడు. తలుపు విరిగిపోతుందేమో అన్న అనుమానం ఇద్దర్నీ ఆవహించింది.

"పిన్నిగారూ మా ఇంట్లో డమ్మీ పిస్టల్ వుంది.

తీసుకు వస్తాను వుండండి" అంటూనే వేగంగా క్రిందికి దిగి తన ఇంటివైపు వెళ్ళింది.

ఆ వ్యక్తి వున్న గది తలుపు "ఫట్"మంది.

అన్నపూర్ణమ్మగారి గుండె ఆగినంత పనైంది. కాని తలుపు విరగలేదు. గుమ్మం వెనుకగా తలుపులు వుండడమువలన, లోనించి తలుపులను పగుల గొట్టాలని ప్రయత్నిస్తున్న కారణంగా, తలుపులు తొందరగా విరిగే అవకాశము లేదు.

అన్నపూర్ణమ్మగారిలో ఓ ఆలోచన మెదిలింది. వెంటనే దానిని ఆచరణలో పెట్టింది

పచ్చడి రుబ్బుకునే "బండ" ఒక్కటి పట్టుకుని తలుపుకు ప్రక్కగా నిలబడింది. ఆ వ్యక్తి బయటకు వస్తే, లేడిపైకి దుమికే సింహంగిలా.

కాని—ఈ లోపుగానే పోలీసులు వచ్చారు.

తలుపులు తెరచి ఆ వ్యక్తిని పట్టుకున్నారు.

అతను భయపడుతూ, యస్.ఐ.కి తన జేబునుంచి తీసి ఓ ఉత్తరం ఇచ్చాడు.

"డార్లింగ్,

నాపై నీకు మోజువుందని తెలుసు, నువ్వూనా నాకు ఇష్టమే. కాని ఐ లవ్ ఎడ్వంచర్స్. నా యింటి నెంబరు దిగువ ఇస్తున్నాను. నా భర్త రేపు రాత్రి వూరిలో వుండడు. మేడపై గదిలో వుంటాను. నా గదిలో లైటు వేసి వుంటుంది. గేటు వెయ్యకుండా తలుపులు తట్టకుండా, మెట్లు ఎక్కకుండా నా గదిలో కి రా: H.No.7-1-27/3, గ్రీన్‌లాండ్స్.

పి

—డార్లింగ్."

"ఎవరు ఇచ్చారు నీకు ఈ ఉత్తరం" యస్.ఐ. గద్దించాడు.

"వనజ" నసుగుతూ చెప్పాడు.

"వనజ ఎవరండి" గౌరవంగా అడిగాడు యస్.ఐ. అన్నపూర్ణమ్మగారిని.

"మా ఇంట్లో ఎవరు లేరు" అంటూ అపుడే వస్తున్న వనజను చూపి "ఈమె పేరు వనజ. మా ప్రక్కింటిలో ఉంటుంది."

ఆ వ్యక్తి ఆమెను చూసి, "ఈమే సార్" అని ఆత్రంగా అన్నాడు.

"వాట్ డుయూ మీన్" అంటూ కోపంగా మీదకు వచ్చాడు వనజ భర్త. యస్.ఐ. అతనిని ఆపి.

"తొందరపడకండి సార్, అమ్మా, ఈ రాస్కెల్ నీకు తెలుసా."

"నాకు తెలియదండి" చాలా అమాయకంగా వుంది వనజ గొంతు.

"ఇది చాలా అన్యాయం. ఈ ఉత్తరం ఇచ్చింది ఈమె. కావలిస్తే రైటింగ్ పరీక్షించి చూడండి" ఉక్రోషంగా వున్నాయి ఆ వ్యక్తి మాటలు.

అన్నపూర్ణమ్మగారికి ఇదేమీ అర్థంకాక తెల్లబోయి చూస్తున్నారు.

"సార్ ఇక నేను సహించను, ఇతను నా కాపరం చెడగొట్టేలా వున్నాడు. కావలిస్తే నా రైటింగ్ చెక్ చెయ్యండి" ఆవేశంగా అంది వనజ.

"నేను ఎడ్రసు ఇస్తే నా యింటి అడ్రసు ఇవ్వక ప్రక్క ఇంటి అడ్రసు ఎందుకు ఇస్తాను. ఇతను ఏదో పెద్ద ప్లాను మీద వచ్చాడు" కోపం ఇంకా తగ్గకపోవడం

వలన ఆమె మాటలు తడబడుతున్నాయి.

"అవును బాబు, మా అబ్బాయి, అమ్మాయి లేనిరోజే వచ్చాడంటే వీడు ఏదో దేవాంతకుడు" అన్నపూర్ణమ్మ గారు వనజను సపోర్ట్ చేశారు.

"లేదు సార్, ఇది వనజ మోసం" గట్టిగా అరిచాడు ఆ వ్యక్తి.

హెడ్ కానిస్టేబుల్ లాటీ ఆ వ్యక్తి భుజంపై బలంగా తగిలింది. ఆ వ్యక్తి గుర్రుగా చూశాడు!

ఈ లోపుగా యస్.ఐ. చెప్పింది వ్రాసింది వనజ!

అసలు ఆ ఉత్తరంలోని దస్తూరికి వనజ దస్తూరికి సంబంధము లేకపోవడముతో, యస్.ఐ.లో అనుమానం ఆ వ్యక్తిపై మరింత పెరిగింది.

"ఏరా, నిజంచెప్పు. నీవు ఈ ఇంటికి దొంగతనానికేగా వచ్చావు" గుర్రుగా చూస్తూ అడిగాడు యస్.ఐ.

"లేదు, సార్, ఆమె రమ్మంటేనే వచ్చాను."

"మరి ఆ ఇంటికి ఎందుకు వెళ్ళలేదు."

"దొంగ అడ్రసు ఇచ్చింది" బోనులో పెట్టిన పులిలా గుర్రుమన్నాడు ఆ వ్యక్తి.

"చూడండి సార్. వాడేదో పెద్ద ప్లాను వేశాడు. ముందు జాగ్రత్త కోసం ఆ ఉత్తరం అలా సృష్టించాడు. మళ్ళీ నా భార్యపై నింద వేస్తున్నాడు. వాడ్ని అరెస్టు చెయ్యండి. నేను స్టేట్‌మెంట్ ఇస్తాను" గంభీరంగా వున్నాయి వనజ భర్త మాటలు.

"వీడిచేత నిజం ఎలా చెప్పించాలో మాకు తెలుసు సార్, మీరేం వర్రీకాకండి" అంటూ ఆ వ్యక్తి మెడపై చెయ్యి వేసి బైటికి నెట్టాడు యస్.ఐ. అన్నపూర్ణమ్మ గారి వంక, వనజ వంక గుర్రుగా చూస్తూ పోలీసుల

వెంట నడిచాడు ఆ వ్యక్తి.

వనజ భర్తతోపాటు ఇంటికి నడిచింది.

ఎంత గండం తప్పిందో అనుకుంటూ కనిపించని దేవుళ్ళకు మొక్కుకుంటూ మంచంపై నడుంవాల్చింది అన్నపూర్ణమ్మగారు.

ఆమెకు ఏదో తెలియని గర్వం ఆవరించింది.

కాని అందరికి తెలియని విషయం, ఆ వ్యక్తి వనజకు తెలుసని, రోజు ఆఫీసునుంచి వచ్చేటప్పుడు బస్టాపులో వేధిస్తుంటే స్నేహితురాలితో కలసి వేసిన ప్లానని వనజకు మాత్రం తెలుసు.

కాని రాంగ్ ఇంటి నెంబరు, అన్నపూర్ణమ్మగారికొడుకు ఇంటిలో వుంటాడని మాత్రమే ఇచ్చింది.

ఆ వ్యక్తిని అరెస్టు చెయ్యించినందుకు వనజకు ఎంతో తృప్తిగా వుంది. తను బయటపడలేదు. అదే ఆమె కోరిక. ఆ వ్యక్తి జైలునుంచి రావడానికి ఏడాదిపైనే పట్టవచ్చు. అప్పటికి ట్రాన్స్‌ఫర్ చెయ్యించుకోవాలి అనుకొంది. □

క్రికెట్ పరుగు!

క్రికెట్లో మనవాళ్ళకు 'రన్' వచ్చినప్పుడల్లా టేబుల్-కుర్చీల మధ్య పరుగెత్తుతుంటారు పిన్నీ!

సీరియల్

కృతాంతకావతారం

వసుంధర

(గత సంచిక తరువాయి)

"ఆయన్ను నువ్వేమీ అనవద్దు. ఈమాత్రం శిక్ష లేకపోతే నాబోటిగాళ్ళు జాగ్రత్తగా వుండరు. నా పొరపాటుకు శిక్ష యిది...." అన్నాడు శ్రీకాంత్. అందు కతడు సామ్యం చెప్పాడు కూడా.

గ్యాస్‌వల్ల వంట సుఖమైంది. అజాగ్రత్తగా వుంటే గ్యాస్‌వల్ల చాలా ప్రమాదాలున్నాయి. అందుకు గ్యాసును తప్పుపట్టలేం!

శోభ అతడికింకా ఆశ్చర్యపడే విశేషాలు చెప్పింది.

శ్రీకాంత్‌కి కన్నబిడ్డలంటే ప్రాణం. వాళ్ళమీద ఈగ వాలినా సహించలేడు. కానీ అతడు ఇతర పిల్లల విషయంలో చాలా ఘోరంగా ప్రవర్తిస్తాడు. అతడికి భిక్షేశ్వర్ అనబడే వ్యక్తితో పరిచయముంది. వారిమధ్య కొన్ని వ్యవహారాలు శోభకు తెలుసు. శ్రీకాంత్ కార్య కలాపాల్లో పిల్లల్నెత్తుకుపోవడం, వాళ్ళను వికలాంగుల్ని చేయడం కూడా వున్నాయి. శ్రీకాంత్ ఊరు వదిలి టూర్ వెళ్ళాడంటే అది పిల్లల్నెత్తుకుపోవడానికే!

భిక్షేశ్వర్ ఓసారి ముద్దులు మూటగట్టే ఆరేళ్ళ కుర్రాడిని శ్రీకాంత్ కింట్లో అప్పగించాడు. ఓ రాత్రివేళ శ్రీకాంత్ ఆ కుర్రాడికి ఓకన్ను పోగొట్టాడు. వళ్ళంతా వాతలుపెట్టాడు. అనుకోకుండా శోభ ఆ దృశ్యం చూసింది. ఆమె కెవ్వున అరిచి మూర్ఛపోయింది. ఆమెకు జ్వరం వచ్చింది. అందుకు కారణం తెలిసిన శ్రీకాంత్ ఆ తర్వాతెప్పుడూ యింట్లో అలాంటి పనులు చేయలేదు.

తనకెంతో ప్రియమైన తండ్రి—ఇలాంటి దుర్మార్గుడు కావడం శోభకు బాధగా ఉంటుంది. ఇవన్నీ అతడు జగపతిరావుకోసం చేస్తున్నాడని ఆమెకు తెలుసు.

ఈ విషయం ఆమె తన ముఖ్యస్నేహితులకు కూడా చెప్పుకోదు.

"మరి నాకెలా చెప్పావ్?" అన్నాడు ప్రకాష్.

"నీ ప్రాణాలకు తెగించి నువ్వు నన్ను రక్షించావు. నీకు నిజంతెలిస్తే నువ్వైనా ఆ జగపతిరావుపని పడతా

వేమోనని ఆశ!" అంది శోభ.

"జగపతిరావు తన అనుచరుల విషయంలో నిర్దాక్షిణ్యంగా ఉంటాడు. అయినా వాళ్ళెవ్వరూ ఆయనను ద్వేషించరు. వారి అభిమానాన్ని సంపాదించడానికి ఆయన మానవాతీతమైన దేదో చేశాడు. మీ నాన్నవంటి వాళ్ళు సహకరిస్తేనప్ప నేను జగపతిరావునేమీ చేయలేను." అన్నాడు ప్రకాష్ నీరసంగా.

"నువ్వింకేదైనా ఉపాయం చూసుకోవాలి...." అంది శోభ.

"ఉపాయం దొరకాలిగదా!" అన్నాడు సాలోచనగా ప్రకాష్.

శోభ ఉన్నట్లుండి—"నువ్వు నన్ను నిజంగా పెళ్ళి చేసుకుంటావా?" అంది.

ప్రకాష్ తెల్లబోయి - "అదేం ప్రశ్న!" అన్నాడు.

"మానాన్నకు నే నంటే చాలా యిష్టం. నేను నిన్ను ప్రేమించానని తెలిస్తే ఆపైన మనపెళ్ళి జరిగితే—అప్పు డాయన నీకు సాయంచేస్తాడేమో!" అంది శోభ.

"నిన్ను జగపతిరావు రెడ్‌సెల్‌కు పంపిస్తాడంటేనే ఆయనలో చలనంలేదు. ఈ ఉపాయం లాభంలేదు...." అని మామూలుగా అనేసి ప్రకాష్ ఉలిక్కిపడి "ఏయ్.... ఒకవేళ నేను నిన్ను పెళ్ళిచేసుకుంటానంటే నువ్వొప్పుకుంటావా?" అన్నాడు.

"ఊఁ" అంది శోభ చటుక్కున.

"మరి—విశాల్!"

"ఆ చప్పుఘటాన్నా?" అంది శోభ.

"ప్రేమకు చప్పుఘటాలతో నిమిత్తంలేదు. మనసు ప్రధానం...."

"అంటే?"

"నువ్వు నీ మనసులో విశాల్‌నీ నన్ను పోల్చి ఆలోచించు. విశాల్‌ని వదులుకోగలవేమో ఆలోచించు...."

"నాసంగతి సరే - నీ సంగతేమిటి?" అంది శోభ.

"నేను నిన్ను తొలిచూపులోనే నిజంగా ప్రేమించాను...."

శోభ నిట్టూర్చి "ఇదేనా ప్రేమ అంటే?" అంది.

వారి పరిచయానికి పూర్తిగా ఒకరోజు వయసులేదు. అతడామెను బలవంతంగా లాక్కునివెళ్ళి ఓ కార్లో కూర్చోబెట్టి తర్వాత అయిదు నిమిషాలు హైమిచ్చి పారిపోమన్నాడు. ఈ రోజతడు ఆమె తండ్రిని హింసించి బలవంతంగా ఇక్కడకు లాక్కువచ్చాడు.

ఇంతకాలం ఆమె విశాల్‌ని ప్రేమిస్తాననుకుంది. అతడి బలహీనతలను సహించగలననుకుంది. ఈరోజు ప్రకాష్‌ను చూడగానే ఆమె మనసతడివైపు లాగుతోంది. రేపింకా గొప్పవాడెవరైనా తటస్థపడితే....

"అందుకే పెళ్ళి! పెళ్ళి ప్రేమకు ఫుల్‌స్టాప్ పెడుతుంది. ప్రేమించే యువతికి ఎన్నుకునే అధికారముంటుంది. పెళ్ళితో ఆ ఎన్నిక ఆగిపోతుంది. ప్రేమ అప్పుడు వలయాకారంతో ప్రేమించిన వ్యక్తిచుట్టూ తిరుగుతుంది" అన్నాడు ప్రకాష్.

శోభకు మాట మార్చాలనిపించింది "నీ స్నేహితుడు వచ్చీరాగానే నిద్రపోయాడు. ఇంకా లేవలేదేం?" అంది.

"ఆయన మన ఇష్టప్రకారం పడుకుంటాడు. లేస్తాడు ....నీతో కబుర్లు చెప్పడంకోసం నేనే ఆయన్ను నిద్రపుచ్చాను...." అన్నాడు ప్రకాష్.

శోభ అప్పుడు నరసింహం గురించి వివరాలడిగింది.

"అతడొక మానవాతీతవ్యక్తి. బలంతో అతడి కెదురు లేదు. అతడికి నాశనంలేదు. జగపతిరావును నాశనం చేయడానికి నే నతడి నెన్నుకున్నాను...." అన్నాడు ప్రకాష్.

"ఎక్కడ దొరికాడు నీకు?"

"జగపతిరావుకు కాలం తీరింది. అందుకే ఈయన వచ్చాడు...."

శోభ ఉత్సాహంగా "అంటే జగపతిరావు నాశనమవు తాడనే నువ్వు భావిస్తున్నావా?" అంది.

"అవును...."

"మానాన్న సాయపడకపోయినా కూడా...."

"సాయపడతాడనే నా ఆశ. నువ్వందుకు దోహదం చేయాలి...."

"ఏమో - నావల్లకాదేమో!" అంది శోభ.

"నీవల్లనవుతుంది. నువ్వు త్రికరణశుద్ధిగా ప్రయత్నించాలి. అంతే!" అని - "నువ్వు త్రికరణ శుద్ధిగా ప్రయత్నించాలంటే జగపతిరావు చేసిన ఘోరాలు కొన్ని వినాలి.... చెబుతాను విను...." అన్నాడు ప్రకాష్.

అతడు చెబుతూంటే ఆమె వినడం ప్రారంభించింది.

నరసింహం గుర్రుపెడుతూ నిద్రపోతున్నాడు.

24

శల్యరాజు గదిలో ఒంటరిగా కూర్చుని ఉన్నాడు.

ఆయన జగపతిరావుకు ముఖ్యస్నేహితుడు. కానీ ఆయన కా గదినుంచి విముక్తిలేదు.

శల్యరాజుకు భార్య ఉంది. బిడ్డలున్నారు. అందరూ సుఖంగా వున్నారు. కానీ ఆయన వారిని చూడ్డానికివెళ్ళడు. ఎప్పుడైనా వారే ఆయన్ను చూడ్డానికి వస్తారు.

నలుగురికీ తెలిసినప్రకారం -శల్యరాజుకు జీవితమంటే విరక్తి కలిగింది. అడవికిపోయి తపస్సు చేసుకుందామను కున్నాడు. ఆయనను జగపతిరావు బలవంతాన ఆపి - తపస్సుకు కావలసిన ఏర్పాట్లన్నీ తనింట్లో చేశాడు. అడవిలో ఉన్నట్లే ఉంటుందనీ ఆయన కెవరూ తపోభంగం కలిగించరనీ మాట యిచ్చాడు. ఎప్పుడైనా అయినవారు చూడాలనుకుంటే మౌనంగావచ్చి ధ్యానభంగం చేయకుండా ఆయన్ను దర్శించుకుని వెళ్లాలి.

అయితే అసలు కథ అదికాదు.

శల్యరాజు ఆ గదిలో బందీ! ఆ గదిదాటి వెళ్ళడాని కాయనకు అనుమతిలేదు. భార్యాబిడ్డలు చూడవచ్చినప్పుడు చెమ్మగిలిన తన కనులు వారు చూడకూడదనే ఆయన కనులు మూసుకుని ధ్యానంలో ఉన్నట్లు నటిస్తాడు. ఆయన భార్యాబిడ్డలు ఎలా జీవిస్తున్నదీ—జగపతిరావాయనకు వీడియో క్యాసెట్లు చూపిస్తాడు.

శల్యరాజుది దుర్భరమైన జీవితం. ఆయనుకు రాగబంధాలున్నాయి. విరాగి జీవితం బలవంతంగా ఆయనపై విధించబడింది. అందులో ఆయన స్వయంకృతాపరాధమూ ఉంది.

శల్యరాజుకు వాక్శుద్ధి ఉంది. మంచి ఊహాశక్తివుంది. జ్యోతిషంలో ప్రవేశముంది. ఒక విషయం విన్నాక ఏం జరుగుతుందీ ఆయన చెబుతాడు. అందుకు తనకున్న మూడుశక్తులూ ఉపయోగిస్తాడు. సాధారణంగా ఆయన చెప్పినది జరుగుతుంది.

చిన్నతనంనుంచీ శల్యరాజుకు తనశక్తిగురించితెలుసు. అయిదేళ్ళ వయసప్పుడు వాళ్ళింటి కో నడివయస్కురాలు వచ్చింది. ఆమెను చూడగానే అతడు - పాపం - అత్తయ్యా

రెండురోజుల్లో చచ్చిపోతుంది - అన్నాడు. పిడుగులా ఉన్న మనిషి - ఆమె సరిగ్గా రెండురోజుల్లో గుండె ఆగి చచ్చింది. చాలామంది శల్యరాజును పాపినోరు అని తిట్టారు.

శల్యరాజుకు పదేళ్ళప్పుడు క్లాసులో లెక్కల మేస్టారికింకో మంచి ఉద్యోగం వచ్చి వెళ్ళిపోతారని చెప్పాడు. ఆయన ఏ ఉద్యోగానికీ అప్లికేషను కూడా పెట్టి ఉండలేదు. కానీ ఆయన దగ్గరబంధువు కెవరికో ఆస్తి కలిసివచ్చి కొత్తగా వ్యాపారం ప్రారంభించి అందులో మేనేజరుగా రమ్మని మేస్టార్ని కోరాడు.

శల్యరాజుకు పదమూడేళ్ళప్పుడు - పక్కింటి అమ్మాయి అతణ్ణి నిద్ర మాత్రలు తెమ్మని అడిగింది. అతడు వెంటనే - "అక్కా! నువ్వు ఆత్మహత్య చేసుకోవాలనుకుంటున్నావు కదూ!" అన్నాడు. ఆమె అతడి ఊహ కాశ్చర్యపడింది. అప్పుడు శల్యరాజు ఆమెతో - "అక్కా! మొన్నవచ్చిన పెళ్ళివారు చాలా మంచివారు. కట్నం అడిగినప్పటికీ మీ నాన్న ఇవ్వలేనంటే అన్నింటికీ ఒప్పుకుంటారు...." అన్నాడు.

అలాగే జరిగింది.

శల్యరాజు వాక్శుద్ధి గురించి చాలామంది ఆశ్చర్యంగా చెప్పుకునేవారు. జరగబోయేది ముందుగా ఎలా తెలుస్తుందని అడిగితే అతడు తనకలా అనిపిస్తుందని చెప్పేవాడు. అన్నింటికంటే ముఖ్యమైనది - అతడేదైనా విషయం వింటే దాని గురించి భవిష్యత్తు కరెక్టుగా చెప్పగలిగేవాడు. సామాన్యులకంటె అతడి మెదడు మరింత చురుగ్గా విషయాల నాకళింపు చేసుకుంటుందని కొందరనేవారు.

అయితే శల్యరాజుకు జరగబోయేది చెప్పగల శక్తి

మాత్రమే ఉండేది. అతడికి శాపానుగ్రహశక్తి లేదు. తనకు అనిపించినది చెప్పేవాడు తప్పితే అతడు కోరుకున్నది అనిపించేదికాదు.

అతడో అమ్మాయిని ప్రేమించాడు. ఆమె అతణ్ణి ప్రేమించలేదు. అతడు వ్యాపారం చేయాలనుకున్నాడు. వ్యాపారం అతడికి అచ్చిరాలేదు.

అతడిశక్తి అతడికి ఉపయోగపడ్డంలేదు. జోస్యం చెప్పుకుని బ్రతకమని కొందరు సలహా యిచ్చారు. ఆ ప్రయత్నంలో జగపతిరావును కలిశాడతడు.

జగపతిరావుకు శల్యారాజువల్ల బాగా కలిసివచ్చింది. అతడేం చెబితే అది జరిగింది. శల్యారాజును తన ముఖ్య సలహాదారుగా చేసుకున్నాడాయన.

ఆ విధంగా శల్యారాజుకు డబ్బు చేరింది. అతడు భార్యాబిడ్డలను తను కోరుకున్న విధంగా పోషిస్తున్నాడు.

అలా కొన్నేళ్ళు గడిచాయి. శల్యారాజులో ఆత్మవిమర్శ ప్రారంభమయింది. జగపతిరావు తప్పు చేస్తున్నాడనీ - ఆ తప్పుకు తను సహకరిస్తున్నాడనీ ఆయనకు స్పృహ కలిగింది. అప్పుడాయన జగపతిరావును హెచ్చరించడం మొదలుపెట్టాడు. జగపతిరావా హెచ్చరికలను పాటించలేదు. చివరకు శల్యారాజు తను జగపతిరావును వదిలిపోతానన్నాడు. అప్పుడు శల్యారాజు జగపతిరావింట్లో శాశ్వతంగా బందీ అయ్యాడు.

శల్యారాజు గది తలుపులు బయట తాళంవేసి ఉంటాయి. అతణ్ణి చూడగోరినవారు ముందుగా జగపతిరావు అనుమతి తీసుకోవాలి. అప్పుడాయనే స్వయంగా తలుపులు తాళంతీసి వారికి శల్యారాజును చూపిస్తాడు. శల్యారాజప్పుడు ధ్యానముద్రలో ఉంటాడు. ఆయన మనసులో అప్పకోలేంత

దుఃఖం.

ఆ విధంగా శల్యరాజును అయినవాళ్ళు మాత్రమే కాదు - ఎందరో చూసి వెడుతూంటారు. వారిలో మంత్రి వర్యులు, విదేశీయులు కూడా ఉంటారు.

శల్యరాజు గురించి ఆ స్థలాన్ని తీర్థస్థలంగా మార్చమని కొందరు జగపతిరావుకు సూచించారు. అలా చేస్తే శల్యరాజు హిమాలయాలకు వెళ్ళిపోయే ప్రమాదముందని జగపతిరావు వారికి చెప్పుకున్నాడు.

శల్యరాజుకు తను ఖైదునుంచి బయటపడాలన్న కోరిక ఉంది. తన బాధను బయటివారికి చెప్పుకున్నా, తనక్కడ్నించి బయటపడే ప్రయత్నం చేసినా - తన కుటుంబం రెడ్ సెల్ పాలవుతుందని శల్యరాజు భయం. అందుకని ఆయన జగపతిరావు అదుపాజ్ఞల్లో ఉంటున్నాడు. అయితే ఆయన్ను సంతోష పెట్టడంకోసం అబద్ధాలు చెప్పడు. తనకేమనిపిస్తే అదే చెబుతాడు.

జగపతిరావు శల్యరాజువల్ల ఇప్పటికీ ప్రయోజనాలు పొందుతూనే ఉన్నాడు. శల్యరాజు కాయనవద్ద ఎవరికీ లేనంత చనువుంది. జగపతిరావా యన్ను ఇతరులకు తెలియని మరో మార్గంద్వారా ఆ గదిలో కలుసుకుంటాడు. ఆ మార్గం గురించీ, శల్యరాజు గురించీ తెలిసిన మూడో మనిషి రంజన్ మాత్రమే!

ప్రస్తుతం శల్యరాజు గదిలో తీవ్రాలోచనలోఉన్నాడు. ఇంతకాలం ఆయనకు ఎప్పుడూ తన గురించి స్ఫురించలేదు. ఈ రోజేమిటో స్ఫురిస్తోంది.

"నీకు మేలుజరుగుతుంది. నీవు విముక్తుడి వౌతావు." అవి ఎవరో ఆయనకు చెబుతున్నారు.

"నిజంగా అలా జరుగుతుందా?" అన్న ఆశ శల్య

రాజును తీవ్రాలోచనలోకి దింపింది. తనకు బంధవిముక్తి ఏ విధంగా కలుగుతుందీ అన్న విషయమాయనకు స్ఫురించడంలేదు. జగపతిరావుకు పతనం ప్రారంభమైనదన్న విషయం ఆయనకు కొద్దిరోజుల క్రితమే స్ఫురించింది. అయితే తన విముక్తి ఆయన పతనానికి ముందా, వెనుకా అన్నది స్ఫురించడం లేదు.

శల్యరాజింకా అలా ఆలోచనలో ఉండగానే బయట్నించి తలుపులు తెరుచుకున్నాయి. అంటే తనను చూడ్డానికి అయినవాళ్ళెవరో వస్తున్నారన్నమాట!

ఆయన వెంటనే పద్మాసనంలోకీ ధ్యానముద్రలోకీ వెళ్ళిపోయాడు.

గది గుమ్మంవద్ద ప్రకాష్ నిలబడి ఉన్నాడు. అతడికి వెనుకగా నరసింహం ఉన్నాడు. ప్రకాష్ నరసింహంతో— "మీరు గుమ్మంబయటనే కాపలాగా ఉండండి. నేను శల్యరాజుతో మాట్లాడి వస్తాను...." అంటూ తలుపులు దగ్గరగా వేశాడు.

శల్యరాజుకామాటలు వినపడ్డాయి. గొంతు ఆయనకు కొత్తదిగా తోచింది.

ప్రకాష్ ఆయన ముందుకు వెళ్ళి సాష్టాంగపడి — "స్వామీ! తమరు ప్రపంచంమీద విరక్తితో తపస్సు కుపక్రమించారని విన్నాను. కానీ అందుకీ పాపిష్టివాడి ఇల్లే దొరికిందా మీకు?" అనడిగాడు.

శల్యరాజు చటుక్కున కళ్ళు విప్పాడు. ఎదురుగా కనబడ్డ ప్రకాష్‌ని చూసి ఆశ్చర్యపడ్డాడాయన. గదిలో ప్రకాష్ ఒక్కడే ఉన్నాడు జగపతిరావు లేదు.

ఇలా ఎప్పుడూ జరుగలేదు.

"ఎవరునువ్వు?" అన్నాడు శల్యరాజు.

"జగపతిరావు అంతం చూడాలని కంకణం కట్టుకున్న వాణ్ణి. నా పేరు ప్రకాష్...." అన్నాడు ప్రకాష్ గంభీరంగా.

"ఇక్కడికెలా వచ్చావు?"

"ఒక మానవాతీతశక్తి సహాయంతో...."

శల్యరాజుకు జగపతిరావు చేతిలోని కొత్తరేఖ గుర్తు కొచ్చింది.

"ఇక్కడికెందుకొచ్చావ్?"

ప్రకాష్ వివరించాడు.

అతడు శల్యరాజు కథ విని ఉన్నాడు. ఒక మహాత్ముడు జగపతిరావింట్లో ఉండి ఏళ్ళతరబడి తపస్సు చేసుకోవడ మన్నది అసంబద్ధంగా తోచిందతడికి. ఆ మహాత్ముడు అసహాయుడేనా అయుండాలి - లేదా జగపతిరావుకి సాయ పడే మరో క్రూరుడై ఉండాలి. జగపతిరావు రహస్యాలు తెలుసుకోవాలంటే ముందు శల్యరాజును పట్టాలని అతడికి తోచింది.

ఎందుకంటే జగపతిరావు తన అనుచరులనందరినీ బహిరంగంగానే వదిలిపెట్టాడు. వారాయనకు సర్వకాల సర్వావస్థలయందూ విధేయులై ఉంటున్నారు. ఒక్క శల్య రాజు విషయంలోనే ఆయన అన్నీ గుప్తంగా ఉంచాడు. అంటే శల్యరాజు నాయన చంపడు. బయటకు వదలడు. నిజమంటూ ఏదైనా తెలుసుకోవాలంటే శల్యరాజు నుంచే తెలియాలి.

"నీ ఊహాశక్తి నా ఊహాశక్తికంటె గొప్పది" - అన్నాడు శల్యరాజు. ఆయన క్లుప్తంగా తన కథను ప్రకాష్‌కి చెప్పి - "నిన్ను నమ్మవచ్చుననీ నా కథ నీకు చెప్పుకోవచ్చుననీ నాకు తోచింది. అందుకే ఇది చెప్పాను.

నువ్వు తలపెట్టిన కార్యక్రమం జయప్రదం కానున్నదని కూడా నాకు తోస్తోంది. అయితే నా కంతటి అదృష్టమా అనిపిస్తోంది-" అన్నాడు.

"మీ వెనుక ఇలాంటి కథ ఉంటుందని నేనూహించ లేదు. జగపతిరావు దుర్మార్గాల్లో ఒక్కటీ నా ఊహ కందడంలేదు...." అన్నాడు ప్రకాష్.

"ఇక్కడికి నువ్వెలావచ్చావు?" అన్నాడు శల్యరాజు.

"నాకు మానవాతీతశక్తి సాయమున్నదని మీకుముందే చెప్పాను....నేనిప్పుడు ప్రపంచంలో ఎక్కడికైనా వెళ్ళి రాగలను...." అన్నాడు ప్రకాష్.

"మానవాతీతశక్తుల్ని నేను నమ్మను...." అన్నాడు ప్రకాష్.

"అనుభవంలోకి వస్తే తప్ప మానవాతీత శక్తుల్ని ఎవరూ నమ్మలేరు...." అన్నాడు ప్రకాష్ నవ్వుతూ.

"ఇంతకీ నీకు నానుంచి ఏమి సాయంకావాలి?"

"జగపతిరావుకు సంబంధించిన రహస్యాలు మీరు నాకు చెప్పాలి...."

"జగపతిరావుకు భయపడి ఈ గదికి నా జీవితాన్ని పరిమితం చేసుకుని అన్ని బంధాలకూ దూరమైన నేను - నీ కాయన రహస్యాలెలా చెబుతాననుకున్నావు?"

"మీ కథ చెప్పినట్లే?" అన్నాడు ప్రకాష్.

"నా కథ చెప్పింది - నా కథ ముగింపుకోసం కాదు."

"అంటే?"

"ఇక్కడ నీకు నేనేదైనా చెప్పానంటే నా కథ ముగుస్తుంది...."

"మీరు భయపడవద్దు. నా చేతుల్లో నరసింహావతారం ఉంది...." అన్నాడు ప్రకాష్.

"నరసింహావతారమా?" ఉలిక్కిపడ్డాడు శల్యారాజు.

"గది బయట కాపలాగా నిలబడ్డ నరసింహమే నాకు తోడుగా నిలబడిన మానవాతీత శక్తి. ఆ శక్తి అనంతం. అటువంటి శక్తిని అదుపుచేసే సాధనం నా దగ్గరవుంది...." అంటూ ప్రకాష్ తన జేబులోంచి రిమోట్ కంట్రోల్ తీశాడు.

"ఏమిటది?"

శల్యారాజుకు ప్రకాష్ క్లుప్తంగా నరసింహావతారం గురించీ రిమోట్ కంట్రోల్ గురించీ వివరించాడు. ఆయన ఆశ్చర్యంగా— "సైన్సు ఈ విధంగా అభివృద్ధి చెందడం ఎంతైనా వాంఛనీయం." అన్నాడు.

"ఇప్పుడు నాకు సైన్సుతోపాటు మీ సాయంకూడా అవసరం...." అన్నాడు ప్రకాష్.

సరిగ్గా అప్పుడే గదిలో ఏదో గ్యాస్‌లాంటిది ప్రవేశించింది. ఆ విషయం ప్రకాష్‌గానీ, శల్యారాజుగానీ గమనించలేదు. కానీ క్షణాలమీద వారిద్దరికీ స్పృహ తప్పింది. అప్పుడే శల్యారాజు వెనుకనున్న గోడలో మనిషి పట్టేటంత మార్గమేర్పడింది. అందులోంచీ జగపతిరావు గదిలో ప్రవేశించాడు.

ఆయన ముసిముసిగా నవ్వుకుంటూ ప్రకాష్‌ని సమీపించి అతడి చేతిలోని రిమోట్ కంట్రోల్‌ను అందుకున్నాడు.

అప్పుడు జగపతిరావు ముఖంలో విజయగర్వం కనబడుతుంది. ఆయన రిమోట్ కంట్రోలును శ్రద్ధగా గమనించాడు. దానిమీద "స్లీప్" అని వ్రాసివున్న మీట నొక్కాడు. తర్వాత నెమ్మదిగా గది తలుపులు తీశాడు.

గది బయట నేలమీద కూర్చుని గోడకు జారగిలబడి

అపరాధ పరిశోధన పోటీ-213

[ఫలితాలు]

ఏప్రెల్ '86 నెల "అపరాధ పరిశోధన పోటీ—213" కి సరియైన సమాధానాలు:

1. ఫిలిపీన్స్
2. హైదాబాదు
3. రేడియోలు
4. వైద్యరంగం
5. ఆరోగ్యం

పై జవాబుల ప్రకారం ముగ్గురు పాఠకులు మాత్రమే ఆల్ కరెక్టుగా పంపారు. వీరికి జులై '86 నెలనుండి ఒక ఏడాది పాటు "అపరాధ పరిశోధన" మాసపత్రిక లేదా సప్లిమెంట్ (లేదా 6 నెలలపాటు పత్రిక మరియు సప్లిమెంట్) బహుమతిగా పంపబడుతుంది.

(1) శ్రీ యం. చంద్రశేఖర్,
9-2-20, రెజిమెంటల్ బజార్,
సికింద్రాబాదు—500 025.

(2) శ్రీ బి. పరమేశ్వర్,
ఇండియన్ ఆయిల్ డీలర్,
నాగర్ కర్నూలు—509 209.

(3) శ్రీమతి నాగపుష్పవల్లి,
బోస్ రోడ్,
తెనాలి (గుంటూరు జిల్లా)

నిద్రపోతున్నాడు నరసింహం.

"ఇప్పుడు వీళ్ళను రెడ్ సెల్ కి పంపించాలి!" అనుకున్నాడాయన.

25

"ప్రకాష్‌నుంచి కబురేమైనా అందిందా?" అనడిగాడు జయరాజ్ ఆత్రుతగా.

"లేదండి-" అన్నాడు సూర్యం.

"కబురు రాగానే నాకు చెప్పు...." అని లాబొరేటరీలోకి వెళ్ళిపోయాడు జయరాజ్. అక్కడ అతడు అసహనంగా చాలాసేపు పచార్లు చేశాడు.

ప్రకాష్ అతడికి ఎప్పటికప్పుడు సమాచారం అందజేస్తూనే ఉన్నాడు. అతడు నరసింహాన్ని తీసుకుని శ్రీకాంత్ ఇంటికి వెళ్ళి శోభను హోటలు గదికి తీసుకువెళ్ళడం అతడికి తెలుసు.

అయితే జయరాజ్‌ను బాధిస్తున్న భయం ఒక్కటే!

నరసింహం ఊళ్ళో విచ్చలవిడిగా సంచరిస్తూ వీరవిహారం చేస్తున్నాడు. అతడి గురించి జగపతిరావుకింకా తెలియకుండా ఉంటుందా?

విన్నటిదినం ప్రకాష్ జగపతిరావుపేరుతో ఓ కిడ్నాపింగ్‌కు ప్రయత్నించాడు. అదాయన దృష్టికి వెళ్ళదా?

జగపతిరావుకు వెయ్యికళ్ళు.

ప్రకాష్ తను శల్యారాజును చూడబోతున్నట్లు చెప్పాడు. నరసింహం సాయముండడంవల్ల అదతడికి సాధ్యపడుతుందనే తన నమ్మకం. అయితే జగపతిరావును తక్కువ అంచనా వేయడానికి లేదు.

మానవాతీతశక్తులే మానవమేధకు లొంగిపోతున్నాయి.

"హోమ్ డెలివరీ"

1. 'హోమ్ డెలివరీ' లో పాఠకులు ఎవరైనను చేరవచ్చును. దీనికి మీరు చేయవలసిందల్లా సభ్యత్వ రుసుము రు. 10/-లు పంపటమే. సొమ్ము చేరగానే మీకు సభ్యత్వము ఇవ్వబడుతుంది.

2. సభ్యులకు "అపరాధ పరిశోధన" పత్రికలు వాటి అసలు ధరకే లభిస్తాయి. అంతేకాదు—వారికి పత్రికలన్నీ 'రిజిష్టరు పోస్టు' లో అందజేస్తాము. ప్రతి 6 నెలలకు ఒకసారి అంటే-జనవరి మరియు జూలై నెలల పత్రికలు మాత్రం వి.పి. ద్వారా పంపబడతాయి. వి.పి. వచ్చినప్పుడు మీరు పోస్టుమాన్‌కు అర్థ సంవత్సర చందా చెల్లించవలసి వుంటుంది. పోస్టు ఖర్చులన్నీ (ఏడాదికి రు. 48/-లు) మేమే భరిస్తాము. పత్రికల ఖరీదుకు మించి మీరు పైసా చెల్లించనవసరం లేదు.

3. 'అపరాధ పరిశోధన' మాసపత్రిక మరియు సప్లిమెంట్‌కు కలిపి అర్థసంవత్సర చందా రు. 84/-లు మాత్రమే. మధ్యలో సభ్యులుగా చేరినవారికి మాత్రం తర్వాత నెలలకు లెక్కవేసి మొదటి వి.పి. పంపబడుతుంది.

4. ఏ కారణం చేతనైనా మీకు పంపిన వి.పి. తిరిగొస్తే, ఆ వి.పి. పైకము మీరు వెంటనే M O. చేయాలి. లేనిచో, మీ సభ్యత్వము అంతటితో రద్దవుతుంది. మీ చిరునామా మారినప్పుడు వెంటనే మాకు తెలియజేయాలి. ఆ సమయంలో మీ సభ్యత్వము నెంబరు మారే అవకాశం వుంది. కావున మీకు ప్రతి నెలా వచ్చే ప్యాకెట్ పై-మీ పేరుకు ముందు వుండే నెంబరును మాత్రమే ఉత్తర ప్రత్యుత్తరాలలో వ్రాయగోర్తాము.

5. సభ్యులకు ప్రతి నెలా V.P. ద్వారా పత్రికలు తెప్పించుకునే సౌకర్యంకూడా వుంది. అయితే వి.పి. ఖర్చులుకూడా వారే భరించవలసి వుంటుంది. ఈ పద్ధతిలో పత్రికలను ఏ నెలకానెల రు. 17-60 లు చెల్లించి పొందవచ్చును. యీ సౌకర్యం కావలసిన వారు మాకు ప్రత్యేకంగా తెలియజేయాలి.

హోమ్ డెలివరీ!—పత్రికలకు గ్యారంటీ!!

మానవ నిర్మితమైన నరసింహావతారం జగపతిరావును లొంగదీయగలదా?

శల్యారాజును చూడడం విషయంలో ప్రకాష్ కొంత తొందరపడ్డాడని తర్వాత జయరాజ్‌కు అనిపించింది.

ప్రకాష్‌లో దుడుకుతనముంది. శోభను కిడ్నాప్ చేయడాని కతడు నరసింహాన్నుపయోగించుకున్న పద్ధతి ప్రమాదకరమైనది. ఆ పద్ధతి శ్రీకాంత్ మీద పనిచేసినట్లు జగపతిరావు మీద పనిచేయకపోవచ్చు.

శల్యారాజుకంటే ముందుగా అతడు నందనరావును కలుసుకుని ఉండాల్సింది. కానీ యిప్పుడు చేయగలిగినదేముంది?

జయరాజ్ ఆలోచిస్తూండగా ఫోన్ మ్రోగింది. రిసీవర్ తీసి హలో అన్నాడు. అవతల సూర్యం గొంతు పలికింది.

"ప్రకాష్‌నుంచి ఏదైనా కబురందిందా?"

"లేదుసార్: కానీ సత్యేంద్రకుమార్ నుంచి కబురందింది."

"సత్యేంద్రకుమార్ నించా? ఏమన్నాడు?"

"సరిగ్గా ఇంకో రెండు గంటల్లోవచ్చి మిమ్మల్ని కలుస్తానన్నాడు. మీకు కనెక్షనివ్వనా అంటే వద్దన్నాడు. అన్నీ మీకు స్వయంగా చెప్పుకుంటానన్నాడు...."

"సరే" అని ఫోన్ పెట్టేశాడు జయరాజ్. ఇప్పుడతడి మనసెంతో తేలికపడింది. ఏమనిషి గురించి తానెదురు చూస్తున్నాడో ఆ మనిషి వచ్చేస్తున్నాడు. తన సమస్యలన్నీ పరిష్కరించబడినట్లే!

ఇప్పుడీ సమయంలో సత్యేంద్రకుమార్ తిరిగిరావడం తనకు శుభసూచన. అంటే ప్రకాష్ కూడా క్షేమంగా తిరిగి వస్తాడు. అతడు వెళ్ళినపని జయప్రదమవుతుంది.

అపరాధ పరిశోధన పోటీ-215

ఈ క్రింద కొన్ని ప్రశ్నలు, వాటి పక్కనే జవాబులు కూడా ఉన్నవి. మీరు సరియైనదని వూహించిన జవాబును, నెంబరు వారీగా ఒక (పోస్టుకార్డు సైజు) తెల్ల కాగితం పై వ్రాసి, దానితో రూ 1.00 విలువగల పోస్టలు స్టాంపులు జతపరచి పంపండి. ఆల్ కరక్టుగా పంపిన వారికి ఒక్కొక్కరికి ఒక ఏడాదిపాటు పత్రిక లేదా సప్లిమెంట్ ఉచితంగా పంపుతాము.

దీనిలో ఎవరైనను పాల్గొనవచ్చును. ఒక్కొక్కరు మూడు కూపన్లకు మించి పంపరాదు. ప్రతి కూపనుకీ రు. 1.00 పోస్టలు స్టాంపులు జతపరచాలి. స్టాంపులు వేటికి అతికించకూడదు. ప్రతి కూపను వెనుక మీ పూర్తి చిరునామా, హో. డె. సభ్యులైతే వారి నెంబరు కూడా స్పష్టంగా వ్రాయాలి.

మీ జవాబులు 7-6-'86 తేదీలోగా మాకు చేరాలి. ఫలితాలు ఆగస్టు '86 నెల సంచికలో ప్రచురిస్తాము. *

1. ఈ దేశంపై అమెరికా బాంబుల వర్షం కురిపించింది—?
(క్యూబా, లిబియా)

2. వీరిని చూస్తే పిల్లలకు హడల్—?
(పంతుళ్ళను, పోలీసులను)

3. ఈ వ్యాధికి సరియైన మందు లేదు—?(ఎయిడ్స్, రాబిస్)

4. వీటిని దేశంలో తయారుచేసే వనరులు పుష్కలంగా వుండికూడా ఇంకా మనం విదేశాల నుండే దిగుమతి చేసుకుంటున్నాము—? (ఎరువులు, న్యూస్ ప్రింటు)

5. వీధిలో కుక్కల బాధ. ఇంటిలో—?
(ఎలుకలు, దోమలు)

ఈలోగా తనే ఓసారి నందనరావును కలుసుకోవాలని జయరాజ్‌కి అనిపించింది. కొన్ని రహస్యాలు తెలుసు కునేందుకు_అతణ్ణి మినహాయిస్తే వేరే దారి లేదనిపిస్తోంది.

జయరాజ్ లాబొరేటరీలోంచి బయటకువచ్చి - ఓ గంటలో వస్తానని సూర్యానికి చెప్పి కార్లో నందనరా వింటికి వెళ్ళాడు.

ఇంట్లో నందనరావు లేడు. చంప ఉంది.

జయరాజ్ ఆమెకు తన్నుతాను పరిచయం చేసు కున్నాడు. నరసింహావతారం గురించి చెప్పాడు. జగపతి రావు నందనరావునెలా అంతం చేయబోయినదీ చెప్పాడు. అంతావిని చంప జరిగిందంతా ఆకళింపుచేసుకుని - "వారు సింహం గుహలో పనిచేస్తున్నారు. అక్కణ్ణించి ఎలా తప్పించాలో తెలియడంలేదు" అంది.

"అతడు మాకు సహకరిస్తే అంతా చాలా సులభం. కానీ ఎందువల్లనో అతడు మాకు సహకరించడంలేదు."

"జగపతిరావుకు వ్యతిరేకంగా మాట్లాడితే నన్నే ఆయన క్షమించరు. కానీ...." అని ఆగింది చంప.

"ఊఁ" అన్నాడు జయరాజ్ ఆత్రుతగా. ఆమె ఏం చెబుతుందోనని అతడికి కుతూహలంగా ఉంది.

చంప ఆలోచనలో పడింది.

జగపతిరావు ప్రమాదకరమైన మనిషని ఆమెకు తెలుసు. జయరాజ్‌ని నమ్ముకుని భర్తను ఆయనకు వ్యతి రేకని చేస్తే మొత్తం కుటుంబం గల్లంతవుతుంది.

జయరాజ్ ఆమెవంకే చూస్తున్నాడు. మానభంగానికి గురికాబోయి నరసింహం సాయంతో చివరిక్షణాల్లో తప్పించుకోగలిగిందామె. బాబునుంచి విడదీయబడి ఒక రోజు నరకం అనుభవించింది. నరసింహమే వారిద్దరినీ

శ్రీ మహాలక్ష్మి వారి సరికొత్త నవలలు

విడుదలైనవి!

1. పడమట సంధ్యారాగం-మల్లాది వెంకట కృష్ణమూర్తి 18.00
2. మిసెస్ పరాంకుశం ,, 15.00
3. మోహనరాగం (డైరక్టు నవల) 'మీరా' లక్ష్మి 18.00
4. శీతాగ్ని చిఘాళల పురుషోత్తం 15.00
5. మల్లెమొగ్గలు భట్టిప్రోలు కృష్ణమూర్తి 20.00
6. పదమూడేళ్ల అమ్మాయి వసుంధర 18.00
7. నవ్వితే నవ్రత్నాలు 'మల్లిక్' 16.00

నేడే అడ్వాన్సుతో పాటు మీ ఆర్డరు పంపండి.

ఫోన్ నెం: 63322

శ్రీ మహాలక్ష్మి బుక్ ఎంటర్‌ప్రైజెస్

మ్యూజియం రోడ్, గవర్నరు పేట,

విజయవాడ-520002.

దరిజేర్చాడు. ఆ నరసింహంమీద ఆమె కిప్పుడు నమ్మకం అభిమానం పెరిగిఉండాలి. జగపతిరావుపై కసి, ద్వేషం-పెరిగిఉండాలి. ఏమాత్రం వీలున్నా ఈమె తనకు సాయపడాలి.

చంప కాసేపయ్యాక నిట్టూర్చి- "నాకో ఉపాయం తెలిసింది." అంది. అప్పుడామె కనుపాపలు విచిత్రంగా గిరగిరా తిరిగాయి.

"ఏమిటది?"

"జగపతిరావు చెడ్డపనులు చేస్తున్నాడనీ, లోకకంటకుడాయననీ నా భర్తకు తెలుసు. కానీ ఆయనకు వ్యతిరేకంగా పనిచేయరు. అలా పనిచేయాలంటే ఒక్కటే మార్గముంది...." అంది చంప.

"ఏమిటది?" అన్నాడు జయరాజ్. అతడి ఆత్రుత పెరుగుతోంది.

చంప చెప్పింది.

శోభను జగపతిరావు కిడ్నాప్ చేయబోయినప్పుడామెకు చంప సాయపడాలనుకుంది. నందనరావు కిష్టంలేదు. అప్పుడు చంప అతడితో కర్ణుకి స్వామిభక్తి దుర్యోధనుడి చావుకు కారణమయిందని చెప్పింది. నందనరావు భయపడ్డాడు.

జగపతిరావు చేసే ప్రతి చెడ్డపనీ అతడిని నాశనానికి దగ్గరచేస్తోందని బెదిరిస్తే నందనరావు అతడిని కాపాడ్డం కోసం మరోవిధంగా ప్రయత్నిస్తాడు. జగపతిరావుకు నీతులుచెప్పే ధైర్యం లేదతడికి. కానీ ఆయన రహస్యాలు చాలా తెలుసు. తెలుసుకోగలడు.

నిన్ననే బాబు పుట్టిన రోజయింది. అదయ్యాక ఆమె భర్తతో "మనకులాగే జగపతిరావు కూడా కలకాలం

ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ

ఈ నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలను పరిశీలించండి. రెండు ముఖచిత్రాలకు (1. అట్టమీది బొమ్మ, 2. అట్ట చివరి బొమ్మ) సంబంధం వుండేట్లుగా చక్కని వ్యాఖ్యలను ఒక్క మాటలోగాని, చిన్న వాక్యంలోగాని వ్రాసి పంపండి.

ఒక్కొక్కరు ఎన్ని వ్యాఖ్యలైనా పంపవచ్చును. మీ వ్యాఖ్యలు పోస్టు కార్డుపైన మాత్రమే వ్రాయాలి. సప్లిమెంట్‌కు వ్యాఖ్యలను పంపేవారు విడిగా వేరొక కార్డుపై వ్రాసి పంపాలి. 'హోమ్ డెలివరీ' సభ్యులు అయితే తమ నెంబరును విడిగా వ్రాయాలి.

అత్యుత్తమమైన వ్యాఖ్యలు పంపిన ఇద్దరు పాఠకులకు ఏడాదిపాటు పత్రికను (లేదా 6 నెలలపాటు పత్రిక మరియు సప్లిమెంట్‌ను) బహుమతిగా పంపుతాము. మీ వ్యాఖ్యలు 7-6-'86 తేదీ లోపల మాకు చేరాలి. ఫలితాలు ఆగస్టు '86 నెల సంచికలో ప్రకటిస్తాము.

ఏప్రెల్ '86 పోటీ ఫలితాలు

(1) ఏప్రెల్ '86 నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలకు బహుమతి పొందిన వ్యాఖ్య:

గెరిల్లాతో తంట!

గరుడాశ్వంపై జంట!!

పంపినవారు: శ్రీ ముప్పిడి రాంచెందర్, 18-50, కంట్రాక్టర్ బస్తీ. బెల్లంపల్లి—504 251.

(2) "సప్లిమెంట్"కు బహుమతి పొందిన వ్యాఖ్య:

మదిలో మధుర భావాలు!

ఎదలో అగ్నిజ్వాలలు!!

పంపినవారు: శ్రీ ఆర్. జీవన్, హెటాకలాన్, వయా—వంథం, నిజామాబాద్ జిల్లా.

సుఖంగా ఉండాలి. ఆయన దగ్గర అంతులేని ధనరాశు లున్నాయి. ఉన్నదానితో తృప్తిపడి సుఖంగా జీవించడం ఆయనకు చాలామంచిది. కానీ ఆయనలా వినడు. మనం చేయగలిగిందల్లా ఒక్కటే! ఆయనచేసే ప్రతి పాపాన్నీ భగవంతుడిముందు చెప్పి అయన్ను క్షమించవలసిందిగా భగవంతుణ్ణి ప్రార్థిద్దాం" అంది.

"అలాచేస్తే ఆయనకు మేలు జరుగుతుందా?" అన్నాడు నందనరావు.

అప్పుడు చంప అతడికి తులసీ జలంధరుల కథ చెప్పింది. తులసిచేసే ప్రార్థనలు - జలంధరుడి పాపాలను కడిగివేయడమేకాక - ఎప్పటికప్పుడు అతడికి కొత్త బలాన్ని చేకూర్చుతూండేది.

నందనరావుకీ పాయింటు నచ్చింది. ఇకమీదట జగపతిరావు పాపాల వివరాలు సేకరించగలనని ఆమెకు మాట యిచ్చాడు.

"నేను ఇప్పుడెంత సమాచారాన్నయినా ఆయననుంచి రాబట్టగలను" అంది చంప.

"యూ ఆర్ రియల్లీ ఏ జీనియస్—" అన్నాడు జయరాజ్ అభినందనపూర్వకంగా - "ఈ ఉపాయం నాకు తట్టలేదు. కేవలం తర్కంతోనే కొన్ని విషయాలు సాధించవచ్చునని మరిచి అన్నింటికీ సైన్సుమీదే ఆధారపడ్డాను నేను...."

అతడి పొగడ్తలకు చంప సిగ్గుపడి — "మొన్నటి అనుభవం తర్వాత జగపతిరావు అంతం చూడాలని నాకూ ఉంది" అన్నది.

"ఇదే ఉపాయం శోభకూ చెప్పాలి...." అనుకుంటూ జయరాజ్ లేచి ఆమెవద్ద సెలవు తీసుకుని గుమ్మందగ్గరకు

రచయిత (స్త్రీ) రాసే ప్రతి నవలా ఒకేలా చాలా బాగుండవు!

దర్శకుడు తీసే ప్రతి సినిమా ఒకేలా హిట్టవవు!

క్రికెట్ ఆటగాడు ప్రతి మ్యాచ్‌లోనూ సెంచరీ కొట్టలేడు!

కానీ ...

రచయిత (స్త్రీ) రాసిన కొన్ని నవలలు చాలా బాగుంటాయి!

దర్శకుడు తీసిన కొన్ని సినిమాలు హిట్టవుతాయి!

క్రికెట్ ఆటగాడు కొన్ని మ్యాచ్‌లలో సెంచరీలు కొట్టగలడు!

అలా చాలా బాగా రాసిన నవల కాబట్టే
శ్రీమతి యద్దనపూడి సులోచనారాణి డైరెక్ట్ నవల

పవౌన పోరాటం (వెల రూ. 20/-)

12,000 కాపీలు ఒకేసారి ఒకే ఎడిషన్‌గా ప్రచురించగలిగాము. నమ్మకపోతే కొని చదవండి! నమ్ముతారు!

నమ్మితే మరి ఆలస్యం ఎందుకు? కొని చదవండి! 30-4-'86 లోపు కొంటే రూ. 2000/-ల "లక్కీ-లాటరీ స్కీమ్"లో పాల్గొని మీ అదృష్టాన్ని పరీక్షించుకో వచ్చు కూడా!

పోస్టులో తెప్పించుకోదలిస్తే రూ. 10/- ఎమ్.ఓ. చేయండి. మిగతా రూ. 10/-లకి వి.పి. పెట్టి పంపిస్తాము.

ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్,

3237, రాష్ట్రపతి రోడ్, సికింద్రాబాద్ - 500 003.

వచ్చాడు.

అక్కడ ఇద్దరు దృఢకాయులున్నారు. ఇద్దరిచేతుల్లోనూ రివాల్వర్లున్నాయి.

"నీకోసం కారు సిద్ధంగా వుంది. పోదాం పద—" అన్నాడు వారిలో ఒకడు.

"ఎక్కడికి?" అన్నాడు జయరాజ్.

"రెడ్ సెక్‌కి:"

ఆ మాట విన్న చంపకు వళ్ళు జలదరించింది. "పాపం—జయరాజ్!" అనుకుందామె. అంతకుమించి తనేమీ చేయలేనని ఆమెకు తెలుసు.

26

"అతడి కళ్ళకు గంతలు విప్పండి—" అన్నాడు జగపతిరావు.

అనుచరు లిద్దరూ జయరాజ్ కళ్ళు విప్పారు.

"వెల్‌కం మిస్టర్ జయరాజ్!"

జయరాజ్ కళ్ళు నులుముకుని చుట్టూ చూశాడు.

అది ఒక హాలు. చుట్టూ తుపాకీలు ధరించిన దృఢకాయులున్నారు. నేలమీద నరసింహం పడుకుని వున్నాడు. రెండు చేతులూ వెనక్కు విరిచి కట్టబడి ప్రకాష్ అతడి పక్కనే ఉన్నాడు.

ఎదురుగా జగపతిరావు. అతడి చేతిలో నరసింహావతారం రిమోట్ కంట్రోల్!

"నీ నరసింహం నిద్రపోతున్నాడు. చూశావా?" అన్నాడు జగపతిరావు. (ఇంకా వుంది)

Edited and Published by S. DAMODAR REDDY
3-4-554 Narayanaguda, Hyderabad-500 029,
and Printed at Kranti Press, Madras-600001.